సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ https://www.suryaepaper.com

శుక్రవారం | 27 ఫిబ్రవరి 2026 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 129

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం శుక్ల పక్షం, ఏకాదశి రా.10.34, ఆరుద్ర ఉ.11.07, వర్జ్యం రా.10.25 నుంచి 11.55 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.50 నుంచి 9.35 వరకు తిరిగి మ.12.36 నుంచి 1.21 వరకు

## త్వరలో భారత్ - ఇజ్రాయెల్ స్వేచ్ఛా
# వాణిజ్య ఒప్పందం

● ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో భారత ప్రధాని మోడీ భేటీ ● ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక చర్చలు, తుదిరూపును తీసుకునేలా చర్యలు ● రక్షణ రంగంలో సరికొత్త దిశను చూపిస్తుందనే ఆశాభావం ● ఇరు దేశాల అధ్యక్షులు మీడియాతో ముఖాముఖి



6 లో

భారత్ - ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) త్వరలోనే తుదిరూపును తీసుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. ఈ డీల్ ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్‌లో భారతదేశ యూపీఐను వినియోగంలోకి తేవడంపైనా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నామని చెప్పారు. పౌర అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల్లోనూ భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తాయన్నారు.

# మావోలకు మరో ఝలక్



6 లో

## ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు హతం

మావోయిస్టులు మరో సారి ఎదురుకాల్పులు జరిపారు.. అయితే ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలకు, నక్సలైట్లకు మధ్య భారీ ఎదురు కాల్పులు జరిగాయి. దీంతో జిల్లాలోని జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రావతి నది పరీవాహక అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

## ఆకలినైనా సహిస్తాం
# ఆధిపత్యాన్ని ఒప్పుకోం



2 లో

● కాకతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన ఘనత సమక్క, సారక్కలది ● గ్రూప్1, 2 అధికారుల శిక్షణా శిబిరంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ● టీజీపీఎస్సీ ప్రక్షాళన చేశామని స్పష్టీకరణ

తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని స్వీకరించరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు వ్యతిరేకంగా కొట్లాడేవారు శ్రీమంతులు కాదని పేర్కొన్నారు. సమక్క, సారక్క, కాకతీయులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు.

# నిలకడగా స్టాక్ మార్కెట్లు

● స్వల్ప లాభాలతో నిఫ్టీ, స్వల్ప నష్టాలతో సెన్సెక్స్ క్లోజ్ ● హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరు ● మీడియా, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లపై అమ్మకాల ఒత్తిడి ● మార్కెట్లకు అండగా నిలిచిన విదేశీ, దేశీయ సంస్థల కొనుగోళ్లు



5 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
# నిర్మాణంలో రాజీ పడొద్దు

● కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాలు ● వాటి కల్పనపైన దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం ● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలుపై దృష్టి పెట్టాలని సూచన




3 లో

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు.

న్యాయవ్యవస్థను అగౌరవపరిచే
## ఉద్దేశం లేదు



6 లో

● ఎన్సీఈఆర్టీ వివాద బాధ్యులను గుర్తిస్తాం ● వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం ● కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ● ఆర్ఎస్ఎస్ పాత్రపై విచారణ చేయాలని కాంగ్రెస్ డిమాండ్

## పరీక్షలు ప్రశాంతంగా
# రాయాలి


● విద్యార్థులకు 10వ తరగతి తొలి మెట్టు ● రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




3 లో

విద్యార్థులు మానసిక ఒత్తిడి , భయం వీడి ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలకు హాజరుకావాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం స్టాన్లీ బాలికల పాఠశాల ఆడిటోరియంలో విద్యాశాఖ, సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తో కలసి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## అంతా ఇంతే!




అందరూ ధనవంతులైతే మన మాట వినరేమో కామ్రేడ్ !

## 99 డేస్ యాక్షన్ ప్లాన్‌కు
# కేబినెట్ సబ్ కమిటీ



3 లో

రాష్ట్రంలో పాలన మరింత సమర్థంగా సాగేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల్లో అమలు చేయాల్సిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్) రూపొందించి అమలు చేయడానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసి అమలు దిశగా అడుగులు వేయనుంది. ఈ సబ్ కమిటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## విద్యార్థుల ఫీజు
# బకాయిలు ఇవ్వండి

● ఏడువేల కోట్ల ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి ● ఫీజుల నిధుల విడుదల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తుంది ● మార్చ్ 16 అసెంబ్లీ సమావేశాలు జరిగే లోపు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి ● సీఎస్‌ను కలిసిన బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



3 లో

## పేదలే ఇందిరమ్మ
# ప్రభుత్వం పేటెంట్

● వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే ● బాధితులకు ఇంటి స్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది ● ప్రభుత్వ ప్రగతిని చూడలేని కేసీఆర్ కో విష ప్రచారం ● మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజేపీ నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు.



2 లో

సూర్య






# ఆకలినైనా సహిస్తాం... ఆధిపత్యాన్ని ఒప్పుకోం

- కాకతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన ఘతన సమక్క, సారక్కలది
- గ్రూప్1, 2 అధికారుల శిక్షణా శిబిరంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- టీజీపీఎస్సీ ప్రక్షాళన చేశామని స్పష్టీకరణ



హైదరాబాద్ : తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని స్వీకరించరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు వ్యతిరేకంగా కొట్లాడేవారు శ్రీమంతులు కాదని పేర్కొన్నారు. సమక్క, సారక్క, కాకతీయులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. హైదరాబాద్లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న గ్రూప్1, 2 అధికారుల వెలిడిక్టరీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందులో 271 మంది గ్రూప్1, 171 మంది గ్రూప్2 అధికారులు, 51 మంది మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు ఉన్నారు.

**టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం :**

స్వాతంత్ర్యానంతరం నల్గొండ పార్లమెంటు నుంచి రావి నారాయణరెడ్డి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచారని అన్నారు. బూర్గుల రామకృష్ణరావు, పీవీ తెలంగాణ నుంచి పార్లమెంట్కు ప్రాతినిధ్యం వహించారన్నారు. గ్రూప్-1 పరీక్షలను నిర్వహించి నియామక పత్రాలను అందిస్తున్నామన్న సీఎం ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్మకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామన్నారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అభ్యర్థుల తరపున పోరాటం చేశామని గుర్తుచేశారు. కోర్టుల్లో వాదనలు బలంగా వినిపించామన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను కుటుంబసభ్యులుగా భావిస్తుందన్నారు.

**న్యాయస్థానాల్లో లిటిగేషన్లు పెట్టారు :**

బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించామని, అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులనే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోందని, వారి ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని చెప్పారు. ఉద్యోగులే తమ కళ్లు, తమ ప్రతినిధులని కొనియాడారు. తాము ఎన్ని పాలసీలు చేసినా దానిని అమలులో ఉద్యోగులే చాలా ముఖ్యమన్నారు.

ఇదొక ఎమోషన్ : మెకానికల్గా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను కలవటానికి రాలేదన్న సీఎం ఇదొక భావోద్వేగమని తెలిపారు. చిత్తశుద్ధితో పని చేసి గ్రూప్-1 అధికారులు ఐఏఎస్లుగా ఎంపిక కావాలని చెప్పారు. ఇందులో నుంచి కొద్దిమందే ఐఏఎస్ ఐపీఎస్లుగా అవుతారని మీపై ఉన్న బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులను ఉద్దేశించి మన మూలాలు, నేపథ్యం గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు.

మరో ఆరు నెలల్లో హైదరాబాద్కు హార్వర్డ్ : ముందుగా నిరుద్యోగుల నుంచి ఉద్యోగులుగా మారిన వారందరూ ఇప్పుడు తల్లిదండ్రులను మంచిగా చూసుకోకపోతే విఫలంగానే భావిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తల్లిదండ్రులను చూసుకోకపోతే వారి జీతాల నుంచి 10 నుంచి 15 శాతం కోత విధించే పాలసీ రాబోయే అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు. ఈ మధ్య తాను కూడా హార్వర్డ్ యూనివర్సిటిలో స్టూడెంట్గా వెళ్లానన్న సీఎం ఎంసీహెచ్ఆర్డీ హార్వర్డ్ మధ్య ఎంవోయూ చేస్తానని ప్రకటించారు. మరో ఆరు నెలల్లో హార్వర్డ్ యూనివర్సిటీ ఎంసీహెచ్ఆర్డీకి రాబోతుందన్నారు. హార్వర్డ్ను హైదరాబాద్కు తీసుకొచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

# హైదరాబాద్లోనే ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు రాణించాలంటే చదువు ఒక్కటే మార్గం అని వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమాన లభించాలంటే చదువు ఒక్కటే మార్గామని ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాను అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. గురువారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్లోని అంబేద్కర్ భవన్ను మరియు కాచిగూడ లోని ఎస్సీ హాస్టల్ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్ను మోడర్న్ కోచింగ్ హబ్గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

**కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు..**

కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందని మంత్రి తెలిపారు. దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. సివిల్స్, గ్రూఫ్1 గ్రూఫ్2 కోచింగ్ కోసం మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు.

**ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు..**

ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రతినిధిత్వం పెరిగే విధంగా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. తమిళనాడు మోడల్లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పేద విద్యార్థి నుంచి ఒక మంచి అడ్మినిస్ట్రేటర్గా (పరిపాలకుడిగా) తీర్చిద్దిదాలనే అనే సంకల్పంతో మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్

- వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది
- ప్రభుత్వ ప్రగతిని చూడలేని కేసీఆర్ కో విష ప్రచారం
- వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నా మారని బీఆర్ఎస్ వైఖరి
- కాళేశ్వరం ప్రాజెక్ట్లో బీఆర్ఎస్ అవినీతికి బిజేపీ సహకారం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి-మంచి సలహాలు సూచనలు ఇవ్వాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్




రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజేపీ నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు. అంతేగాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసింది. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తాం. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పెటెంట్. ఈవిషయంలో నిజంగా పేదలపై బిఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుంది. వారి హయాంలోనే లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడం, అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగింది. నాలుగేళ్లలో 168 టిఎమ్సీ నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసీల నీటిని సముద్రం పాలుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్ఎస్ కు ఎటీఎం గా మారిందన్న బిజేపీ నేతలు బిఆర్ఎస్ తో చేతులు కలిపారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సిబిఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీస స్పందించలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్ట్ లను మేం పూర్తి చేస్తున్నాం. 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలి. వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

# మ్యూల్ ఖాతాల గుర్తింపునకు ఆపరేషన్ క్రాక్డౌన్

హైదరాబాద్ : రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ దోపిడీలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. తాజాగా డిజిటల్ మోసాలకు కళ్లెం వేసేలా కీలక ఆపరేషన్ను నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలకు పాల్పడే కేటుగాళ్లకు వెన్నెముకలా వ్యవహరించే మ్యూల్ ఖాతాదారులను కట్టడి చేసేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సైబర్ నేరాల నెట్వర్క్ను ఛేదించడమే లక్ష్యంగా ఆపరేషన్ క్రాక్డౌన్ పేరిట ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. వేల ఖాతాలకు సైబర్ నేరాలతో ప్రమేయం : మ్యూల్ ఖాతాల గుర్తింపునకు చేపట్టిన ఈ కీలక ఆపరేషన్ను టీజీసీఎస్బీ రాష్ట్రంలోని 16 పోలీస్ యూనిట్ల పరిధిలో ఏకకాలంలో నిర్వహించింది. ఇందుకుగానూ 512 మంది పోలీసులతో కూడిన 137 ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమికంగా మొత్తం 1,888 అనుమానిత మ్యూల్ ఖాతాల కేవైసీలను పరిశీలించారు. అయితే, ఇందులో దేశవ్యాప్తంగా 9,431 ఖాతాలు సైబర్ క్రైమ్కు సంబంధించిన లావాదేవీలతో ప్రమేయం ఉండగా, తెలంగాణలో 782 అకౌంట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో రికార్డు స్థాయిలో : కొన్ని మ్యూల్ ఖాతాల లావాదేవీలు వందల సంఖ్యలో డిజిటల్ మోసాల ఫిర్యాదులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశేషంగా హైదరాబాద్లోని సుల్తాన్ బజార్ ప్రాంతంలో ఉన్న ఓ బ్యాంకుకు చెందిన ఖాతా ఏకంగా 496 సైబర్ నేరాలతో ముడిపడినట్లు తేలింది. దీని తర్వాత సూర్యాపేట జిల్లాలోని నాలుగు బ్యాంకుల్లో 298 అకౌంట్లు సైబర్ నేరాల్లో పాలుపంచుకున్నాయని తనిఖీల్లో వెల్లడైంది. కాగా, ఓ ప్రకటనలో డీజీపీ శివధర్ రెడ్డి ఈ కార్యాచరణను చేపట్టిన టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖాగోయల్కు చెందిన బృందాన్ని అభినందించారు. అసలేంటీ మ్యూల్ ఖాతాలు? : మనం తరచుగా అప్పుడప్పుడు వార్తల్లో ఈ మ్యూల్ ఖాతాల గురించి వినే ఉంటాం.

# రాష్ట్రం అంతా అవినీతిమయం

- మంత్రి కార్యాలయం మొదలు.. కింది స్థాయి ఉద్యోగి వరకు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తన్నీరు హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి కార్యాలయం మొదలు కిందిస్థాయి ఉద్యోగి వరకు రెవెన్యూ శాఖలో అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే హరీష్ రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు జవాబు దారి తనం లేకుండా పోయిందన్నారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు బుట్ట దక్కలు చేశారని మండిపడ్డారు. ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వారం రోజుల్లో రైతుకు పాసుబుక్ అందిస్తే.. భూభారతి వచ్చిన తర్వాత ఆరు నెలలైనా రైతులకు పాసు బుక్కులు అందించడం లేదని మండిపడ్డారు. అఫిడవిట్ పేరిట సాదా బైనామాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉరివేసిందని మండిపడ్డారు. అధికారంలోకొస్తే సాదా బైనామాను ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను నిండా మంచిదన్నారు. 58,59 పెండింగ్ పెట్టి గోస పెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 6 లక్షల 20 వేల మంది రైతులకు సాదా బైనామాలకు పట్టాలు అందించినట్లు గుర్తు చేశారు. రెండో దశలో 9 లక్షల 26 వేల అప్లికేషన్లు వస్తే కోర్టు స్టే మూలంగా పెండింగ్లో పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్టే వికెట్ అయినప్పటికీ ఆఫిడవిట్ పేరిట సాదా బైనామా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉరివేసిందన్నారు.

**సాదా బైనామాలకు ఉరి, 58,59 పెండింగ్**

స్లాట్ క్యాన్సిల్ అయిన వారికి డబ్బులు ఇవ్వకుండా 2 సంవత్సరాలుగా ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారని అన్నారు. నిషేధిత భూములు నచ్చితే సక్రమం నచ్చక పోతే అక్రమం అన్న చందంగా తయారైందన్నారు. కోర్టు హెచ్చరించిన నిషేధిత భూముల వివరాలు ఆన్లైన్ లో ఎందుకు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. నిషేధిత భూముల వివరాలు అన్ లైన్ చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములు గతంలో 10 శాతం ఉంటే దాదాపు 20 శాతం దాటిందన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్లు ఇవ్వక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 26 వేల మంది వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసినట్లు గుర్తు చేశారు. 61 ఎండ్లు దాటిన కారణంగా ఆగిపోయిన 4వేల మంది వీఆర్ఏల ఉద్యోగాలను వారి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విడుదల చేసిన జీవో ప్రకారం భర్తీ చేయాలని అన్నారు. అధికారంలోకి వస్తే ఎల్.ఆర్.ఎస్ ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తుందన్నారు. మంత్రి కుమారుడు భూ కబ్జాకు పాల్పడితే కేసు చేసిన సీఐ ని బదిలీ చేశారని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, సుడ మాజీ చైర్మన్ మా రెడ్డి రవీందర్ రెడ్డి, నాయకులు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# వీహెచ్కు ఛాన్సివ్వండి



న్యూఢిల్లీ : తెలంగాణలో ఖాళీ కాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ విషయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీ కాంగ్రెస్లో సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్కు రాజ్యసభ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్, స్టూడెంట్ లీడర్తో పాటు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వాడైనందున అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. జెట్టి కుసుమ కుమార్ కుటుంబం ఫ్రీడమ్ ఫైటర్స్ ఫ్యామిలీ అని వారి కుటుంబం అంతా కాంగ్రెస్ లోనే ఉన్నారన్నారు హనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవంతో పాటు మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారన్నారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారని వయసులో పెద్ద వ్యక్తి, చురుకైన వ్యక్తి అయిన వీహెచ్కు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

**అధిష్టానం హామీ :** తన ప్రతిపాదనపై కమిటీతో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని చెప్పారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలోని రాజ్యసభ అవకాశంపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్తో కూడా మాట్లాడినట్లు చెప్పారు. తాను రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని అయితే రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని జగ్గారెడ్డి చెప్పారు.

## వైభవంగా శ్రీవారి సాలకట్ల

# తెప్పోత్సవాలు ప్రారంభం



తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్రుని ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుంది. తొలిరోజు శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివారు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులను ఆశీర్వదించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది.

**శ్రీవారి తెప్పోత్సవాల చరిత్ర**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతీ ఏడాది ఘనంగా నిర్వహించే ఐదు రోజుల తెప్పోత్సవాలను “తెప్ప తిరునాళ్లు”గా పిలుస్తారు. ఈ సందర్భంగా శ్రీవారు స్వామి పుష్కరిణిలో అలంకరించిన తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. జీవన సాగరంలో మునిగిపోకుండా భక్తులను రక్షించే దైవానుగ్రహానికి ఇది ప్రతీకగా భావిస్తారు. తెప్ప అనగా పడవ, ఓడ. ఓడలో సుఖాశీనులైన శ్రీవారిని కోనేటిలో విహారం చేయించడాన్నే తెప్పోత్సవం అంటారు. తిరుమలలో తెప్పోత్సవాలు అత్యంత ప్రాచీనకాలం నుండి జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ / చైత్ర మాసాల్లో (ఫిబ్రవరిమార్చి) ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి.

శ్రీ సాళువ నరసింహరాయలు క్రీ.శ 1468లో పుష్కరిణి మధ్యలో నీరాళి మండపాన్ని నిర్మించి తెప్పోత్సవాలకు అనువుగా తీర్చిదిద్దారు. ఆయన కుమారుడు పెద్ద తిరుమలయ్య పుష్కరిణి పునరుద్ధరణ చేపట్టి, స్వామి పుష్కరిణి వరాహ పుష్కరిణిలను వేరు చేసినట్లు శాసనాల్లో పేర్కొనబడింది.

క్రీ.శ.15వ శతాబ్దానికి చెందిన శ్రీ తాళ్లపాక అన్నమయ్య తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించారు. మధ్యలో కొంతకాలం విరామం వచ్చినప్పటికీ, 1921లో తిరిగి ఈ ఉత్సవాలు పునరుద్ధరించబడ్డాయి.

## ప్రైవేటు స్కూళ్లలో ఫీజులపై విద్యా కమిషన్ నివేదిక

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీ కోసం ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్ సీఎం రేవంత్రెడ్డికి సమగ్ర నివేదిక అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 305 పాఠశాలలను సందర్శించి నివేదిక రూపొందించినట్లు కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో 46 సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ పెట్టాలని సిఫార్సు చేశామన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని నివేదికను రూపొందించినట్లు తెలిపారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులపై ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేశామన్నారు.

## హైకోర్టులో జర్నలిస్టులకు

# భారీ ఊరట

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్ను గురువారం హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

**న్యాయం సాధించే వరకు పోరాటం ఆగదు..**

ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252, సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రెడిటేషన్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.




# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దు

● కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాలు ● వాటి కల్పనపైన దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం ● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలుపై దృష్టి పెట్టాలని సూచన




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం నాడు ఐసీసీసీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు ఆదించాలని నిర్దేశించారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీ వినియోగించాలని దిశనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే, ఎంసీహెచ్ఆర్డీలో గ్రూప్ 2, 3 ఆఫీసర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు.

## 99 డేస్ యాక్షన్ ప్లాన్‌కు కేబినెట్ సబ్ కమిటీ



తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో పాలన మరింత సమర్థంగా సాగేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

వివిధ శాఖల్లో అమలు చేయాల్సిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్) రూపొందించి అమలు చేయడానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసి అమలు దిశగా అడుగులు వేయనుంది. ఈ సబ్ కమిటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

**త్వరలో కమిటీ సమావేశం**

ఈ కమిటీకి ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కమిటీ సమావేశాలకు హాజరవుతారు.

రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయడం,

ప్రజలకు ఇచ్చిన హామీలను కాలపరిమితిలో అమలు చేయడం లక్ష్యంగా ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అత్యంత ప్రాధాన్యతతో రూపొందించి, వేగంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

త్వరలోనే కమిటీ సమావేశమై అన్ని శాఖలతో సమీక్ష జరిపి వివరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనుంది.

## పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయాలి

● విద్యార్థులకు 10వ తరగతి తొలి మెట్టు ● రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : విద్యార్థులు మానసిక ఒత్తిడి , భయం వీడి ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలకు హాజరుకావాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం స్టాన్లీ బాలికల పాఠశాల ఆడిటోరియంలో విద్యాశాఖ, సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తో కలసి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులలో మానసిక ఒత్తిడి భయాందోళన తగ్గుతుందని మోటివేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై జిల్లా కలెక్టర్ సందర్భంగా అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు బిడియం ,భయం అలాగే మానసిక ఒత్తిడి లేకుండా ఉండాలని సంకల్ప్ ఫౌండేషన్ సహకారంతో మోటివేషన్ క్లాస్ లు ఏర్పాటు చేసి విద్యార్థులను భయమును తొలగించడం అభినందనీయమని మంత్రి అన్నారు. విద్యార్థులకు పదవ తరగతి జీవితంలో కీలక మెట్టు అని,మీ జీవితం పదవ తరగతి పరీక్షల పై ఆధారపడి ఉందని అన్నారు. విద్యార్థులు సంవత్సర కాలం పాటు ఎంతో శ్రమతో చదవడం అలాగే ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన అందించటం జరిగిందని అన్నారు.విద్యార్థులు భయం వీడి చదివిన దానిని పరీక్షల్లో ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు. సివిల్స్ కి వెళ్లాలన్న పదవ తరగతి మార్కులు ఎన్ని వచ్చాయి అని ముందు అడగడం జరుగుతుందని అన్నారు.పదవ తరగతి సిలబస్ డిసెంబర్ మాసానికి పూర్తి చేయటంతో విద్యార్థులు రివిజన్ పై ఎక్కువ దృష్టి పెట్టి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సిలబస్ అనంతరం ప్రాక్టీస్ చాలా ముఖ్యమైందని అలాగే నేను, ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని వచ్చామని దానికి మూలం చదివేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని మోటివేషన్ ద్వారా పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని నేటి విద్యార్థులు రేపటి పౌరులని భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువును ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయవద్దని బాధ్యతతో చదవాలని, అప్పుడే తల్లిదండ్రులు మీ గ్రామం, మీ స్నేహితులు సంతోషిస్తారని మంత్రి తెలిపారు.మీరు భవిష్యత్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. పరీక్షల సమయం దగ్గరగా ఉండటంతో విద్యార్థులు చదివింది మరోసారి చదవండి..జ్ఞాపక శక్తిని మరింతగా పెంచుకోవాలని అన్నారు. అలాగే పరీక్షల సమయంలో టీవీ లు , స్నేహితులు, సీరియల్ లకు దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షల రోజులలో ముందు ప్రశ్నాపత్రం బాగా చదవాలి.. అప్పుడు ప్రశ్నపత్రం లో ముందుగా మీకు సులువుగా వచ్చే సమాధానాలు రాయాలని, హార్డ్ గా ఉన్న ప్రశ్నలకు ఆలోచిస్తే మీకు సమాధానాలు అవే వస్తాయని అన్నారు.

పదవ తరగతి పరీక్షలు కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు ఇది మీ భవిష్యత్తు పునాది వేయబోయే మొదటి పెద్ద అడుగు అని అన్నారు. సంకల్పం అనే పట్టుదలతో విద్యార్థుల ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతిరోజూ టైమ్‌టేబుల్ ప్రకారం విద్యార్థులు చదువుకోవాలని అలాగే ముఖ్యమైన అంశాలను రివిజన్ చేయాలని సూచించారు. భయం వీడి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి,సరైన నిద్ర, సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. మీ తల్లిదండ్రుల ఆశలు, గురువుల మార్గదర్శకత్వం, మీ కృషి ఇవన్నీ కలిసి మీ విజయానికి దారి చూపిస్తాయనీ అన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం మీలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. అలాగే అందరికీ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విజయం కలగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. అంతకుముందు నూరు శాతం అటెండెన్స్ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మానం, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అమౌంట్ తో పాటు నగదు బహుమతి అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో రోహిణి, యువ క్రీడాకారిణి నైనా జైస్వాల్,సంకల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి రోజి , మోటివేషన్ స్పీకర్స్ , ప్రధానోపాధ్యాయులు, హైదరాబాద్ జిల్లాలోని పలు పాఠశాల పదవ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే కమ్మెర నిందితులను అరెస్టు చేయాలి

● మార్చి 7న బీసీ జనసభ, యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో కమ్మెర
● బాధితులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇచ్చి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
● మా దేవుడు మా గుడి మా పాలన పేరుతో యాదవ కురుమల రాష్ట్ర వ్యాప్త పోరాటం
● మార్చ్ 13న హైదరాబాద్‌లో ఎండోమెంట్ కార్యాలయం ముందు "సమతా స్ఫూర్తి ధర్నా" ● బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో( మల్లన్న గుడి) మల్లికార్జున స్వామి గుడిలో బీసీ బిడ్డపై దాడి, రెండు నెలల పాప హత్య ఘటనను బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనలో పాల్గొన్న బాధ్యులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షలు పడేలా హత్యానేరం కేసులు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం బీసీ జనసభ, యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మెర గ్రామంలో బీసీ బిడ్డపై దాడి, రెండు నెలల పసిపాప హత్యకు సంబంధించిన ఘటనను సుమోటోగా స్వీకరించి కేసును నమోదు చేయాల్సిన పోలీసులు.. బాధితులపైనే ఉల్టా కేసులు బనయించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అసలు ఘటన జరిగిన సమయంలో బాధితురాలు దగ్గర చిన్నారి లేదంటూ బుకాయించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇవాళ సోషల్ మీడియా, ప్రముఖ ఛానల్లో రిలీజ్ అయిన వీడియోలను చూసి ఏం సమాధానం చెప్తారని పోలీస్ అధికారులను ప్రశ్నించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రెండేళ్ల పాలనలో బీసీలపై అనేక దాడులు జరిగాయి అని గుర్తు చేశారు. ప్రజాపాలన పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ పాలన, కుల పాలన, విసునూరి రామచంద్రారెడ్డి పాలనను తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని కోటి రూపాయల నష్టపరిహారం తో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. అలాగే గతంలో యాదవ, కురుమల ఆధ్వర్యంలో కొనసాగిన మల్లన్న ఆలయాలను వారికే అప్పగించాలని, ధర్మకర్తలుగా.. ట్రస్టీలుగా వారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. మా దేవుడు మా గుడి మా పాలన పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే వచ్చే నెల ఏడున చలో కుమ్మెర మల్లన్న స్వామి కార్యక్రమానికి పిలుపునిచ్చామని అన్నారు. వచ్చే నెల 13న హైదరాబాదులోని ఎండోమెంట్ కార్యాలయం ముందు "మల్లన్న మతా స్ఫూర్తి ధర్నా" నిర్వహిస్తామని ప్రకటించారు. యాదవ కురుమల చారిత్రక సాంస్కృతిక సమతాస్ఫూర్తిని కాపాడేందుకు భారీ ఎత్తున శివసత్తులు ఒగ్గు కళాకారులతో పాటు కురుమ యాదవులు పెద్ద ఎత్తున తరలిరావాలని రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, బీసీ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు కాటం నరసింహులు, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి రాజు, ఓయూ విద్యార్థి నాయకులు పోగుల చిరంజీవి, కొమ్మనబోయిన సైదులు, మధు, రమేష్, అరవింద్, , గంగుల మధు, శ్రీరామ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల నడుమ కొత్త హైటెక్ హైవే

● మే లో ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్.. ● 50 కిలో మీటర్ల పైగా తగ్గనున్న దూరం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్. త్వరలో మరో కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించారు. ఈ నాలుగు లైన్ల హైవే పనులు ఇప్పటికే దాదాపుగా పూర్తి అవ్వగా.. మే నెలలో ప్రారంభించేందుకు 50 కిలో మీటరన్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ హైవే ఒక్కటి కూడా అందుబాటులో లేదు. దీంతో ఇదే తొలి రోడ్డుగా నిలవనుంది. ఈ రోడ్డు పొడవునా అత్యాధునిక టెక్నాలజీ కూడిన వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. అందుకే దీనిని హైటెక్ హైవేగా పిలుస్తున్నారు. దీని ప్రత్యేకతలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

ప్రత్యేకతలు ఇవే...

-దారి పొడవునా ఎక్కడికక్కడ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

-సమాచారాన్ని అందించేందుకు దారి పొడవునా పలు ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంటాయి.

-ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ ఏర్పాటు చేశారు. ప్రమాణించిన దూరానికి మాత్రమే టోల్ ఛార్జీ వసూలు టెక్నాలజీ ఏర్పాటు. పరిమిత సంఖ్యలో ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు ఉంటాయి.

-అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేశారు. సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. టెక్నాలజీతో కూడిన సేవలు అందుబాటులో ఉంటాయి.

తగ్గనున్న 50 కిలోమీటర్ల దూరం

తెలంగాణలోని ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు 162 కిలోమీటర్ల మేర ఈ యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మించారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లేవారికి ఈ రోడ్డు వల్ల ఏకంగా 56 కిలోమీటర్ల ప్రయాణ సమయం తగ్గనుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే సూర్యాపేట, విజయవాడ మీదుగా 676 కిలోమీటర్ల మేర దూరం వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ కొత్త నేషనల్ హైవే వల్ల 56 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఎన్‌హెచ్-365బీజీ నెంబర్‌ను ఈ కొత్త జాతీయ రహదారికి ఇప్పటికే కేటాయించారు. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు ఈ హైవే ఉంటుంది. తెలుగు రాష్ట్రాలను కలిపే తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ హైవేగా ఇది నిలవనుంది. 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు అందుబాటులో ఉంటాయి. దీంతో వేగంగా ప్రయాణం చేయవచ్చు. ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువగా ఉండదు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో విశాఖ వైపు తరచూ వేల మంది వెళ్తూ ఉంటారు. అలాంటివారికి దీని వల్ల ప్రయోజనం కలగనుంది.

## కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే

● కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి
● లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ
● రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వ్యాఖ్య

హైదరాబాద్ః గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వండి

● ఏడువేల కోట్ల ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి ● ఫీజుల నిధుల విడుదల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తుంది ● ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నరు ● మార్చ్ 16 అసెంబ్లీ సమావేశాలు జరిగే లోపు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి ● సీఎస్‌ను కలిసిన బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ స్కాలర్ షిప్ లు రాక 22 లక్షల మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయని ప్రభుత్వం, ఐదు వేల కోట్లతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం తగదని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం సచివాలయంలో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని సిఎస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ఉన్న ఫీజుల బకాయిలను తామెందుకు చెల్లించాలని ప్రస్తుత ప్రభుత్వం బుకాయించడం మంచిది కాదన్నారు, గత ప్రభుత్వంలో ఉన్న వచ్చిన రాబడిని ఈ ప్రభుత్వం ఎందుకు వసూలు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే ఫీజుల రియంబర్స్మెంట్ విడుదల తో పాటు ప్రతి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఫీజులను చెల్లిస్తామని మాట ఇచ్చి రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. ప్రభుత్వం ఫీజులో నిధులు విడుదల చేస్తుందన్న భరోసాతో లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, ఇటు ప్రభుత్వం నిధులు విడుదల చేయక, అటు కళాశాల యజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మానసిక క్షోభ కు గురై రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్న రాన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం కాసోజు శ్రీకాంతచారి నుండి సిరిపురం యాదయ్య వరకు 1100 వందల మంది విద్యార్థులు బలిదానాలు చేసుకుంటే వచ్చిన తెలంగాణలో విద్యార్థుల చదువులకు, కొలువులకు భరోసా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆయన మండిపడ్డారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకం కోసం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్నామని, ఈ పథకాన్ని నీరుగార్చడానికి ప్రభుత్వం ప్రయత్నించడం తగదన్నారు ఫీజుల రియంబర్స్మెంట్ అనేది ప్రైవేట్ కళాశాల యజమాన్యాలకు, ప్రభుత్వాలకు మధ్యన పంచాయతీ కాదని, ఇది 22 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమని ఆయన వెల్లడించారు. ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో ఉద్యమాన్ని ఆపేది లేదని, త్వరలోనే రాష్ట్ర గవర్నర్, మంత్రులను, డిప్యూటీ సీఎం, సీఎంలను కలిసి విన్నవిస్తామని, సానుకూలమైన నిర్ణయం రాకుంటే మార్చి 16వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా వేలాదిమంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇంద్రం రజక, వినోద్ కుమార్, బండిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జనసేనను బలోపేతం చేస్తాం

● తెలంగాణలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం
● కార్యక్రమాన్ని ప్రారంభించిన సైబరాబాద్ కార్పొరేషన్ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని జనసేన రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి తలపెట్టిన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడ్ షెడ్ రోడ్ సమీపంలోని సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సైబరాబాద్ కార్పొరేషన్ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అనంతరం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలు --సామాజిక న్యాయం, పారదర్శక పాలన, యువతకు అవకాశాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. "జనసేన ఉద్యమి" కార్యక్రమం ద్వారా పార్టీకి కట్టుబడి పనిచేసే క్రియాశీలక సభ్యులను తయారు చేసి, గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు బలమైన సంస్థాగత నిర్మాణం చేయడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జనసేన సాదక్ బాధ్యతలు, వారి పాత్ర, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, సభ్యత్వం ద్వారా ఉద్యమిలను పార్టీ లోకి ఆహ్వానించి పార్టీనీ బలోపేతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కార్పొరేషన్ జనసేన నాయకులు నందగిరి సతీష్, బొర్రా వెంకట్ అప్పారావు, కొల్లా శంకర్, వేముల మహేష్, కిషోర్ నాగరాజు, మండలి అనిల్,బడే విశ్వేశ్వర్ రావు,కలిగినీడి ప్రసాద్, పోలేబోయిన శ్రీనివాస్, చిట్టి బాబు, ప్రభు చైతన్య, రణదీప్, సుదర్శన్, రాము, మురళి , పులగం సుబ్బు, అప్పారావు, మాధవి ,ప్రదీప్, మరియు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఇల్లు కూల్చకుండా మూసీ సుందరీకరణ

● మూసీ ప్రక్షాళన ప్రజలను భయాందోళన గురిచేస్తుంది ● మూసీ బాధితులకు అండగా ఉంటాం
● మూసీ నిర్వాసితులను ఆదుకునేందుకే మూసీ గోస ● అమాయకుల ఇళ్లను కూల్చివేస్తుంది
● ప్రజల వెంట ఉండి వారికి అండగా ఉంటాం ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మూసీ గోస - బిజెపి భరోసా పరామర్శ యాత్ర సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ "మూసీ సుందరీకరణ" ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర భయాందోళన సృష్టిస్తోందన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు చెబుతూనే, మరోవైపు స్పష్టత లేకుండా ప్రజలను అయోమయానికి గురి చేస్తోందన్నారు. బండ్లగూడ జాగీర్ పరిధిలోని కొన్ని కాలనీలకు, ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులతో పాటు ఆ రెసిడెన్సీలో సుమారు 450కు పైగా ఇళ్లకు, అలాగే విఘ్నేశ్వర కాలనీలో సుమారు 170 ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో, హైదర్ గూడ భూములతో పాటు, మూసీకి ఆనుకుని పరివాహక ప్రాంతాల్లో కూరగాయలు పండిస్తూ హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్న రైతుల భూములను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. రైతుల భూములను గుంజుకొని భూమిలేని వారిగా మార్చే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మూసీ సుందరీకరణకు భారతీయ జనతా పార్టీ వ్యతిరేకం కాదు. మూసీ శుద్ధికీ మేం వ్యతిరేకం కాదు. ప్రజా వ్యతిరేక పాలనకే వ్యతిరేకం. మూసీ మంచి నీటితో ప్రవహించాలి. దుర్వాసన రాకూడదు. దోమలు లేకుండా ఉండాలి. హైదరాబాద్ ప్రజలు గర్వంగా చెప్పుకునేలా మూసీ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్న పని ప్రజల పక్షాన కాదు - ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య. మధువన్ పార్క్ రెసిడెన్సీ వద్ద 12 మీటర్ల బఫర్ జోన్‌లో, పూర్తిగా ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన ఇళ్లను కూడా కూల్చివేయాలని చూస్తున్నారు. అక్కడ నివసిస్తున్న వారిలో భారత సైన్యంలో, నేవీలో, ఎయిర్ ఫోర్స్‌లో సేవలందించి రిటైర్ అయిన మాజీ సైనికులు ఉన్నారు.

దేశం నలుమూలల నుంచి వచ్చి, ప్రభుత్వ అనుమతులు, బ్యాంక్ లోన్లు తీసుకుని, ఈఎంఐలు కట్టుకుంటూ జీవిస్తున్న మధ్యతరగతి కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయన్నారు. అలాగే విఘ్నేశ్వర కాలనీలో కూడా 150-200 గజాల స్థలాల్లో చిన్న చిన్న ఇళ్లలో నివసిస్తున్న మధ్యతరగతి కుటుంబాలు ఉన్నాయి. ఈఎంఐలు చెల్లిస్తూ, "హైదరాబాద్ నా నగరం" అని గర్వంగా భావిస్తూ జీవిస్తున్న కుటుంబాలను ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డున పడేయాలని చూడటం దారుణం అన్నారు. సుందరీకరణ పేరుతో పేద ప్రజలను ఇళ్ల నుంచి తరిమేయడం, భూములు లాక్కోవడం, భయపెట్టే పాలన చేయడం సరికాదన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్లు కూల్చాల్సిన అవసరం లేదు. మూసీకి, ఈసా నదుల శుద్ధి కోసం సరైన ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే స్వచ్ఛమైన నీరు వస్తుంది. రిటైనింగ్ వాల్స్ నిర్మించి, ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా సుందరీకరణ చేయవచ్చు. అది సాధ్యమేనన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నట్టు నిర్వాసితులకు పరిహారం ఇస్తామని అంటున్నారు. కానీ నిజంగా చెప్పాలంటే.. ప్రభుత్వ వద్ద భూములే లేవు. ప్రభుత్వ భూములన్నీ అమ్మేశారు. 150 కోట్ల ఎకరాల భూమిని అమ్మేసిన ప్రభుత్వం, ఈ ప్రజలకు ఏం పరిహారం ఇస్తుంది? ఎక్కడ నుంచి ఇస్తుంది? ఇది పూర్తిగా మోసమేనన్నారు. అందుకే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని నాశనం చేసే, ప్రజలను ఇళ్లులేని వారిగా మార్చే ప్రజా వ్యతిరేక పాలనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చి, వారి జీవితాలను బుగ్గిపాలు చేయాలనుకోవడం దుర్మార్గం. మూసీ శుద్ధికైనా, గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కైనా, గాంధీ విగ్రహం ఏర్పాటుకైనా మాకు అభ్యంతరం లేదు. కానీ ప్రజల ఇళ్లు కూల్చితే మాత్రం భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. రేవంత్ సర్కారు ప్రజల ఇళ్లపై దాడి చేస్తే, పేదల జీవనాధారాలను ధ్వంసం చేయాలనుకుంటే.. భారతీయ జనతా పార్టీ దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## మోదీ-నెతన్యాహు మైత్రి

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలలో ఒక చారిత్రాత్మక అధ్యాయానికి నాంది పలికింది. దశాబ్దాల కాలంగా ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు ఉన్నప్పటికీ, ఒక భారత ప్రధాని ఆ దేశంలో అడుగుపెట్టడం అదే మొదటిసారి కావడం ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యతను చేకూర్చింది. బెన్ గురియన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి లభించిన అపూర్వ స్వాగతం, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ఇజ్రాయెల్ ప్రధాని బెన్యమిన్ నెతన్యాహు స్వయంగా విచ్చేయడం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా మోదీ తన ప్రసంగంలో ఇజ్రాయెల్‌ను భారతదేశానికి ఒక నమ్మకమైన మిత్రుడిగా అభివర్ణించారు, రెండు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక, చారిత్రాత్మక బంధాలను గుర్తుచేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరు దేశాలు ఏకతాటిపై నిలబడాలని, శాంతి స్థాపనలో పరస్పరం సహకరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నెతన్యాహు తన ప్రసంగంలో మోదీ పర్యటనను ఒక యుగారంభంగా అభివర్ణిస్తూ, భారతదేశం ఒక గ్లోబల్ పవర్ అని కొనియాడారు. ఇజ్రాయెల్ సాంకేతికత, భారతదేశం యొక్క మానవ వనరులు కలిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం రక్షణ రంగం మాత్రమే కాకుండా, వ్యవసాయం, నీటి యాజమాన్యం, సైబర్ భద్రత వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని ఇరు నేతలు నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌లోని హైఫా నగర విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన భారతీయ సైనికులకు మోదీ నివాళులర్పించడం ఇజ్రాయెల్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈపర్యటనలో ఇరు దేశాల మధ్య కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్యం దక్షిణ ఆసియా రాజకీయాల్లో ఒక కొత్త మలుపుగా మారింది. భారతదేశానికి ఈ పర్యటన వల్ల అనేక ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు చేకూరాయి. ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అత్యాధునిక రక్షణ సాంకేతికతకు పెట్టింది పేరు, అటువంటి దేశంతోరక్షణ ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల భారత సైన్యం ఆధునికీకరణకు మార్గం సుగమమైంది. ముఖ్యంగా క్షిపణి వ్యవస్థలు, డ్రోన్ సాంకేతికతలో ఇజ్రాయెల్ సహకారం భారతదేశ భద్రతను మరింత పటిష్టం చేసింది. నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న భారతీయ రైతులకు ఇజ్రాయెల్ యొక్క బిందు సేద్యం, సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చే సాంకేతికత ఎంతో మేలు చేకూరుస్తుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడానికి ఇజ్రాయెల్ అందించే సాంకేతిక సాయం భారత ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇస్తుంది. మరోవైపు, అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ఒక గట్టి మిత్రుడు లభించినట్లయింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో ఇరు దేశాల నిఘా సంస్థల మధ్య సమాచార మార్పిడి పెరగడం వల్ల దేశ అంతర్గత భద్రత మెరుగుపడుతుంది. స్టార్టప్ రంగంలో ఇజ్రాయెల్ సాధించిన ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, భారతీయ యువతకు నూతన ఆవిష్కరణలలో శిక్షణ ఇచ్చేందుకు ఈ పర్యటన బాటలు వేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా దేశీయ తయారీ రంగం బలోపేతం అవుతుంది, తద్వారా మేక్ ఇన్ ఇండియా పథకానికి కొత్త శక్తి లభిస్తుంది. మొత్తంగా చూస్తే, మోదీ ఇజ్రాయెల్ పర్యటన కేవలం దౌత్యపరమైన పర్యటన మాత్రమే కాదు, అది భారతదేశ భవిష్యత్తు అవసరాలను తీర్చే ఒక వ్యూహాత్మక అడుగు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఇజ్రాయెల్ ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలుస్తోంది, అటువంటి దేశంతో భారతదేశం కుదుర్చుకున్న ఒప్పందాలు మన దేశ ప్రగతికి కొత్త ద్వారాలను తెరిచాయి. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనలలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇజ్రాయెల్ అంతరిక్ష సంస్థల మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందాలు భవిష్యత్తులో ఉపగ్రహ ప్రయోగాలకు, సమాచార వ్యవస్థల బలోపేతానికి ఎంతో కీలకం కానున్నాయి. చిన్న తరహా పరిశ్రమలకు చేయూతనివ్వడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వినూత్న పద్ధతులు భారతీయ పారిశ్రామికవేత్తలకు కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ స్నేహపూర్వక వాతావరణం కేవలం ప్రభుత్వాల మధ్యే కాకుండా, ప్రజల మధ్య కూడా సాంస్కృతిక సంబంధాలను పటిష్టం చేస్తోంది. భారతదేశంలోని గంగా నది శుద్ధి కార్యక్రమం వంటి బృహత్తర ప్రాజెక్టులకు ఇజ్రాయెల్ తన నీటి శుద్ధి సాంకేతికతను అందించేందుకు ముందుకు రావడం మన పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఊరట. రక్షణ రంగంలో కేవలం వస్తువులను కొనుగోలు చేసే దశ నుండి సంయుక్తంగా క్షిపణులు, యుద్ధ విమానాల భాగాలను తయారు చేసే స్థాయికి మన బంధం ఎదగడం విశేషం. దీనివల్ల రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటం తగ్గి, సొంతంగా ఆయుధాలను తయారు చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఇది దేశ రక్షణ బడ్జెట్‌పై భారాన్ని తగ్గించడమే కాకుండా, ఇతర దేశాలకు రక్షణ సామగ్రిని ఎగుమతి చేసే స్థాయికి భారత్‌ను చేరుస్తుంది. ఉగ్రవాదం అనేది ప్రపంచానికి పట్టిన పీడ అని, దానిని వేళ్లతో సహా పెకిలించడంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పని చేయడం వల్ల అంతర్జాతీయ శాంతికి భరోసా లభిస్తుంది. ఆర్థిక సంబంధాల పరంగా చూస్తే ఈ పర్యటన రెండు దేశాల మధ్య వర్తక వాణిజ్యాలను కొత్త పుంతలు తొక్కించింది. ఇరు దేశాల ప్రైవేట్ కంపెనీలు కలిసి పని చేసేందుకు వీలుగా వందల కోట్ల రూపాయలతో ఒక ప్రత్యేక ఆవిష్కరణ నిధిని ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక విప్లవానికి బాటలు వేశారు. దీనివల్ల భారతీయ స్టార్టప్ కంపెనీలు ఇజ్రాయెల్ మార్కెట్లోకి ప్రవేశించడానికి, అక్కడి అత్యాధునిక పరిశోధనల ఫలాలను అందుకోవడానికి వీలు కలిగింది. ముఖ్యంగా సైబర్ భద్రత రంగంలో ఇజ్రాయెల్ సాధించిన తిరుగులేని విజయం, భారతదేశంలోని డిజిటల్ వ్యవస్థలను సురక్షితం చేయడానికి తోడ్పడుతోంది. మన దేశంలో పెరుగుతున్న డిజిటల్ లావాదేవీలు, సున్నితమైన డేటాను హ్యాకర్ల బారి నుండి కాపాడటానికి ఇజ్రాయెల్ సాంకేతికత ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది.పర్యాటక రంగం అభివృద్ధిలో కూడా ఈ పర్యటన కీలక పాత్ర పోషించింది. ఇరుదేశాల మధ్య విమాన సర్వీసులను పెంచడం, వీసా నిబంధనలను సరళతరం చేయడం ద్వారా పర్యాటకుల రాకపోకలు పెరిగాయి. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాలే కాకుండా, రెండు దేశాల ప్రజల మధ్య అవగాహనను, గౌరవాన్ని పెంచింది. భారతీయసంస్కృతి, యోగా పట్ల ఇజ్రాయెల్ ప్రజల్లో ఉన్న ఆసక్తిని గమనించిన ప్రధాని మోదీ, అక్కడ ఒక సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం మన సాఫ్ట్ పవర్ బలాన్ని చాటిచెప్పింది. అలాగే ఇజ్రాయెల్‌లో స్థిరపడిన భారతీయ సంతతి ప్రజలతో మోదీ జరిపిన ఆత్మీయ భేటీ, వారిని మాతృభూమితో మళ్ళీ మమేకం చేసింది.ఇజ్రాయెల్ యొక్క అద్భుతమైన ఎడారి వ్యవసాయ పద్ధతులు భారతదేశంలోని రాజస్థాన్, గుజరాత్ వంటి పొడి ప్రాంతాలకు ఒక వరంగా మారాయి. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే ఇజ్రాయెల్ మోడల్ కేంద్రాలను భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయడం వల్ల చిన్నకారు రైతుల ఆదాయం పెరిగే అవకాశం కలిగింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం కేవలం భూమి మీదనే కాకుండా, సముద్ర గర్భంలోని వనరుల అన్వేషణ వరకు విస్తరించింది. లోతైన సముద్ర పరిశోధనలలో ఇజ్రాయెల్ అనుభవం భారతదేశపు బ్లూ ఎకానమీ లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతో సహాయపడుతుంది.మొత్తంగా చూస్తే మోదీ, నెతన్యాహు మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం రెండు దేశాల మధ్య ఒక బలమైన వ్యూహాత్మక కూటమిగా మారింది. ప్రపంచ రాజకీయాల్లో సమీకరణలు వేగంగా మారుతున్న తరుణంలో, ప్రజాస్వామ్య విలువలు కలిగిన ఈ రెండు దేశాలు చేతులు కలపడం అంతర్జాతీయ వేదికలపై కీలక పరిణామం. ఇది కేవలం వర్తమాన అవసరాల కోసమే కాకుండా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవడానికి వేసిన ఒక బలమైన పునాది. భారతదేశం ఒక విశ్వగురువుగా ఎదిగే క్రమంలో ఇజ్రాయెల్ వంటి నమ్మకమైన మిత్రుల సహకారం అత్యంత విలువైనది.

# ఇంధన రంగంలో ఆధిపత్య పోరు

- సౌర విద్యుత్ ఉత్పత్తులపై 126 శాతం దిగుమతి ట్రంప్ సుంకం
- భారతీయ సౌర ఉత్పత్తులు అమెరికా మార్కెట్లోకి చౌకగా వస్తున్నాయని ఆగ్రహం
- అమెరికాలోని దేశీయ తయారీదారులు తీవ్రంగా నష్టపోతున్నారని తాజా నిర్ణయం
- ట్రంప్ నిర్ణయాలతో భారతీయ ఎగుమతి రంగంపై పడే పెను విఘాతం.
- అమెరికా రాజకీ యాలనుశాసించే చమురు మాఫియా,కు చెక్ చెప్పే నిర్ణయమని ప్రకటన



**తేజస్విని**
**హైదరాబాద్**

తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం అంతర్జాతీయవాణిజ్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. భారతజదేశం నుంచి ఎగుమతి అవుతున్న సౌర విద్యుత్ ఉత్పత్తులపై ఏకంగా 126 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భారీ పన్ను విధింపుతో రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ వాణిజ్య సంబంధాలు ఒకేసారి సంక్షోభంలో పడ్డాయి. హరిత ఇంధన రంగంలో దూసుకుపోతున్న భారతీయ కంపెనీలకు ఈ నిర్ణయం ఒక కోలుకోలేని దెబ్బగా మారింది. ఈ కఠినమైన నిర్ణయం వెనుక అమెరికా వాణిజ్య శాఖ కొన్ని అధికారిక కారణాలను చూపుతున్నప్పటికీ, తెర వెనుక భారీ కుట్ర దాగి ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా రాజకీయాలను శాసించే చమురు మాఫియా, బడా ఆయుధ తయారీ సంస్థల ఒత్తిడి మేరకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్తులో సౌర విద్యుత్ పెరిగితే తమ వ్యాపార సామ్రాజ్యాలు కూలిపోతాయనే భయంతోనే ఆయిల్ కంపెనీలు ఈ విధంగా చక్రం తిప్పాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

**అమెరికా చెబుతున్న కారణాలు:**

**సబ్సిడీల ఆరోపణ:** భారత ప్రభుత్వం తమ స్థానిక సౌర ఫలకాల తయారీ కంపెనీలకు భారీగా ఆర్థిక సబ్సిడీలు ఇస్తోందని అమెరికా తీవ్రంగా ఆరోపిస్తోంది. ఈ ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్లే భారతీయ కంపెనీలు తమ వస్తువులను అత్యంత తక్కువ ధరకు తయారు చేయగలుగుతున్నాయని వారు చెబుతున్నారు. ఇలా ప్రభుత్వాల అండతో ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవడం అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు విరుద్ధమని అమెరికా వాణిజ్య శాఖ వాదిస్తోంది.

ఇలా తక్కువ ఖర్చుతో తయారైన భారతీయ సౌర ఉత్పత్తులు అమెరికా మార్కెట్లోకి చౌకగా వచ్చి పడుతున్నాయని అక్కడి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల మార్కెట్లో ఆరోగ్యకరమైన పోటీ దెబ్బతింటోందని వారు అభిప్రాయపడుతున్నారు. సబ్సిడీల ద్వారా లబ్ధి పొందుతున్న భారతీయ కంపెనీల ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికే ఈ స్థాయిలో పన్నులు విధించినట్లు అమెరికా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

**స్థానిక పరిశ్రమల రక్షణ:** విదేశాల నుంచి అత్యంత చౌకగా వస్తున్న సౌర ఉత్పత్తుల వల్ల అమెరికాలోని దేశీయ తయారీదారులు తీవ్రంగా నష్టపోతున్నారని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది. తక్కువ ధరకు దొరుకుతున్న విదేశీ వస్తువుల వైపే వినియోగదారులు మొగ్గుచూపుతుండటంతో స్థానిక కంపెనీలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. దీనివల్ల వేలాది మంది అమెరికన్లు తమ ఉపాధిని కోల్పోతున్నారని ప్రభుత్వం ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి, దేశీయ పరిశ్రమలను కాపాడుకోవడానికి ఈ కఠిన నిర్ణయం తప్పనిసరి అని ట్రంప్ సర్కారు సమర్థించుకుంటోంది. దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తే విదేశీ వస్తువుల ధరలు పెరిగిపోయి, స్థానికంగా తయారయ్యే వస్తువులకు గిరాకీ పెరుగుతుందని వారు అంచనా వేస్తున్నారు. అమెరికా పౌరుల ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని వారు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నారు.**చైనా కంపెనీల కట్టడి:** వాణిజ్య యుద్ధంలో భాగంగా అమెరికా ఇప్పటికే చైనాకు చెందిన అనేక వస్తువులపై కఠినమైన ఆంక్షలు, భారీ సుంకాలు విధించింది. అయితే ఈ ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి చైనా కంపెనీలు అడ్డదారులు తొక్కుతున్నాయని అమెరికా నిఘా వర్గాలు పసిగట్టాయి. చైనా సంస్థలు తమ ఉత్పత్తులను నేరుగా అమెరికాకు పంపకుండా భారతదేశం, ఇండోనేషియా లాంటి దేశాల ద్వారా ఎగుమతి చేస్తున్నాయని వారు అనుమానిస్తున్నారు.

భారతదేశంలో అసెంబ్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి, అక్కడి పేరుతో చైనా వస్తువులను అమెరికాలోకి దొంగచాటుగా తరలిస్తున్నారనేది వారి ప్రధాన ఆరోపణ. ఇలా రూటు మార్చి వస్తున్న చైనా ఉత్పత్తులను పూర్తిగా అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతోనే భారతదేశం నుంచి వచ్చే అన్ని సౌర ఉత్పత్తులపై ఏకంగా 126 శాతం పన్ను వేసినట్లు తెలుస్తోంది. ఈ దెబ్బతో చైనా కంపెనీల ఎత్తుగడలను చిత్తు చేయాలని అమెరికా భావిస్తోంది.

**చమురు మాఫియా:** ఈ భారీ పన్ను నిర్ణయం వెనుక కేవలం వాణిజ్యపరమైన కారణాలే కాకుండా బలమైన రాజకీయ, స్వార్థ వ్యాపార ప్రయోజనాలు దాగి ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు కుండబద్దలు కొడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ రాజకీయ ప్రస్థానానికి అమెరికాలోని అత్యంత శక్తివంతమైన చమురు సంస్థలు, తుపాకీ తయారీ సంస్థలు వేల కోట్ల రూపాయల నిధులు సమకూర్చాయి. ఎన్నికల ప్రచార సమయంలో ఈ అపారమైన ఆర్థిక సాయమే ఆయనను గెలుపు తీరాలకు చేర్చింది. భారీగా నిధులు సమకూర్చిన ఈ కార్పొరేట్ శక్తులు ఇప్పుడు తమ పెట్టుబడికి ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ వారి వ్యాపారాలకు అనుకూలంగా విధానాలను మార్చక తప్పని పరిస్థితి ఏర్పడింది. చమురు మాఫియా, గన్ లాబీల ఒత్తిడికి తలొగ్గి, వారి లాభాలను కాపాడేందుకే ప్రత్యర్థి రంగమైన సౌర విద్యుత్ పై ఆయన ఈ స్థాయి లో విరుచుకుపడుతున్నారని విమర్శకులు స్పష్టంగా చెబుతున్నారు.



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ స్పృహ పెరిగి హరిత ఇంధనాల వాడకం విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా సౌర విద్యుత్ అత్యంత చౌకగా, సులభంగా అందుబాటులోకి రావడంతో ప్రజలు, పరిశ్రమలు దీనివైపే ఆకర్షితులవుతున్నారు. ఇలా సౌర విద్యుత్ వాడకం పెరిగితే క్రమంగా ముడి చమురు, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడటం పూర్తిగా తగ్గిపోతుంది. ఇదే అమెరికాలోని బడా చమురు సంస్థల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రత్యామ్నాయ ఇంధనాలు వృద్ధి చెందితే తమ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోయి లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని వారు భయపడుతున్నారు. భవిష్యత్తులో తమ ఉనికికే ప్రమాదం వస్తుందనే తీవ్రమైన ఆందోళనతోనే వారు సౌర విద్యుత్ విస్తరణను ఏ రకంగానైనా అడ్డుకోవాలని కుట్రలు పన్నుతున్నారు. తమ గుత్తాధిపత్యాన్ని, వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం సౌర విద్యుత్ రంగాన్ని ఆదిలోనే అణచివేయాలనేది ఈ చమురు మాఫియా ప్రధాన వ్యూహం. అందుకోసమే తమ చేతుల్లో ఉన్న ప్రభుత్వం ద్వారా విదేశాల నుంచి వచ్చే చౌకైన సౌర ఉత్పత్తులపై ఏకంగా 126 శాతం పన్ను వేయించారు. పన్నుల భారంతో సౌర ఫలకాల ధరలు ఆకాశాన్ని అంటితే సామాన్యులు వాటిని కొనుగోలు చేయలేరు.

ఇలా దిగుమతి సుంకాలు పెంచడం వల్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ ఖర్చు విపరీతంగా పెరిగిపోయి ఆ రంగం కుదేలవుతుంది. ప్రత్యామ్నాయం లేక ప్రజలు, పరిశ్రమలు తిరిగి తమ చమురు ఉత్పత్తుల పైనే ఆధారపడేలా చేయడమే వారి అంతిమ లక్ష్యం. పర్యావరణాన్ని నాశనం చేసినా సరే తమ లాభాలు మాత్రమే పదిలంగా ఉండాలనే చమురు వ్యాపారుల దురాశే ఈ పన్నుల విధింపునకు ప్రధాన కారణం.

**భారతదేశంపై పడే ప్రభావం:** అమెరికా తీసుకున్న ఈ 126 శాతం పన్ను నిర్ణయం కేవలం ఒక వాణిజ్య ప్రకటన మాత్రమే కాదు, ఇది భారతీయ ఎగుమతి రంగంపై పడే ఒక పెను విఘాతం. దీనివల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా తయారీ రంగానికి కలిగే నష్టాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి. భారతదేశం నుండి అమెరికాకు జరిగే సౌర ఫలకాల ఎగుమతులు ఈ నిర్ణయంతో దాదాపుగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. 126 శాతం సుంకం అంటే, ఒక వస్తువు అసలు ధర కంటే రెట్టింపు కంటే ఎక్కువ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి, ఫలితంగా అక్కడి కొనుగోలుదారులు మన వస్తువులను పక్కన పెట్టి ఇతర చౌకైన ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతారు.

ఇప్పటికే కొన్ని బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతీయ తయారీదారులు అమెరికాను ఒక ప్రధాన మార్కెట్‌గా నమ్ముకుని తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ మార్కెట్ మూతపడటంతో, కంపెనీల ఆదాయం పడిపోయి, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించలేని స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. ఇది భారతీయ బ్యాంకింగ్ రంగంపై కూడా ఒత్తిడిని పెంచుతుంది.

భారతదేశంలో సౌర విద్యుత్ రంగం లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తోంది. ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా అనేక కొత్త పరిశ్రమలు ఈ రంగంలో వెలిశాయి. అమెరికా ఆంక్షల వల్ల ఎగుమతులు తగ్గిపోతే, కంపెనీలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వస్తుంది. దీనివల్ల ఫ్యాక్టరీలలో పనిచేసే వేలాది మంది కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయే భయంకరమైన పరిస్థితి నెలకొంటుంది. కేవలం తయారీ రంగమే కాకుండా, లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, రవాణా రంగాలపై కూడా దీని ప్రభావం పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వెలుస్తున్న సోలార్ పార్కులు, వాటి అనుబంధ పరిశ్రమలు దెబ్బతినడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతాయి. చమురు కంపెనీల లాభాల కోసం అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం, భారతదేశంలోని సామాన్య కార్మికుల పొట్ట కొట్టేలా ఉందని ఆర్థిక నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


భారతదేశం ముందున్న మార్గాలు

అమెరికా ఈ రకమైన ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నప్పుడు, భారతదేశం మౌనంగా ఉండటం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. మన ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అమెరికా విధిస్తున్న ఈ భారీ సుంకాలు అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు విరుద్ధమని భారత్ గట్టిగా వాదించవచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ వేదికగా అమెరికా నిర్ణయాన్ని సవాలు చేసే అవకాశం మనకు ఉంది. ఇతర దేశాల నుండి వచ్చే ఉత్పత్తులను కావాలని అణచివేయడం స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు వ్యతిరేకం కాబట్టి, అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఈ పన్నులను తగ్గించేలా ప్రయత్నించవచ్చు. అంతేకాకుండా, భారతదేశం కూడా అమెరికా నుండి వచ్చే కొన్ని ఉత్పత్తులపై ప్రతికార సుంకాలను విధించే విషయాన్ని పరిశీలించవచ్చు. గతంలో కూడా ఇలాంటి వాణిజ్య యుద్ధాలు జరిగినప్పుడు భారత్ ఈ వ్యూహాన్ని అనుసరించింది. అమెరికాలోని శక్తివంతమైన గన్, ఆయిల్ లాబీలకు బుద్ధి చెప్పాలంటే, వారి ప్రయోజనాలకు భంగం కలిగేలా భారత ప్రభుత్వం వ్యూహరచన చేయాల్సి ఉంటుంది.

కేవలం అమెరికాపైనే ఆధారపడకుండా, భారతీయ సౌర కంపెనీలు ఐరోపా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల వైపు తమ దృష్టిని మరల్చాలి. ఈ దేశాల్లో కూడా ప్రస్తుతం హరిత ఇంధనానికి మంచి డిమాండ్ ఉంది. కొత్త మార్కెట్లను పట్టుకోవడం ద్వారా అమెరికా వల్ల కలిగే నష్టాన్ని కొంతవరకు భర్తీ చేసుకోవచ్చు. దీనికోసం ప్రభుత్వం ఎగుమతిదారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా కూడా సౌర విద్యుత్ వాడకాన్ని మరింత పెంచడం ద్వారా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేయవచ్చు. చమురు మాఫియా చేసే కుట్రలను తిప్పికొట్టాలంటే, ప్రజల్లో సోలార్ విద్యుత్ పట్ల అవగాహన పెంచి, ఇంటింటికీ సౌర ఫలకాలను చేర్చడమే సరైన సమాధానం. ఎంతగా సౌర శక్తి విస్తరిస్తే, అంతగా చమురు కంపెనీల పెత్తనం తగ్గుతుంది. భవిష్యత్తులో శిలాజ ఇంధనాల యుగం ముగియక తప్పదు, ఈ లోపు వచ్చే ఆటంకాలను తట్టుకుని నిలబడటమే మన ముందున్న లక్ష్యం.

అమెరికా తీసుకున్న ఈ 126 శాతం పన్ను విధింపు నిర్ణయం వెనుక కేవలం ఆర్థిక ప్రయోజనాలే కాకుండా, అంతర్జాతీయ రాజకీయ చదరంగం కూడా దాగి ఉంది. ఒకవైపు పర్యావరణ మార్పులను అరికట్టాలని, హరిత ఇంధనాన్ని ప్రోత్సహించాలని ప్రపంచ వేదికలపై ఉపన్యాసాలు ఇచ్చే అమెరికా, మరోవైపు తన దేశంలోని చమురు మాఫియా ప్రయోజనాల కోసం సౌర శక్తిని అణచివేయడం వారి ద్వంద్వ విధానాన్ని స్పష్టం చేస్తోంది. ఈ పన్నుల భారం వల్ల అమెరికాలో కూడా సౌర విద్యుత్ ప్రాజెక్టుల వ్యయం పెరిగి, అక్కడ పర్యావరణ లక్ష్యాలు దెబ్బతినే అవకాశం ఉంది. అయినప్పటికీ, డొనాల్డ్ ట్రంప్ తనను గెలిపించిన ఆయిల్, గన్ లాబీలకు కృతజ్ఞతగా ఈ నిర్ణయాన్ని మొండిగా అమలు చేస్తున్నారు. భారతదేశం ఈ సవాలును ఒక అవకాశంగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అమెరికా మార్కెట్ మూతపడటం వల్ల మిగిలిపోయే సౌర ఉత్పత్తులను మన దేశంలోని మారుమూల గ్రామాలకు తక్కువ ధరకు చేర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయాలి. పీఎం సూర్య ఘర్ వంటి పథకాలను మరింత వేగవంతం చేసి, ప్రతి ఇంటిపై సౌర ఫలకాలు ఉండేలా చూడటం ద్వారా దేశీయంగా భారీ డిమాండ్‌ను సృష్టించవచ్చు. దీనివల్ల విదేశీ ఎగుమతులపై ఆధారపడటం తగ్గి, మన దేశీయ పరిశ్రమలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. చమురు మాఫియా పన్నే కుట్రలను తిప్పికొట్టాలంటే, చమురు వినియోగాన్ని తగ్గించి సౌర శక్తిని సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావడమే అత్యుత్తమ మార్గం. భారత విదేశాంగ శాఖ ఇప్పటికే ఈ అంశంపై అమెరికా ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది. ఒకవేళ అమెరికా తన పట్టు విడువకుంటే, భారత్ కూడా అమెరికా నుండి దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు లేదా ఇతర కీలక వస్తువులపై సుంకాలను పెంచే ఆలోచనలో ఉంది. ఇది ఒక పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధానికి దారితీసినప్పటికీ, దేశ ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గకూడదనేది భారత ప్రభుత్వ సంకల్పంగా కనిపిస్తోంది. చమురు కంపెనీల అండతో తీసుకున్న ఇటువంటి ఏక పక్ష నిర్ణయాలు అంతర్జాతీయ వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తాయని భారత్ ప్రపంచ దేశాలకు వివరిస్తోంది. మొత్తం మీద చెప్పాలంటే, సౌర శక్తి అనేది భవిష్యత్తు తరాల అవసరం. కేవలం కొన్ని స్వార్థపూరిత శక్తుల లాభాల కోసం ఈ రంగాన్ని అణచివేయడం సాధ్యం కాదు. తాత్కాలికంగా ఆటంకాలు ఎదురైనా, రాబోయే రోజుల్లో సౌర విద్యుత్ విప్లవం చమురు మాఫియాను అధిగమించి తీరుతుంది. భారతదేశం తన తయారీ సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకుని, ప్రపంచవ్యాప్తంగా కొత్త భాగస్వాములను వెతుక్కోవడం ద్వారా ఈ సంక్షోభం నుండి మరింత బలంగా బయటపడగలదు.

# తరుముకొస్తున్న నీటి సంక్షోభం



**ఎనుముల శ్రీనివాస్ రావు**
**9912121319**

భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. కానీ నీటి లభ్యత కంటే దాని నాణ్యత మరింత కీలకం. భారతదేశంలో ప్రస్తుతం ఎదురవుతున్న నీటి సంక్షోభం కేవలం నీటి కొరత సమస్య మాత్రమే కాదు; అది ప్రజా ఆరోగ్యానికి, ఆర్థిక వ్యవస్థ కు, భవిష్యత్తు తరాలకు సంబంధించిన పెను ముప్పుగా మారింది. తాజా ప్రభుత్వ నివేదికలు, శాస్త్రీయ అధ్యయనాలు, పార్లమెంటు వేదికగా వెల్లడైన గణాంకాలు చూస్తే దేశం తాగుతున్న నీటి నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దేశ జనాభాలో అధిక శాతం ప్రజలు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేతి పంపులు, బావులు, చెరువులు ప్రధాన వనరులు కాగా, పట్టణాల్లో కూడా బోరు వెల్స్‌పై ఆధారపడే కుటుంబాలు గణనీయంగా ఉన్నాయి. అయితే తాజా భూగర్భ జలాల నాణ్యత అంచనాల ప్రకారం సేకరించిన నమూనాల్లో గణనీయమైన శాతం నీటిలో నిర్దేశిత ప్రమాణాలను మించిన కాలుష్యాలు ఉన్నట్లు గుర్తించారు. నైట్రేట్, ఫ్లోరైడ్, ఆర్సెనిక్, ఇనుము, సీసం, కాడ్మియం, క్రోమియం, యురేనియం వంటి లోహాలు అనేక రాష్ట్రాల్లో ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు వెల్లడైంది. కొన్ని రాష్ట్రాల్లో లీటరుకు అనుమతించిన పరిమితిని మించి ఆర్సెనిక్ ఉండటం వల్ల దీర్ఘకాలం లో చర్మ వ్యాధులు, క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. ఇనుము అధికమైతే నాడీ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సీసం పిల్లల మెదడు అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాడ్మియం, యురేనియం వంటి లోహాలు మూత్రపిండాల వ్యాధులకు, కణితుల ప్రమాదానికి కారణమవుతాయి. పార్లమెంటు వేదికగా వెల్లడైన గణాంకాల ప్రకారం వందల సంఖ్యలో జిల్లాలు ఫ్లోరైడ్, ఆర్సెనిక్, ఇనుము, లవణీయత, నైట్రేట్ సమస్యలతో బాధపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో యురేనియం కూడా గణనీయంగా గుర్తించబడింది. దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజలు ప్రతిరోజూ కనీసం రెండు లీటర్ల నీరు తాగుతారు. ఆ నీటిలో స్వల్ప పరిమాణంలోనైనా విషపూరిత లోహాలు ఉండటం వలన సంవత్సరాల పాటు శరీరంలో అవి చేరి అనారోగ్యాలకు దారితీస్తున్నాయి. ఇది ఒక నిశ్శబ్ద ఆరోగ్యసంక్షోభం. ప్రజలు తాగుతున్న నీరుశుద్ధవని నమ్ముతున్నప్పటికీ, వాస్తవానికి అది వారి ఆరోగ్యాన్ని మెల్లగా దెబ్బతీస్తోంది. నీటి సంక్షోభం కేవలం నాణ్యత సమస్య మాత్రమే కాదు, పరిమాణ సమస్య కూడా. దేశానికి లభించే త్రాగునీటి వనరులు ప్రపంచ స్థాయిలో పరిమితంగా ఉన్నప్పటికీ, జనాభా భారంతో డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. గతంలో విడుదలైన సమగ్ర నీటి నిర్వహణ సూచిక నివేదిక ప్రకారం రాబోయే సంవత్సరాల్లో నీటి డిమాండ్ ప్రస్తుత సరఫరా కంటే రెండింతలు కావచ్చని అంచనా. కొన్ని అంచనాల ప్రకారం 2030 నాటికి దేశ జనాభాలో గణనీయమైన శాతం ప్రజలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. వ్యవసాయ రంగం మాత్రమే దేశ నీటి వినియోగంలో సుమారు ఎనభై శాతం వాటాను కలిగి ఉండటం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి మరింత పెరుగుతోంది.ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు పలు పథకాలను ప్రారంభించింది. 2019లో ప్రారంభమైన జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామీణ ఇంటికి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ అన్ని కుటుంబాలకు సురక్షిత నీరు చేరే దశ ఇంకా పూర్తి కాలేదు. పట్టణ ప్రాంతాల కోసం అమృత్ 2.0 పథకం అమల్లో ఉంది. అయినప్పటికీ నీరు రాష్ట్ర అంశమని కేంద్రం స్పష్టం చేస్తూ బాధ్యతను రాష్ట్రాలపై ఉంచుతోంది. వాస్తవానికి ఈ సంక్షోభం కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు, సమాజం కలిసి పరిష్కరించాల్సిన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశం.నీటి కాలుష్యం ఆరోగ్య రంగంపై కూడా భారంగా మారుతోంది. కలుషిత నీటివల్ల కలిగే వ్యాధుల చికిత్సకు ప్రజలు భారీగా ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కొరత వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పరిశుభ్రమైన నీరు అందక ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పలు నివేదికలు హెచ్చరించాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో పాటు వాటి నాణ్యత కూడా క్షీణించడం ద్వంద్వ సంక్షోభాన్ని సృష్టిస్తోంది. ఇప్పటికైనా శాస్త్రీయ ఆధారిత నీటి నిర్వహణ విధానాలు అమలు చేయాలి. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, పారిశ్రామిక కాలుష్య నియంత్రణ, వ్యవసాయంలో నీటి సమర్థ వినియోగం, గ్రామీణ స్థాయిలో నీటి పరీక్షా సదుపాయాల ఏర్పాటు వంటి చర్యలు అత్యవసరం. ప్రజల్లో అవగాహన పెంచి నీటి వృథాను తగ్గించడం కూడా సమానంగా ముఖ్యం. కేవలం పథకాలు ప్రకటించడం సరిపోదు; అమలు దశలో పారదర్శకత, నిరంతర పర్యవేక్షణ అవసరం.

మొత్తంగా చూస్తే దేశం నీటి విషయంలో ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. పరిశుభ్రమైన తాగునీరు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. కానీ అది సాధించాలంటే రాజకీయ సంకల్పం, శాస్త్రీయ దృష్టికోణం, సమగ్ర ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం అన్నీ కలగాలి. లేకపోతే నీటి కొరత, కాలుష్యం కలిసి దేశాన్ని ఆరోగ్య సంక్షోభ దిశగా నెట్టే ప్రమాదం ఉంది. నీరు జీవం అయితే, దాని రక్షణే భవిష్యత్తు రక్షణ.

## మాటల్లో కాదు - చేతల్లోచూపాలి!

**( డా.పోలం సైదులు, 9441930361)**

దేశం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుందని పాలకులు ఇటు రాష్ట్రంలో,అటు కేంద్రంలో సంక్షేమపథకాల గురించి గొప్పగా ప్రచారం చేస్తున్నారు. గణాంకాలు,నివేదికలు సాక్ష్యాలుగా చూపిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో మాత్రం నిజమైన పరిస్థితి భిన్నంగా ఉంది. సామాన్యుడి జీవితం ఇంకా కష్టాల మధ్యనే ఊగిసలాడుతోంది.

**వ్యవసాయంలో నలుగుతున్న రైతు:** మొదటిగా రైతును వెంటాడుతున్న సమస్య పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం. పంట పండించడానికి వేల రూపాయలు ఖర్చు పెట్టినా,మార్కెట్‌లో ఆ ఖర్చులకు సరిపడే ధర కూడా దక్కడం లేదు. ప్రభుత్వం మద్దతుధర ప్రకటించినా, చాలాచోట్ల ఆ ధరకు కొనుగోలు జరగడం లేదు. దళారులు,మధ్యవర్తుల చేతుల్లో రైతు మోసపోతున్నాడు. ఇక సాగుఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు,పురుగుమందుల ధరలు పెరిగాయి. కానీ పంటధరలు మాత్రం అదేస్థాయిలో ఉన్నాయి. పెట్టుబడి పెరిగి లాభం తగ్గడంతో వ్యవసాయం రైతుకు భారంగామారి మరింత ఇబ్బందుల్లోకి నెట్టి అప్పులపాలుచేస్తుంది. బ్యాంకుల నుంచి రుణాలు సమయానికి దొరకక, ప్రైవేట్ వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అధికవడ్డీలతో అప్పులుతీరని పరిస్థితి ఏర్పడుతోంది. పంటనష్టమైతే ఆ అప్పుల భారమే రైతుకుటుంబాన్ని మరింత కుంగదీస్తోందని చెప్పవచ్చు. ఇదిలా ఉంటేవాతావరణమార్పులు కూడా రైతుకు పెద్ద సవాల్‌గా మారాయి. అకాల వర్షాలు,వరదలు,కరువులు పంటలను నాశనం చేస్తున్నాయి. పంట బీమా ఉన్నా, నష్టపరిహారం ఆలస్యం కావడం లేదా పూర్తిగా అందకపోవడం వల్ల రైతుకు ఆశ్రయం లేకుండా పోతోంది. చాలా ప్రాంతాల్లో గ్రామాల నుంచి ప్రజలు వలస వెళ్లడంతో వ్యవసాయకూలీల కొరత ఏర్పడింది. కూలీలు దొరకకపోవడం,కూలీ ఖర్చులు పెరగడంవల్ల రైతుకు మరింత భారమవుతోంది. యాంత్రీకరణ ఉన్నా,చిన్నరైతులకు అది అందుబాటులో లేదు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా రైతు ఆవేదన మాత్రం అలాగే ఉంది. వ్యవసాయరంగంలో మౌలిక మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్న మాటలు చెబుతున్నప్పటికి అవి అమల్లోకి రావడంలేదు.

**విద్య,ఉపాధి రంగాల్లోనూ దీనస్థితి:** దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందంటారు. కానీ అదే యువత నేడు విద్య,ఉద్యోగరంగాల్లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. చదువుకున్నా ఉపాధి దొరకని పరిస్థితి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగం దొరికినా భద్రతలేని స్థితి యువతను ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. విద్యావ్యవస్థలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత,ఉపాధ్యాయుల లేమి,నాణ్యత తగ్గడం యువతను ప్రైవేట్ విద్య వైపు నెట్టేస్తోంది. కానీ ప్రైవేట్ విద్య ఖర్చులు సామాన్య కుటుంబాలకు అందని స్థాయిలో ఉన్నాయి. ఫలితంగా విద్యే యువతకు భారంగా మారుతోంది. డిగ్రీలు,పీజీలు, పీహెచ్డీలు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం కావడంవల్ల యువత ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది

. ఈ నిరీక్షణకాలంలో వయసు పరిమితులు,మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాలు పెరుగుతున్నాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగం దొరికినా తక్కువ జీతాలు, భద్రతలేని పని పరిస్థితులు యువతను నిరుత్సాహపరుస్తున్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పెరిగిపోవడంతో ఉద్యోగ స్థిరత్వం తగ్గుతోంది. పనిగంటలు ఎక్కువగా ఉండటం,వేతనం తక్కువగా ఉండటం వల్ల జీవన భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇవన్నీ కలిసి యువతలో మానసిక ఒత్తిడి పెరగడానికి కారణమవుతున్నాయి. నిరుద్యోగం, పోటీ,కుటుంబ ఒత్తిళ్లు యువతను ఆత్మవిశ్వాసం కోల్పోయేలా చేస్తున్నాయి. కొందరిలో డిప్రెషన్,నిరాశ పెరుగుతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే విద్య,ఉద్యోగ విధానాల్లో సమగ్రమార్పులు అవసరం.

# బిజినెస్

## స్వల్ప లాభాలతో ముగింపు, ఐపీఓలకు మంచి స్పందన

బుధవారం జరిగిన మార్కెట్ ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. సోలార్ వస్తువులపై అమెరికా దిగుమతి సుంకాలు విధించడం, మదుపర్ల లాభాల స్వీకరణకు కారణమైంది. బ్యారెల్ ముడిచమురు ధర కాస్త నష్టంతో 70.67 డాలర్ల వద్ద స్థిరపడింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 4 పైసలు పెరిగి 90.91 వద్ద ముగిసింది.

మార్కెట్ విలువ రూ. 1.74 లక్షల కోట్లు పెరిగి రూ. 467.38 లక్షల కోట్లు (5.14 లక్షల కోట్ల డాలర్లు)కి చేరింది. ఆసియా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి, మరియు భారతదేశంలో ఎక్కువ పుణ్యములు రంగాల్లో మెరుగుపడ్డాయి. సెన్సెక్స్ సూచీ 295 పాయింట్ల లాభంతో ప్రారంభమై, ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాల కారణంగా కొంత తగ్గింది. నిఫ్టీ 57.85 పాయింట్ల పెరుగుదలతో 25,482.50 వద్ద స్థిరపడింది. 30 షేర్లలో 20 షేర్లు లాభాలు సాధించగా, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్‌ఫార్మా తదితర షేర్లు గణనీయమైన లాభాలను నమోదుచేసాయి.



అయితే, రిలయన్స్, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్ వంటి కొన్ని షేర్లు నష్టపోయాయి.

ఓయో సంస్థ మాతృసంస్థ ప్రిజం బోర్డులో సెబీ మాజీ ఛైర్మన్ అజయ్ త్యాగిని స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించింది. ఈ నియామకంతో ఓయో తన ఐపీఓకు సిద్ధమవుతోంది.

పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జువెలరీ ఐపీఓ రెండో రోజు 83% స్పందనను పొందింది, కాగా శ్రీరామ్ ట్విస్టెక్స్ ఐపీఓకి 43.66 రెట్లు స్పందన లభించింది. ఈ విధంగా, మార్కెట్‌లో ఐపీఓలు మంచి స్పందనను రాబడుతున్నాయి.

ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)లో 2% ప్రభుత్వ వాటా విక్రయానికి సంస్థాగత మదుపర్ల నుంచి పూర్తి స్పందన లభించలేదు.

ఈ ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 23.52 కోట్ల షేర్లకు 94.98% స్పందన వచ్చినా, దానితో ప్రభుత్వ లక్ష్యం సాదించబడలేదు. రిటెయిల్ మదుపర్లు గురువారం బిడ్లు దాఖలు చేసుకోవచ్చు.

ఐఆర్‌ఎఫ్‌సీ ఓఎఫ్‌ఎస్‌కు దక్కని పూర్తి స్పందన: ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 2% ప్రభుత్వ వాటా విక్రయానికి సంస్థాగత మదుపర్ల నుంచి పూర్తి స్పందన లభించలేదు.

ఓఎఫ్‌ఎస్‌లో 23.52 కోట్ల షేర్లకు గాను 94.98 శాతానికి సమానమైన 22.34 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి.


గురువారం రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. 2% వాటాకు మించి స్పందన లభిస్తే, 4% వరకు వాటా విక్రయించాలన్నది ప్రభుత్వ యత్నం.

## విప్రో కన్స్యూమర్ కేర్ గ్లూకోవిటా లోలిపాప్ ప్రారంభం




విప్రో కన్స్యూమర్ కేర్ ఒ లైటింగ్ గ్లూకోవిటా బ్రాండ్, భారతదేశంలో తొలి గ్లూకోజ్ లోలిపాప్ ను ₹5 ధరతో మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ లోలిపాప్ పిల్లలకు శక్తిని త్వరగా పునరుద్ధరించడానికి గ్లూకోజ్ మరియు విటమిన్ సి తో ప్యాక్ చేయబడింది. ఈ కొత్త ఉత్పత్తి చిన్నారుల ఉత్సాహానికి, పాఠశాల, ఆటలు, మరియు రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన శక్తిని సమకూర్చుతుంది. దీని ప్రారంభాన్ని "ఎనర్జీ కా పవర్ బ్యాంక్" అనే ప్రచారంతో ప్రచారం చేస్తున్నారు, ఇందులో ఒక చురుకైన పిల్లవాడు పుట్టిన రోజు పార్టీ లో గెలుపును సాధించడానికి గ్లూకోవిటా లోలిపాప్ ద్వారా శక్తిని పొందుతాడు.

## అల్లానా పెట్ సొల్యూషన్స్ బోల్వర్స్ ఛాంపియన్ ప్రారంభం




అల్లానా పెట్ సొల్యూషన్స్ తన ప్రీమియం పెట్ న్యూట్రిషన్ బ్రాండ్ బోల్వర్స్ ద్వారా కొత్త ఉత్పత్తిగా "బోల్వర్స్ ఛాంపియన్" ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ ఉత్పత్తి ఆరోగ్యకరమైన మరియు శక్తివంతమైన కుక్కల కోసం డిజైన్ చేయబడింది. క్రికెట్ స్టార్ శుభ్మన్ గిల్ బ్రాండ్ అంబాసడర్‌గా ఉన్న ఈ ఛాంపియన్ సబ్-బ్రాండ్, కుక్కల శక్తి లోపం లేదా అదనపు పోషణ అవసరాలను తీర్చే లక్ష్యంతో రూపొందించబడింది. శాస్త్రీయంగా అభివృద్ధి చేయబడిన ఈ పోషణను పెట్ వైద్యులు ఆమోదించారు మరియు ఇది మానసిక మరియు శారీరక బలాన్ని పెంచడంలో సహాయపడుతుంది. ఈ ఉత్పత్తి భారతీయ క్రికెట్ జర్సీని ఆధారంగా తీసుకుని రూపొందించిన ప్యాకేజింగ్‌తో అందిస్తున్నది.

## భారతదేశంలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ప్రారంభం




ఓప్టిమమ్ సొల్యూషన్స్ మరియు ఏబీమ్ కన్సల్టింగ్ భారతదేశంలోని హైదరాబాద్, చెన్నై నగరాలలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను ప్రారంభించారు. ఈ సెంటర్లు జపాన్ మరియు ఇతర దేశాల సంస్థలకు డిజిటల్ మార్పు, ఎంటర్‌ప్రైజ్ మోడర్నైజేషన్, క్లౌడ్ మైగ్రేషన్, డేటా ఇంజనీరింగ్, మరియు ఏ.ఐ ఆధారిత నవీకరణలను అందించడానికి సేవలు అందిస్తాయి. ఈ భాగస్వామ్యం, భారతదేశంలో ఉన్న డిజిటల్ ఇంజనీరింగ్ శక్తిని ఉపయోగించి, సాంకేతిక పరిష్కారాలను వేగంగా, స్థిరంగా, మరియు సమర్థవంతంగా అందించేందుకు కట్టుబడింది.

## హైదరాబాద్‌లో ఫ్లోరియన్ హురెల్ సౌందర్య కేంద్రం ప్రారంభం



ఫ్లోరియన్ హురెల్ హెయిర్ కుటూర్ & స్పా తన హైదరాబాదులోని జ్యూబిలీ హిల్స్‌లో 15,000 చదరపు అడుగుల ప్రైవేట్ బంగ్లాతో కొత్త ప్రధాన కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సౌందర్య కేంద్రం, కేవలం సెలూన్ కాకుండా, సంపూర్ణ అనుభవానికి ఆర్కిటెక్చరల్ డిజైన్ మరియు కళాత్మకమైన అనుభవాలను సమ్మిళితం చేసిన ప్రదేశంగా రూపుదిద్దుకుంది. కుట్టర్ రీతిలో అందాన్ని పరిగణించడంతో పాటు, అధునాతన టెక్నాలజీ, పునరుద్ధరణ చర్యలు, మరియు ప్రత్యేక సేవలను అందిస్తుంది. ఇది హైదరాబాదులో కొత్త ప్రామాణికం రూపొందించడం లక్ష్యంగా ప్రారంభించబడింది.

## బిసిజి నివేదిక: భారత్ లో ఈ-కామర్స్ అభివృద్ధి

బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ తాజా నివేదిక ప్రకారం, భారత్ లో ఈ-కామర్స్ మార్కెట్ 2030 నాటికి ₹280--300 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ నివేదికలో, ఆన్లైన్ మరియు ఆఫ్‌లైన్ రిటైల్ మధ్య సహజమైన సంస్కరణపై దృష్టి సారించబడింది, ఇది వినియోగదారుల ప్రయాణంలో అనుసంధానమైన అనుభవాలను సూచిస్తుంది. ఈ-కామర్స్ రంగం పెరుగుతూ ఉండగా, చిన్న నగరాలు మరియు మధ్యతరగతి గుంపుల నుండి కొత్త వినియోగదారులు జోడవుతున్నారు. ఈ రంగం శ్రేయస్సును పెంచడంలో డిజిటల్ నైపుణ్యాల పరంగా అభివృద్ధి, భవిష్యత్తు-తయారైన లాజిస్టిక్స్ మరియు ఎగుమతి మార్గాలను సులభతరం చేయడం ముఖ్యమైన అంశాలు అవుతాయి.

## ఏఐ ఆధారిత ఆర్కెస్ట్రేషన్ టీసీఎస్, గిట్‌ల్యాబ్ భాగస్వామ్యం

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మరియు గిట్‌లాబ్ సంయుక్తంగా ఎంటర్‌ప్రైజ్‌లకు ఏఐ ఆధారిత ఆర్కెస్ట్రేషన్ మరియు ఆటోమేషన్‌ను అందించేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యం డెవ్‌సెక్‌ఓప్స్ లైఫ్‌సైకిల్‌ను వేగంగా అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. గిట్‌లాబ్ యొక్క ఏఐ ప్లాట్‌ఫామ్‌తో టీసీఎస్, ఎంటర్‌ప్రైజ్‌లకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, భద్రత మరియు కంప్లయెన్స్ విషయంలో సులభతరం చేయడానికి గవర్నెన్స్ మరియు సెక్యూరిటీకి అనుగుణంగా ఏఐ ఎజెంట్స్‌ను ఆర్కెస్ట్రేట్ చేయడంలో సహాయం చేస్తుంది. ఈ భాగస్వామ్యం, పెద్ద-పెద్ద ఎంటర్‌ప్రైజ్‌ల కోసం సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, మిగతా రంగాలలో ఆధునికీకరణకు మైలురాయిగా మారనుంది.

## హైదరాబాద్‌లో 5.3 లక్షల చదరపు అడుగుల హోటల్ ప్రీ-లీజింగ్



మైండ్స్‌ఫేస్ బిజినెస్ పార్క్స్ ఆర్.ఇ.ఐ.టి., హైదరాబాద్‌లోని మైండ్స్‌ఫేస్ మధపూర్ క్యాంపస్‌లో 5.3 లక్షల చదరపు అడుగుల వ్యాపార ప్రదేశాన్ని ఛాలెట్ హోటల్స్ లిమిటెడ్‌కు లగ్జరీ హోటల్ కోసం ప్రీ-లీజింగ్ చేసింది. ఈ ప్రాజెక్ట్ ₹350 కోట్లు పెట్టుబడిగా ఉంటూ, 2028 త్రైమాసికాంత్యం పూర్తి కానుంది. ఈ అభివృద్ధి, మైండ్స్‌ఫేస్ మధపూర్ క్యాంపస్‌లో ఉన్న వివిధ వ్యాపార ప్రదేశాల సమగ్ర పరివారం యొక్క విలువను పెంచుతుంది. ఈ హోటల్, బిజినెస్ ట్రావెల్ మరియు కార్పొరేట్ ఈవెంట్లను సపోర్ట్ చేస్తుంది, మైండ్స్‌ఫేస్ మధపూర్‌ను మరింత ఆకర్షణీయంగా మరియు ప్రీమియం స్థాయిలో నిలిపిస్తుంది.

## ఎసుఎస్ హైదరాబాద్ లో కొత్త ఎక్స్‌క్లూజివ్ స్టోర్ ప్రారంభం



తైవానీ టెక్ దిగ్గజం అయిన ఎసు-ఎస్ ఇండియా, దేశవ్యాప్తంగా తన రిటైల్ ముద్రను మరింత బలపరచడానికి హైదరాబాద్‌లో తన కొత్త ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ప్రారంభించింది. 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో విభిన్న ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్, అలాగే ఎసుఎస్ ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తులు అయిన వివూబుక్, జెన్‌బుక్, ఆర్‌ఓజి ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ డెస్క్‌టాప్స్, ఆల్-ఇన్-వన్ డెస్క్‌టాప్స్ మరియు యాక్సెసరీస్ అందించబడతాయి. ఈ స్టోర్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని 17వ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌గా నిలుస్తుంది. ఎసుఎస్, తెలంగాణ మార్కెట్‌ను ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, వినియోగదారులకు తమ తాజా ఆవిష్కరణలను అందించే ఉద్దేశంతో ఈ స్టోర్‌ను ప్రారంభించింది.

## పిఎల్ క్యాపిటల్ ఇండియాకు కొత్త వృద్ధి దిశ

పిఎల్ క్యాపిటల్ తన తాజా ఇండియా వ్యూహ నివేదికలో భారతదేశంలో వృద్ధి కొత్త దశను ప్రవేశపెట్టాలని పేర్కొంది. దేశంలో శ్రద్ధతో అమలు చేస్తున్న విధానాలు, వ్యాపార ఒప్పందాలు మరియు మౌలిక సదుపాయాల ప్రోత్సాహంతో, భవిష్యత్ లో మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. గతంలో మార్కెట్ స్థిరపడినప్పటికీ, ఇప్పుడు కొత్త ఆశలు మరియు మంచి ఫలితాల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ కాలంలో కంపెనీల పనితీరు బలంగా కొనసాగింది, మరియు 2026-28 కాలంలో 16.3% రాబడిని అంచనా వేయడం, మార్కెట్ మరింత పునరుద్ధరించబడతుందని సూచిస్తోంది. భారతదేశం విదేశీ వ్యాపార ఒప్పందాల్లో విశేష పురోగతిని సాధించింది. ఇండియా-యూరోపియన్ యూనియన్ ఫ్రీ ట్రేడ్ ఒప్పందం, భారతదేశం యొక్క అనేక రప్తానీ సెక్టార్లకు అనుకూలంగా ఉంది. 97% టారిఫ్ లైన్లపై భారతదేశానికి ప్రమాణిత ప్రయోజనాలు అందిస్తున్న ఈ ఒప్పందం, భారతదేశపు టెక్స్‌టైల్స్, చర్మ ఉత్పత్తులు, మారీన్ ఉత్పత్తులు మరియు ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. అదనంగా, ఆర్ఐటీ, ఐటీ సేవలు మరియు ఇతర సేవా రంగాలు కూడా ఈ ఒప్పందంలో మన్నించబడతాయి.

అమెరికాతో జరిగిన ఉత్పత్తి ఒప్పందం కూడా భారతదేశం కోసం అనుకూలంగా మారింది. ఇటీవలే చెలామణీ అవుతున్న ఈ ఒప్పందం, రెండు దేశాల మధ్య గణనీయమైన సుంకాల తగ్గింపును అందిస్తుంది. దీనితో భారతదేశం యొక్క రహదారి, వాయు భాగాలు, ఆటో భాగాలు మరియు కొన్ని ఇతర పరిశ్రమలు సులభతరం అవుతాయి. అమెరికా కూడా కొన్ని వస్తువులపై భారతదేశానికి సుంకాలు తగ్గించనుంది, ఇది దేశీయ ఉత్పత్తులకు బలంగా మారుతుంది.

భారతదేశంలో వ్యయాలు, పరిశ్రమలు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలలో ప్రధాన దృష్టి ఉంచి, మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయి. 2026-27 బడ్జెట్‌లో కేంద్రీయ పెట్టుబడులు 12% పెరిగినట్లు, అలాగే రాష్ట్రాల నుంచి కూడా పెట్టుబడులు పెరిగాయి. దీనితో పాటు, డిఫెన్స్ తయారీ, పునరుత్పత్తి శక్తి, డేటా సెంటర్లు వంటి కొత్త రంగాలు అభివృద్ధి చెందనున్నాయి. ౹ా ఝుఝుఝ్ఝుశ్రీ తెలిపింది, భారతదేశం ఈ కొత్త వృద్ధి దశలో చాలా దృష్టితో అడుగులు వేస్తోంది, తద్వారా దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలు సాధించవచ్చు.

## శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ 26 సిరీస్: ఏఐతో నూతన సాంకేతికత



శామ్‌సంగ్ ఈ రోజు తన గెలాక్సీ ౹ా26 సిరీస్‌ను విడుదల చేసింది, ఇందులో అద్భుతమైన పనితీరు, పరిశ్రమలోనే అగ్రగామి కెమెరా వ్యవస్థ మరియు గెలాక్సీ ఏఐ అనుభవాలు ఉన్నాయి. ఈ సిరీస్ శామ్‌సంగ్ యొక్క మూడవ తరగతి ఏఐ ఫోన్లుగా, గెలాక్సీ ఎస్26, ఎస్26ం మరియు ఎస్26 అల్ట్రా వినియోగదారులకు అద్భుతమైన ఫలితాలను అందించడానికి సులభంగా పనిచేస్తాయి. "గెలాక్సీ ఎస్26 సిరీస్‌తో, మేము ఏఐని శక్తివంతమైనదిగా, పనులు సాఫీగా నిర్వహించేలా రూపొందించాము, తద్వారా వినియోగదారులు దాని ఫలితాలను ఆస్వాదించవచ్చు," అని టి.ఎం. రోహ, సమసంగ్ ఎలక్ట్రానిక్స్ డివైస్ ఎక్స్‌పీరియన్స్ విభాగం అధ్యక్షుడు అన్నారు.

గెలాక్సీ ఎస్26 అల్ట్రా, సమసంగ్ యొక్క అతి సన్నని అల్ట్రా డివైస్, ప్రపంచంలో మొబైల్ ఫోన్ల కోసం తొలి గోప్యతా ప్రదర్శనని ప్రవేశపెడుతుంది. ఇది ప్రైవసీని కాపాడే సాంకేతికతను ప్రతిపాదిస్తుంది, అయితే వీక్షణ అనుభవాన్ని సంక్షోభం చేయకుండా పబ్లిక్ ప్రదేశాలలో కూడా ఉపయోగించదగిన విధంగా రూపొందించబడింది.

స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జనరల్ 5 మొబైల్ ప్లాట్‌ఫామ్‌తో శక్తివంతమైన పనితీరు అందిస్తూ, సూపర్ ఫాస్ట్ ఛార్జింగ్ 3.0 కూడా 30 నిమిషాల్లో 75% ఛార్జ్ చేస్తుంది.

గెలాక్సీ ఎస్26 అల్ట్రా కెమెరా వ్యవస్థను మరింత మెరుగుపరచింది, అందులో విస్తృతమైన అపర్చర్‌లు, నైట్‌ఓగ్రఫీ వీడియోలు మరియు అల్ట్రా-స్టేడీ టెక్నాలజీ ఉన్నాయి. దీనితో, కాంతి తక్కువ ఉన్న చోట కూడా స్పష్టమైన వీడియో ఫుటేజ్‌ను రికార్డ్ చేయవచ్చు. ఇది ముందు కెమెరా పై పట్టు చక్కగా చేయడానికి సహాయపడే ఏఐ ఐఎస్పి అభివృద్ధిని కూడా కలిగి ఉంది. ప్రత్యేకంగా, ఈ పరికరం హై-క్వాలిటీ వీడియో యొక్క సమర్థవంతమైన కంప్రెషన్ కోసం ముందుగా ఉన్న అడ్వాన్స్ ప్రొఫెషనల్ వీడియో (ఎపివి) ప్రమాణాన్ని మద్దతు ఇస్తుంది.

౹ా26 సిరీస్, జ్ఞానశక్తి ఏఐకి మౌలిక స్థితిని ఏర్పడుతుంది, ఇప్పుడు నడ్జ్, బిక్స్బీ అప్‌గ్రేడ్‌తో సహా, వినియోగదారులకు సహాయపడే సమయానికి సంబంధించిన సూచనలను అందిస్తుంది. ఏఐ ఎడిటింగ్ టూల్స్‌ను, రియల్‌టైమ్ ఫీచర్లను, ప్రైవేట్ ఆల్బమ్, నాక్స్ మేట్రిక్స్ రక్షణను, మరియు సెక్యూరిటీ అప్డేట్స్‌ను సమర్థంగా నిర్వహిస్తుంది.

కొత్త గెలాక్సీ బడ్స్4 సిరీస్ కూడా ప్రొఫెషనల్ హై-ఫై ఆడియో, యాక్టివ్ నాయిస్ క్యాన్సలేషన్, ఎడాప్టివ్ ఈక్వీ, సూపర్ క్లియర్ కాల్ ఫీచర్లు అందిస్తుంది. ఇవి బిక్స్బీ, గూగుల్ జెమినీ మరియు పెర్లెక్సిటీ వంటి AI సహాయకులతో మిళితమై వినియోగదారుల అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తుంది.

## సనోఫీ: 4వ త్రైమాసికంలో ఆదాయంలో 47% వృద్ధి

సనోఫీ కన్స్యూమర్ హెల్త్‌కేర్ ఇండియా లిమిటెడ్ తన 2025 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికం ఫలితాలను ప్రకటించింది, ఇందులో ఆదాయంలో 47% వృద్ధి, నికర లాభం 50% పెరిగింది. 4వ త్రైమాసికంలో మొత్తం ఆదాయం ₹2,510 మిలియన్లను చేరుకుంది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 47% వృద్ధి చూపించడంతో దేశీయ విక్రయాలు 23% పెరిగాయి.

ఎగుమతులు 9.3 రెట్లు పెరిగిన కారణంగా, ఎగుమతి విక్రయాలు కూడా ముఖ్యమైన వృద్ధిని నమోదు చేశాయి. నికర లాభం ₹665 మిలియన్లను చేరుకుని 50% పెరిగింది.

2025 ఆర్థిక సంవత్సరం మొత్తం ఆదాయం ₹8,784 మిలియన్లను చేరింది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 21% వృద్ధి. దేశీయ విక్రయాలు 7% పెరిగాయి, అయితే ఎగుమతుల విక్రయాలు 158% పెరిగాయి. నికర లాభం ₹2,401 మిలియన్లను చేరుకుంది, 33% వృద్ధి చూపించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి ₹75 పెరుగుదలతో డివిడెండ్‌ను ప్రకటించారు.

సనోఫీ కన్స్యూమర్ హెల్త్‌కేర్ ఇండియా లిమిటెడ్ యొక్క మేనేజింగ్ డైరెక్టర్ హిమాంశు బాక్షీ చెప్పారు, "ఈ త్రైమాసిక ఫలితాలు మా కోర్ పోర్ట్‌ఫోలియో యొక్క బలాన్ని మరియు మా వృద్ధి కార్యాచరణను ప్రతిబింబిస్తున్నాయి. మా దేశీయ వ్యాపారం డబుల్ డిజిట్ వృద్ధిని సాధించింది మరియు ఎగుమతి మార్కెట్ల నుండి కూడా బలమైన భాగస్వామ్యం ఏర్పడింది. మా బ్రాండ్లను మెరుగుపరచడంలో మరియు వినియోగదారులకు అవసరమైన అంశాలను ప్రోత్సహించడంలో మేము చేసిన కృషి గౌరవించబడింది."

సనోఫీ కన్స్యూమర్ హెల్త్‌కేర్ ఇండియా లిమిటెడ్ యొక్క ఛైర్మన్ అమిత్ జైన్ అన్నారు, "మా వ్యూహం బలవంతంగా ఉంది మరియు మా బృందాలు విస్మయకరమైన ఫలితాలను సాధించాయి.

మా పోర్ట్‌ఫోలియో యొక్క వ్యాప్తిని పెంచడం మరియు డిజిటల్ మార్పిడి వేగంగా చేయడం ద్వారా మేము అన్ని భాగస్వాములకు అర్థవంతమైన ఫలితాలను అందించాం."

## ప్రైమ్‌బుక్ భాగస్వామ్యాలతో ఆఫ్‌లైన్ పరిధిని విస్తరిస్తుంది



ప్రైమ్‌బుక్ ఇండియా, ఇండియాలో ఆండ్రాయిడ్ ఆధారిత లాప్‌టాప్ ఎకోసిస్టమ్‌ను ముందుకు నడిపించేవారు, సాంఘీకత మొబైల్స్ మరియు పాయి ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ తో నిర్వహించిన వ్యూహాత్మక భాగస్వామ్యాలతో తమ ఆఫ్‌లైన్ రీటైల్ ప్రవేశాన్ని విస్తరించడాన్ని ప్రకటించారు. ఈ భాగస్వామ్యాల ద్వారా ప్రైమ్‌బుక్ లాప్‌టాప్‌లు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని సాంఘీకత మొబైల్స్ దుకాణాలు మరియు హైదరాబాద్, బెంగళూరులోని పాయి ఇంటర్నేషనల్ అవుట్లెట్లలో అందుబాటులో ఉంటాయి. ఈ వ్యాపన విస్తరణ ప్రైమ్‌బుక్ యొక్క ఆమ్నీచానల్ వ్యూహాన్ని బలోపేతం చేస్తుంది, దీనితో అది డిజిటల్ ఆధారిత మౌలిక వాతావరణానికి భౌతిక రీటైల్ యాక్సెస్‌ను జోడించనుంది.

భౌతిక రీటైల్ ఎంట్రీ, ఆన్‌లైన్ రీటైల్ పెరుగుతున్నప్పటికీ, వ్యక్తిగత కంప్యూటింగ్ విభాగంలో భారతీయ వినియోగదారులు కొనుగోలు చేసే ముందు పెద్దగా సమీక్ష చేసే ఖాతాలో సమయం పెట్టేవారు. పరిశ్రమ అంచనాల ప్రకారం, దేశంలో వినియోగదారుల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల అమ్మకాల్లో ఆఫ్‌లైన్ రీటైల్ 66% కొరకు బాధ్యత వహిస్తుంది, ఇది భౌతిక దుకాణాల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది, ముఖ్యంగా అధిక-చూసిన కేటగరీలలో. రీటైల్ విస్తరణలో ప్రైమ్‌బుక్ 2 ప్రో ₹17,990 మరియు ప్రైమ్‌బుక్ 2 మ్యాక్స్ ₹19,990 ధరల్లో అందుబాటులో ఉండగా, జీరో డౌన్ పేమెంట్ ఈఎంఐ ఆఫర్లతో వినియోగదారుల రిస్కును తగ్గిస్తుంది.

ప్రైమ్‌బుక్ యొక్క సహ-సంస్థాపకుడు మరియు సిఇఒ చిరంతన్ను మహంత్ ఈ అభివృద్ధిపై వ్యాఖ్యానిస్తూ, "ప్రైమ్‌బుక్ పర్సనల్ కంప్యూటింగ్‌ను కొత్త తరగతికి పునర్నిర్మించేందుకు రూపొందించబడింది. ఆఫ్‌లైన్ రీటైల్‌లో విస్తరించడం మా ధరలతోనే కాదు, హాజరుతో కూడిన ప్రాప్తిని బలపరుస్తుంది. సాంఘీకత మొబైల్స్ మరియు పాయి ఇంటర్నేషనల్ వంటి స్థాపిత రీటైల్ నాయకులతో భాగస్వామ్యాలు చేసే ద్వారా మరింత మంది వినియోగదారులు మా లాప్‌టాప్‌లను ప్రత్యక్షంగా అనుభవించగలుగుతారు."

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ₹583 కోట్ల చెల్లింపు

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తన ఖాతా శాఖలోని కొన్ని లావాదేవీలపై హర్యానా ప్రభుత్వ శాఖలతో సంబంధం ఉన్న తప్పుల వ్యవహారంలో ముందస్తు పరిశీలనలో భాగంగా అప్రామాణిక చెల్లింపులు జరిగాయని తెలిపింది. ఈ ఘటనా విషయంపై దర్యాప్తు కొనసాగుతుండగా, బ్యాంకు తక్షణమే ₹583 కోట్లు మొత్తంలో ప్రభుత్వ శాఖల పూర్ణ విలువను తిరిగి చెల్లించింది. ఈ నిర్ణయం బ్యాంక్ యొక్క సూత్రాలపైన ఉన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తుంది. హర్యానా ప్రభుత్వం మరియు చట్టపరమైన వ్యవస్థలతో కూడిన మద్దతుతో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నిందితులను శిక్షించాలని సంకల్పించింది.

## ఏఎస్‌సిఐ ఇన్ఫ్లుయెన్సర్ అవగాహన ప్రచారం


ప్రచార ప్రమాణాల పరిచయ సంస్థ (ఏఎస్‌సిఐ) మొట్టమొదటిసారిగా ఇన్ఫ్లుయెన్సర్ ఆధారిత వినియోగదారు అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది, దీని ద్వారా గ్రీన్‌వాషింగ్ మరియు డార్క్ ప్యాటర్న్స్ పై జాగ్రత్తలు తీసుకోవాలని వినియోగదారులను తెలియజేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రచారంలో భాగంగా, ఇన్ఫ్ల్యుయెన్సర్లు పర్యావరణ సంబంధిత అంగీకారాలను విశ్లేషించడం, నిజమైన సుస్థిరత వాగ్దానాలు మరియు ప్రచారంలో ఉపయోగించే మోసపు పద్ధతులను గుర్తించడం వంటి అంశాలపై వినియోగదారులను అవగాహన పెంపొందిస్తారు. ఏఎస్‌సిఐ ఈ ప్రయత్నంతో వినియోగదారులకు మోసపు ప్రకటనలను గుర్తించి, వాటిపై సమర్థవంతంగా స్పందించడానికి సహాయం చేయాలని ఆశిస్తోంది.

## హెచ్‌సిఎల్‌టెక్ మరియు ఐఐటీ కాంపూర్ భాగస్వామ్యం




హెచ్‌సిఎల్‌టెక్ మరియు ఐఐటీ కాంపూర్ మధ్య చేసిన ఒప్పందం, గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ (జిసిసిలు) కోసం కట్‌టింగ్-ఎజ్ రీసెర్చ్‌ను వాస్తవ ప్రపంచంలో ప్రవేశపెట్టి స్కేలబుల్ పరిష్కారాలుగా మార్చడం లక్ష్యంగా ఉంది. ఈ భాగస్వామ్యం, హెచ్‌సిఎల్‌టెక్ యొక్క గ్లోబల్ సేవలతో కూడిన శక్తివంతమైన పరిశోధన ఆధారిత ఆవిష్కరణను జిసిసిలకు అందించడంలో సహాయపడుతుంది. ఐఐటీ కాంపూర్, ఏఐ, రోబోటిక్స్, సైబర్‌సెక్యూరిటీ వంటి కొత్తతరం సాంకేతికతలలో ఉన్న తన పరిశోధన నైపుణ్యాన్ని హెచ్‌సిఎల్‌టెక్ తో కలిసి పరిశ్రమకు అనుకూలంగా మారుస్తుంది. ఈ భాగస్వామ్యం జిసిసిలను వేగంగా మరియు సమర్థవంతంగా పరిశోధన నుంచి వ్యాపార పరిష్కారాలవైపు తీసుకెళ్ళేందుకు సహాయపడుతుంది.

## ఇండియా-బ్రెజిల్ ఆరోగ్య సంయుక్త భవిష్యత్




ఫార్మెక్సిల్ ఆధ్వర్యంలో, భారతదేశం మరియు బ్రెజిల్ మధ్య ఔషధ రంగంలో సంయుక్త భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఒక కీలక సమావేశం న్యూఢిల్లీ లో నిర్వహించబడింది. ఈ సమావేశం, బ్రెజిల్ నుండి ఉన్నతస్థాయి ప్రతినిధులతో కలిసి, ఆంకాలజీ ఔషధాలు, బయోసిమిలర్స్, కాంప్లెక్స్ థెరపీస్ మరియు ఆసుపత్రి సాంకేతికతలలో భాగస్వామ్యాలను పెంచే అవకాశాలను అన్వేషించింది. భారతదేశం బ్రెజిల్ కు ఔషధాల రప్తు పెరిగిన నేపథ్యంలో, ముఖ్యంగా చిన్న మరియు మధ్యతరగతి ఔషధ తయారీ సంస్థలు ప్రత్యేక ఔషధాలు మరియు బయోమెడికల్ ఉత్పత్తుల రంగంలో మరింత పెరుగుదలను అందుకుంటున్నాయి. ఫార్మెక్సిల్ ఈ భాగస్వామ్యాలను మరింత మెరుగుపర్చడానికి మరియు బ్రెజిల్ మార్కెట్ లో బాధ్యతాయుతంగా ప్రవేశించడానికి చర్యలు చేపడుతోంది.

## యాస్ ద్వీపంలో ప్రత్యేక ఎపిసోడ్‌లతో ఇండియన్ ఐడల్ తొలి ప్రవేశం



ఇండియన్ ఐడల్ సీజన్ 16 తన మొదటి అంతర్జాతీయ ప్రయాణాన్ని యాస్ ద్వీపం, అబుదాబిలోని వర్నర్ బ్రోస్. వరల్డ్‌లో చిత్రీకరించిన ప్రత్యేక ఎపిసోడ్స్ తో ప్రారంభించింది. ఈ ఎపిసోడ్స్ "యాదోంకి ప్లే లిస్ట్" అనే థీమ్‌ను అనుసరించి, సంగీతం, జ్ఞాపకాలు మరియు భావోద్వేగాలను వెలికితీసేలా రూపొందించబడ్డాయి. బద్షా, విశాల్ దాదలాని, మధుబంతి బాగ్చి వంటి ప్రముఖులు జడ్జిగా వ్యవహరించారు. ఈ ప్రత్యేక ఎపిసోడ్స్‌లో పాల్గొన్న పోటీదారులు యాస్ ద్వీపం యొక్క వివిధ అద్భుతమైన ప్రదేశాలను సందర్శించి, ఆసక్తికరమైన అనుభవాలను పొందారు. ఈ సమన్వయంతో యాస్ ద్వీపం భారతదేశంలో మరియు అంతర్జాతీయంగా మరింత ప్రసిద్ధిచెందింది.

## బుక్‌మైషోలో హోలీవుడ్ టికెట్ 2026 ఉత్సవాలు

హైదరాబాద్‌లో 2026 హోలీ ఉత్సవాలు ఈ సారి మరింత వైవిధ్యంతో సాగనున్నాయి. బుక్‌మైషో ద్వారా నగరంలోని పెద్ద హోలీ వేడుకలు అందుబాటులో ఉన్నాయి. పలు రకాల సంగీత వేడుకలు, రంగులతో పుడమి మీద ఆటలు, డీజే సెట్లు మరియు వివిధ పార్టీలతో కూడిన ప్రత్యేకమైన ఉత్సవాలను అందిస్తుంది. సన్‌బర్న్ హోలీ, ది జంగిల్ హోలీ, హైడ్స్ బిగ్గెస్ట్ హోలీ వేవ్ 2.0 వంటి ప్రఖ్యాత ఈవెంట్స్ నుంచి శాస్త్రీయ ధోరణి గల హోలీ కల్చర్‌ని కూడగట్టిన రాధాకృష్ణ హోలీ ఉత్సవం వరకు, ప్రతి వేదిక అలాంటి వేడుకలతో కళాత్మకంగా కాంతిస్తుందిఅని చెప్పవచ్చు. ఆసక్తికరమైన సంగీత ప్రదర్శనలు, రంగుల ఆటలు, సెలబ్రిటీ సందర్శనలు, ఫోమ్ జోన్లు, రైన్ డాన్స్, మరియు పరిమళాలు ఉన్న ప్రత్యేక బుళ్ళు, ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన వేడుకలో పాల్గొనే అవకాశాన్ని ఇస్తాయి.

## మింత్రా 19వ బర్త్‌డే బ్లాస్ట్‌లో అద్భుతమైన ఆఫర్లు!




మింత్రా తన 19వ పుట్టినరోజును మింత్రా బర్త్‌డే బ్లాస్ట్ ద్వారా ఉత్సాహంగా జరుపుకుంటోంది. ఈ పండుగ ఉత్సవంలో 6 మిలియన్లకు పైగా స్టైల్లను అందుబాటులో ఉంచుతూ, ఫ్యాషన్, బ్యూటీ, జీవనశైలి విభాగాలలో 20,000ం బ్రాండ్‌ల నుంచి వివిధ శ్రేణులు అందిస్తున్నాయి. ఫిబ్రవరి 28న లైవ్ కానున్న ఈ ఈవెంట్, ఫిబ్రవరి 27 నుంచి మింత్రా ఇన్‌సైడర్‌లకు ముందస్తు యాక్సెస్ ఇస్తుంది. వివాహాలు, పండుగలు, ప్రయాణాల వంటి ప్రత్యేక సందర్భాలకు తగిన ఉత్పత్తులతో, వినియోగదారులకు అదనపు బహుమతులు, రిటర్న్ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. ప్రముఖ బ్రాండ్లు, కొత్త సేకరణలు, డీల్స్, 19 మినిట్స్ డీల్స్, ఓఎంజి డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లు వినియోగదారులను ఆకర్షిస్తాయి. ఈ బర్త్‌డే బ్లాస్ట్ సమయంలో, జెన్ జెడ్, మిలీనియల్ ప్రేక్షకులకు అనుగుణంగా సోషల్ వాణిజ్య పర్యావరణంలో కస్టమర్లను మరింత ఎంగేజ్ చేయడానికి మింత్రా తన సామాజిక వాణిజ్య విధానాలను మరింత బలోపేతం చేస్తోంది.

## ఆమెజాన్-నెటాఫిమ్ చేత నీటి ఆదా ప్రాజెక్టులు



ఆమెజాన్ ఇండియా, నెటాఫిమ్‌తో కలిసి బెంగళూరు మరియు హైదరాబాద్‌లో కొత్త నీటి ఆదా ప్రాజెక్టులను ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 325 మిలియన్ల లీటర్ల నీటిని సంవత్సరానికి ఆదా చేయాలని అంచనా. డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పర్యావరణ స్నేహపూర్వకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ, వ్యవసాయ భూముల్లో పంటలకు నీటి సరఫరా చేస్తుంది, తద్వారా పెరిగిన నీటి అవసరాలను తక్కువ చేస్తుంది. బెంగళూరులో 80 హెక్టార్లపై గోర్డ్స్ మరియు టమాటో పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అమలు చేయడంతో 175 మిలియన్ల లీటర్ల నీటిని ఆదా చేస్తుంది. అలాగే, హైదరాబాద్‌లో 40 హెక్టార్లపై మక్కా మరియు కూరగాయల పంటలకు ఈ పద్ధతి అమలు చేయడంతో 150 మిలియన్ల లీటర్ల నీటిని ఆదా చేయగలదు. ఈ ప్రాజెక్టులు 2027 నాటికి "వాటర్ పాజిటివ్" లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా, సమాజానికి మరింత నీటిని అందించడంలో సహాయపడతాయి.

## సెట్ లెర్న్ పొందండి భారతదేశంలో భవిష్యత్ విద్యకు మద్దతు




ఆర్విండ్ మఫటలాల్ గ్రూప్‌కు చెందిన గెట్ సెటు లెర్న్, క్వాల్కమ్ టెక్నాలజీస్ మరియు ఆర్దునియోతో కలిసి భారతదేశంలోని కె-12 విద్యార్థులకు భవిష్యత్ స్కిల్స్ మరియు ఏఐ విద్య అందించేందుకు కీలకమైన భాగస్వామ్యం చేసుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు శారీరక ఏఐ, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ మరియు కోడింగ్ నేర్చుకుంటారు, ఇవి వారి భవిష్యత్ ఉద్యోగ కౌశలాలను మెరుగుపరుస్తాయి. క్వాల్కమ్ టెక్నాలజీస్, ఆర్దునియో మరియు గెట్ సెటు లెర్న్ కలిసి విద్యార్థులకు నిజమైన ప్రపంచ టెక్నాలజీని క్లాసు గదుల్లో అందించడం ద్వారా, వారు పరికరాలను రూపొందించడానికి, పరీక్షించడానికి మరియు స్మార్ట్ సిస్టమ్‌లను నిర్మించడానికి శిక్షణ ఇస్తారు. ఈ భాగస్వామ్యం సాంకేతిక పరిజ్ఞానం కోసం సరళమైన, ప్రామాణికమైన పాఠ్యాంశాలను రూపొందించి, భారతదేశంలోని పాఠశాల వ్యవస్థలో దాని అమలును పెంచడానికి పనిచేస్తుంది.




# త్వరలో భారత్ - ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



● ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో భారత ప్రధాని మోడీ భేటీ
● ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక చర్చలు - తుదిరూపును తీసుకునేలా చర్యలు ● రక్షణ రంగంలో సరికొత్త దిశను చూపిస్తుందనే ఆశాభావం ● ఇరు దేశాల అధ్యక్షులు మీడియాతో ముఖాముఖి

భారత్ – ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) త్వరలోనే తుదిరూపును తీసుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. ఈ డీల్ ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్‌లో భారతదేశ యూపీఐను వినియోగంలోకి తేవడంపైనా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నామని చెప్పారు. పౌర అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల్లోనూ భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తాయన్నారు. గురువారం మధ్యాహ్నం జెరూసలెంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. అనంతరం ఇద్దరూ కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పై వివరాలను మోదీ ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ వంటి టెక్నాలజీలలో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామన్నారు. భవిష్యత్ వ్యవసాయ అవసరాలను తీర్చగల కొత్త టెక్నాలజీలనూ సంయుక్తంగా అభివృద్ధి చేస్తామని ప్రధాని చెప్పారు. భారత్, ఇజ్రాయెల్‌లలో విలేజెస్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను క్రియేట్ చేయడంపైనా ఫోకస్ పెడతామన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా రక్షణ రంగంలోనూ ఇరుదేశాలు సహకరించుకుంటున్నాయని ఆయన గుర్తు చేశారు. రక్షణ రంగంలో గత సంవత్సరం ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) సరికొత్త దిశను చూపిస్తుందనే ఆశాభావాన్ని మోదీ వ్యక్తం చేశారు.

**140 కోట్ల భారతీయులకు దక్కిన గౌరవమిది**

"భారత్ – ఇజ్రాయెల్ సంబంధాలు అత్యంత క్లిష్టమైన కాల పరీక్షల్లోనూ నెగ్గాయి. దీన్ని మేం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్ చేయాలని భావిస్తున్నాం. ఇరుదేశాల సంబంధాలకు కొత్త దిశను చూపడం, కొత్త వేగాన్ని అందించడంపైనే నేను, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ చర్చించాం. నాకు ప్రతిష్ఠాత్మక స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్‌ను ప్రదానం చేసినందుకు ఇజ్రాయెల్ ప్రధానికి ధన్యవాదాలు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవం. భారత్, ఇజ్రాయెల్ బలమైన స్నేహబంధానికి ప్రతీక. బలమైన విశ్వాసం, ఉమ్మడి ప్రజాస్వామిక విలువలు అనే పునాదులపై ఇరుదేశాల సంబంధం నిలిచి ఉంది" అని భారత ప్రధాని మోదీ తెలిపారు.

**ఐఎంఈసీ, ఐ2యూ2లలోనూ ముందుకుసాగుతాం**

"గాజా శాంతి ప్రణాళిక ద్వారా పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు బాటలు పడ్డాయి. ఈ ప్రయత్నాలకు భారత్ బలమైన మద్దతును అందించింది. ఇకపైనా మా మద్దతును అందిస్తాం. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని శాంతి, సుస్థిరతలకు నేరుగా భారతదేశ భద్రతా ప్రయోజనాలతో అవినాభావ సంబంధం ఉంటుంది. సైనిక సంఘర్షణలలో మానవత్వం అనేది అస్సలు బాధితం కాకూడదు. గ్లోబల్ సౌత్‌తో పాటు యావత్ మానవాళి కోరుకుంటున్నది ఇదే. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు అనేది భారత్, ఇజ్రాయెల్‌ల స్పష్టమైన విధానం. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంగీకరించేది లేదు. ఉగ్రవాదంపై, దానికి మద్దతు తెలిపే వారిపై మా పోరాటం కొనసాగుతుంది. ఇండియా – మిడిల్ ఈస్ట్ – యూరోప్ ఎకనామిక్ కారిడార్(ఐఎంఈసీ), ఇండియా – ఇజ్రాయెల్ – యూఏఈ – అమెరికాలతో కూడిన ఐ2యూ2 కూటమి విషయంలోనూ మేం కలిసికట్టుగా ముందుకు సాగుతాం. ప్రాంతీయ స్థాయిలో అన్ని దేశాలు అనుసంధానం కావడానికి ఈ ప్రాజెక్టులు కీలకమైనవి" అని ప్రధాని మోదీ చెప్పారు.

**ఇరుదేశాల మంత్రుల స్థాయిలో సంప్రదింపులు : నెతన్యాహూ**

ప్రతిభావంతులైన నిపుణులను కలిగిన భారత్, ఇజ్రాయెల్ కలిసికట్టుగా ముందుకు సాగిత్తే అద్భుతాలు చేయగలవని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. ఇకపై కూడా భారతీయులు, ఇజ్రాయెలీల మనసులు, మేధస్సులు ఏకమై పనిచేస్తాయని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై త్వరలోనే ఇరుదేశాల మంత్రుల స్థాయిలో సంప్రదింపులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

**భారత్ –ఇజ్రాయెల్ ఒప్పందాలతో యువత, వ్యాపారులకు కొత్త అవకాశాలు :** భారత్, ఇజ్రాయెల్ మధ్య కుదిరిన ఒప్పందాల వల్ల ఇరుదేశాల యువత, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి తెలిపారు. ప్రత్యేకించి స్టార్టప్‌లు, టెక్నాలజీ, సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో కొత్తకొత్త అవకాశాలు ఏర్పడుతాయని ఆయన చెప్పారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయన్నారు. శాంతి, ఆవిష్కరణలు, వికాసం కోసం ఇరుదేశాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయని విక్రమ్ మిస్రి పేర్కొన్నారు. టెక్, కొత్త ఆవిష్కరణల విభాగంలో దేశాన్ని ముమ్మందుకు తీసుకెళ్లాలనే ప్రధాని మోదీ విజన్‌కు ఊతం ఇచ్చేలా భారత్, ఇజ్రాయెల్ మధ్య ఒప్పందాలు కుదిరాయన్నారు. వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్‌కు ఇవి దోహదం చేస్తాయని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, హారిజాన్ స్కానింగ్ మెకానిజంలలోనూ భారత్‌కు ఇజ్రాయెల్ సహకారాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు.

**వాణిజ్య ఒప్పందంపై చర్చలు : భారత్‌లో ఇజ్రాయెల్ ప్రతినిధులు**

"2024 సెప్టెంబరులో భారత్, ఇజ్రాయెల్ ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారుపై తొలి విడత సంప్రదింపులు జరిపేందుకు తాజాగా గురువారం రోజు ఇజ్రాయెల్ ప్రతినిధుల టీమ్ భారత్‌కు వచ్చింది. ఇప్పుడు ఇరుదేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇందుకోసం ద్వైపాక్షిక ఆర్థిక సంప్రదింపులను జరపాలని భారత్, ఇజ్రాయెల్ నిర్ణయించాయి. గత కొన్నేళ్లలో దాదాపు 42వేల మంది భారతీయ నిపుణులు ఇజ్రాయెల్‌కు వెళ్లారు. వాణిజ్య, సేవ, తయారీ, రెస్టారెంట్ విభాగాల్లో మానవ వనరుల నియామకంతో ముడిపడిన మార్గదర్శకాలపై ఇవాళ భారత్, ఇజ్రాయెల్ సంతకాలు చేశాయి. దీనివల్ల ఇజ్రాయెల్‌లోని ఆయా విభాగాల్లో భారతీయులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి. రాబోయే ఐదేళ్లలో ఈ విభాగాల్లో మరో 50వేల మంది భారతీయులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి" అని విక్రమ్ మిస్రి వివరించారు.

**100కు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ అగ్రికల్చర్‌లు**

"భారత్ – ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ ఫండ్, ఇండియా – ఇజ్రాయెల్ జాయింట్ రీసెర్చ్ కాల్స్‌లను బలోపేతం చేయాలనే నిర్ణయం ప్రధాని పర్యటనలో జరిగింది. ప్రత్యేకించి ఇండియా – ఇజ్రాయెల్ జాయింట్ రీసెర్చ్ కాల్స్ కోసం ఇరుదేశాల వైపు నుంచి కేటాయించే బడ్జెట్‌ను రూ.13.63 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ఇరుదేశాల యూనివర్సిటీలు సంయుక్తంగా రీసెర్చ్ వర్క్‌లు చేయగలుగుతాయి. భారత్ – ఇజ్రాయెల్ అకడమిక్ కోఆపరేషన్ ఫోరమ్‌ను ఏర్పాటు చేయాలని మోదీ, నెతన్యాహూ నిర్ణయించారు. రీసెర్చ్, పాలసీ, ఎడ్యుకేషన్ విభాగాల్లో ఇది పనిచేస్తుంది. ఇజ్రాయెల్ సహకారంతో 43 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ అగ్రికల్చర్‌లను భారత్‌లో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల సంఖ్యను 100కు పెంచాలని ఇప్పుడు డిసైడ్ చేశారు. దీనిపై ఒక ఎంఓయూ కుదిరింది. ఇందులో భాగంగా ఇండియా – ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ అగ్రికల్చర్‌ను భారత్‌లో ఏర్పాటు చేస్తారు. ఇజ్రాయెల్‌లోని వోల్కానీ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లోని భారత పరిశోధకులకు సంయుక్త ఫెల్లోషిప్‌ను ప్రదానం చేయాలని నిర్ణయించారు" అని విక్రమ్ మిస్రి పేర్కొన్నారు.

**ఎన్‌పీసీఐ, మాషావ్ సహకారం**

"భారత్‌కు చెందిన ఎన్‌పీసీఐ, ఇజ్రాయెల్‌కు చెందిన మాషావ్ డిజిటల్ పేమెంట్స్‌ల మధ్య సహకారాన్ని పెంచాలనే దానిపైనా ఎంఓయూ కుదిరింది. ఇరుదేశాల మధ్య జరిగే లావాదేవీల వ్యవహారంలో పరస్పర సహకారాన్ని అందించుకోవాలని ఎన్‌పీసీఐ, మాషావ్ నిర్ణయించాయి. ఇజ్రాయెల్ నుంచి భారత్‌కు జరిగే లావాదేవీల కోసం యూపీఐను అనుమతించే అంశంపైనా ఇరుదేశాలు అవగాహనకు వచ్చాయి. పరస్పర వాణిజ్యం, టూరిజాన్ని పెంచుకోవాలని భారత్, ఇజ్రాయెల్ నిర్ణయించాయి" అని విక్రమ్ మిస్రి తెలిపారు.

**భారత్ – ఇజ్రాయెల్ కీలకమైన ఎంఓయూలు**

గుజరాత్‌లోని లోథల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయడంలో భారత్‌కు ఇజ్రాయెల్ సహకారాన్ని అందించనుంది. దీనిపై ఇరుదేశాల మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

భూభౌతిక అన్వేషణల విభాగంలో భారత్‌కు టెక్నాలజీ పరమైన సహకారాన్ని అందించే విషయంపై ఇరుదేశాల మధ్యం ఎంఓయూ కుదిరింది.

ఫిషరీస్, ఆక్వా కల్చర్ విభాగాల్లో కలిసి పనిచేసే అంశంపైనా ఎంఓయూ కుదిరింది. హారిజాన్ స్కానింగ్ విభాగంలో ఇరుదేశాల మధ్య డిక్లరేషన్ ఆఫ్ ఇంటెంట్ కుదిరింది. ఇందులో భాగంగా ఎమర్జింగ్ టెక్నాలజీలపై భారత్, ఇజ్రాయెల్ ఉమ్మడిగా ఫోకస్ పెడతాయి

**భారత్ను సందర్శించండి!**

గతంలో ఇసాక్ హెర్జోగ్‌ను తాను కలిసిన సందర్భాలను భారత ప్రధాని మోదీ గుర్తు చేశారు. భారత్‌పై పూర్తి స్పష్టత ఉన్నందుకు, తమ దేశంపై గౌరవభావాన్ని చూపుతున్నందుకు ఇసాక్ హెర్జోగ్‌కు మోదీ ధన్యవాదాలు తెలిపారు. భారత పర్యటనకు రావాలని ఇసాక్ హెర్జోగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. స్వాగతం పలికేందుకు భారత ప్రజలు ఆతురతగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈసారి భారత పర్యటనకు వస్తే, దిల్లీతో పాటు ఇతర నగరాలనూ సందర్శించాలని కోరారు. తద్వారా భారతదేశ వైవిధ్యంపై అవగాహన వస్తుందన్నారు.

**పశ్చిమాసియా ఉజ్వల భవిష్యత్తు కోసం**

పశ్చిమాసియా ప్రాంత ఉజ్వల భవిష్యత్తులో భారత్ కీలకమైన భాగమని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ అన్నారు. ఇక ఇదే సమయంలో భారతదేశ ఉజ్వల భవిష్యత్తులోనూ ఇజ్రాయెల్ ముఖ్యమైన భాగమని ఆయన చెప్పారు. భారతదేశం సాధిస్తున్న ఆర్థిక వికాసం వైపు ఇప్పుడు యావత్ ప్రపంచం ఆసక్తిగా చూస్తోందన్నారు. ఇజ్రాయెల్ చరిత్రపై, దాని నేపథ్యంపై సానుకూల వైఖరిని కలిగిన భారత్ పశ్చిమాసియా ప్రాంత భవిష్యత్తులో కీలక పాత్రను పోషించగలదని ఇసాక్ హెర్జోగ్ తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో చాలా రంగాల్లో భారత్ అగ్రగామిగా రాణిస్తోందని, అంతటి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ఆయన కితాబిచ్చారు. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, ఆస్ట్రేలియాలతో కూడిన తూర్పు అర్ధగోళం (ఈస్టర్న్ హెమిస్పియర్) ప్రాంతంలో వాణిజ్యానికి కేంద్ర బిందువుగా భారత్ ఉందని ఇసాక్ హెర్జోగ్ తెలిపారు. భారత్ – పశ్చిమాసియా – ఐరోపా వాణిజ్య కారిడార్‌లో కేంద్ర బిందువుగా ఇజ్రాయెల్ ఉందన్నారు. భారత్, ఇజ్రాయెల్‌లు కలిసి పనిచేస్తే గ్లోబల్ సౌత్ సంక్షేమానికీ ఊతం లభిస్తుందన్నారు.

**భారతీయ యువతను ప్రోత్సహించాలి**

"భారత్, ఇజ్రాయెల్‌లలోని కాలేజీలు, యూనివర్సిటీలు, రీసెర్చ్ సెంటర్లు కలిసికట్టుగా పనిచేయొచ్చు.

దీనివల్ల ఇరుదేశాలకు ప్రయోజనం కలుగుతుంది. ఇరుదేశాల విద్యాసంస్థల మధ్య విద్యార్థుల బదిలీ కొనసాగాలి. ఇజ్రాయెల్‌లో చదువుకునేందుకు భారతీయ విద్యార్థులు రావచ్చు. ఇజ్రాయెలీ విద్యార్థులు భారత్‌కు వెళ్లి చదవొచ్చు. ప్రతిభ కలిగిన భారతీయ యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మన భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ఇదే సరైన సమయం. ఇప్పుడు నిపుణులైన యువతరానికి ప్రపంచవ్యాప్తంగా చాలా అవకాశాలు ఉన్నాయి" అని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ పేర్కొన్నారు.

**కొత్త ఆవిష్కరణలు, విద్యార్థుల బదిలీపై సమీక్ష**

ఈసమావేశం సందర్భంగా కొత్త ఆవిష్కరణలు, అధునాతన సాంకేతికతలు, జలవనరుల పరిరక్షణ, వ్యవసాయ సాంకేతికత, ఉన్నత విద్యాసంస్థల నడుమ విద్యార్థుల బదిలీ వంటి విభాగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించే అంశంపై మోదీ, ఇసాక్ హెర్జోగ్ సమీక్షించారు. వ్యూహాత్మక, ఆర్థిక సహకారంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపైనా మరింత ఫోకస్ పెట్టాలని నిర్ణయించారు.

**యాద్ వాషెంను సందర్శించిన మోదీ**

అంతకుముందు జెరూసలెంలోని యాద్ వాషెం మ్యూజియంను ప్రధాని మోదీ సందర్శించారు. 60 లక్షల మంది యూదులను జర్మన్ నాజీలు సంహరించిన ఉదంతాన్ని గుర్తు చేసుకుంటూ

ఈ మ్యూజియాన్ని 1953లో నిర్మించారు. నాజీల చేతిలో ప్రాణాలు కోల్పోయిన యూదులకు మోదీ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఇజ్రాయెల్ అధ్యక్షుడి కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. ప్రధాని మోదీకి ప్రెసిడెంట్ ఇసాక్ హెర్జోగ్ ఘన స్వాగతం పలికారు. వారిద్దరూ కలిసి కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

అనంతరం ఇరువురు నేతల ద్వైపాక్షిక భేటీ జరిగింది.

# న్యాయవ్యవస్థను అగౌరవపరిచే ఉద్దేశం లేదు



● ఎన్సీఈఆర్టీ వివాద బాధ్యులను గుర్తిస్తాం ● వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
● కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ● ఆర్ఎస్ఎస్ పాత్రపై విచారణ చేయాలని కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : ఎన్సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతి గురించి ఒక అధ్యాయం చేర్చడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ వివాదాస్పద అంశాన్ని పిల్లల పాఠ్యాంశంగా రూపొందించిన వారిని బాధ్యులుగా చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం పేర్కొన్నారు. ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పూర్తి గౌరవం ఉందని, ఆ వ్యవస్థను అగౌరవపరిచే ఉద్దేశం ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే ఒక సంఘటిత కుట్ర జరిగినట్లు కనిపిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ కీలక ప్రకటన చేయడం గమనార్హం.

బీజేపీ స్టాండ్ ఇదే!

మరోవైపు బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. ఎన్సీఈఆర్టీ పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఉన్న వివాదాస్పద అధ్యాయాన్ని సున్నితమైన అంశంగా అభివర్ణించింది. తాము దేశ న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, దాని నిష్పాక్షిక పనితీరు పట్ల గర్విస్తున్నామని పేర్కొంది.

ఇది చాలా సున్నితమైన అంశం. పార్టీ ప్రతినిధిగా నేను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుంటున్నాను. భారత్లోనే కాకుండా ప్రపంచం మొత్తంలో భారత న్యాయవ్యవస్థ అంత స్వతంత్రమైనది, అర్హత కలిగినది మరెక్కడా లేదని నేను చెబుతాను. భారత న్యాయవ్యవస్థ పట్ల మనందరికీ ఎంతో గౌరవం, గర్వం ఉన్నాయి. ఇది ప్రతి ఒక్కరి హృదయంలోని భావన. అని బీజేపీ జాతీయ ప్రతినిధి – సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు. బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, ప్రభుత్వం న్యాయవ్యవస్థకు అండగా ఉంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారని సంబిత్ పాత్ర గుర్తుచేశారు.

ఆ పుస్తకంపై నిషేధం : వివాదాస్పద ఎన్సీఈఆర్టీ 8వ తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో అవినీతి, భారీగా పేరుకుపోయిన కేసులు, సరిపడా సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వంటివి న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లుగా పేర్కొన్నారు. అంతేకాదు న్యాయవ్యవస్థలో అవినీతి అనే సబ్చాప్టర్ను చేర్చారు. ఇదే తీవ్ర వివాదానికి దారి తీసింది. అందుకే ఈ పాఠ్యపుస్తకంపై సుప్రీంకోర్టు పూర్తిస్థాయి నిషేధం విధించింది. అంతేకాదు ఫిజికల్, డిజిటల్ రూపంలో ఉన్న అన్ని కాపీలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. తాము రూపొందించిన 8వ తరగతి పాఠ్యపుస్తకంలో అనుచిత కంటెంట్ ఉండడంపై నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) క్షమాపణలు చెప్పింది. సదరు పాఠ్యాంశాన్ని తొలగిస్తామని పేర్కొంది. ఇది జరిగిన ఒక రోజు తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్, వారు తుపాకీతో కాల్చారు. న్యాయవ్యవస్థ రక్తమోడుతోంది అంటూ ఎన్సీఈఆర్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

ఆర్ఎస్ ఎస్ పాత్రపై విచారణ చేయాలి!

మరోవైపు ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో న్యాయవ్యవస్థలోని అవినీతి అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ సమర్థించారు. గత దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సాగించిన దుర్మార్గపు, ద్వేషపూరిత చర్యలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో న్యాయవ్యవస్థపై ఉన్న విమర్శనాత్మక ప్రస్తావనల పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం సరైనదే. నిజానికి గత దశాబ్దకాలంగా ఈ పుస్తకాలను తిరిగి రాసిన తీరు సిగ్గుచేటు. ఇది ఆర్ఎస్ఎస్ చేస్తున్న దుర్మార్గపు, కుట్రపూరితమైన పని. వాస్తవానికి ఈ మొత్తం ముఠాపై విచారణ జరగాలి. అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి – జైరాం రమేశ్, ఎక్స్ పోస్ట్ లో పోస్టు చేసారు.

వారికి షోకాజ్ నోటీసులు : పిల్లల పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే ఉప–అధ్యాయాన్ని చేర్చినందుకు విద్యామంత్రిత్వశాఖ కార్యదర్శికి, ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కార చర్యలు, ఇతర చట్టాల కింద వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని కోరింది.

వాస్తవానికి ఇప్పటికే ఎన్సీఈఆర్టీ క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ అంశంపై సుమోటోగా చేపట్టిన విచారణను నిలిపివేయడానికి నిరాకరించింది. అంతేకాదు ఈ ఉత్తర్వులు ఉల్లంఘించే ఏ ప్రయత్నమైనా న్యాయపరిపాలనలో నేరుగా జోక్యం చేసుకున్నట్లు, కోర్టు ధిక్కారచర్యలు చేపట్టినట్లే భావిస్తామని హెచ్చరించింది. సదరు వివాదాస్పద అధ్యాయాన్ని ఆమోదించిన టీచింగ్–లెర్నింగ్ మెటీరియల్స్ కమిటీకి సంబంధించిన పూర్తి రికార్డులను సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్సీఈఆర్టీని ఆదేశించింది. ముఖ్యంగా ఆ పాఠ్యాంశ రూపకల్పన బృందంలోని సభ్యుల పేర్లు, వారి అర్హతలు, ఇతర వివరాలను అందజేయాలని స్పష్టం చేసింది.

# రాహుల్‌కి గద్దె దక్కదు

- కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్ ఎటాక్



న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ పార్లమెంట్లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ చేసిన విమర్శలను బీజేపీ గురువారం తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీకి వయసు అయిపోతోందని, ఆయనకు ప్రధాని అయ్యే అవకాశం లేనందున కాంగ్రెస్ అసంతృప్తితో ఉందని ఎద్దేవా చేసింది. "రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం పూర్తిగా రాజీపడ్డారు. దేశ తొలి ప్రధానిగా ఉన్న సమయంలో జవహర్లాల్ నెహ్రూ భారత భూభాగాలను చైనా, పాకిస్థాన్లకు ఎందుకు కానుకగా ఇచ్చేశారో కాంగ్రెస్ దేశానికి చెప్పాలి" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు.

**నెతన్యాహు సర్కార్కు మద్దతా?**

అంతకుముందు, ఇజ్రాయెల్ పార్లమెంట్లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును మోదీ నిస్సిగ్గుగా సమర్థించారని విమర్శించింది. "గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న, వేలాది మంది పాలస్తీనియన్లను ఆకలితో అలమటించేలా చేస్తున్న నెహన్యాహు ప్రభుత్వానికి మోదీ నిస్సిగ్గుగా మద్దతు ఇచ్చారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ ఎక్స్ వేదికగా విమర్శించారు.

**బీజేపీ కౌంటర్ ఎటాక్**

కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ ప్రతిదాడికి దిగింది. దేశానికి, ప్రధాని మోదీకి ఏదైనా మంచి జరిగినప్పుడు కాంగ్రెస్ దానిని 'చెడు వార్త'గా భావిస్తుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విమర్శించారు. "ఇజ్రాయెల్ పార్లమెంట్లో ప్రధాని మోదీకి లభించిన గౌరవం దేశానికే గర్వకారణం. అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా మోదీ, మోదీ అని నినదించారు. అది 140 కోట్ల భారతీయుల పట్ల ఇజ్రాయెల్ ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు.

"భారత్–ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాల బలోపేతానికి మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు స్పీకర్ ఆఫ్ ది కెన్సెట్ మెడల్ లభించింది. కానీ అధికారం (ప్రధాని పీఠం) దక్కలేదనే బాధలో కాంగ్రెస్ ఉంది. రాహుల్ బాబాకు వయస్సు మళ్లుతోంది. కానీ ఆయనకు ప్రధాని పీఠం దక్కదు."బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర అని వ్యాఖ్యానించారు.

**నెహ్రూపై తీవ్ర ఆరోపణలు**

ఎప్స్టీన్ ఫైల్స్ ప్రభావంతో మోదీ రాజీపడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించడంపై సంబిత్ పాత్ర తీవ్రంగా స్పందించారు. ఆయన జవహర్లాల్ నెహ్రూపై సంచలన ఆరోపణలు చేశారు. నెహ్రూ హయాంలో భారత్ మ్యాప్ను శాశ్వతంగా మారుస్తూ చైనా, పాకిస్థాన్లకు కీలక భూభాగాలను అప్పగించారని ఆరోపించారు. చైనాకు కోపం వస్తుందనే భయంతో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని తిరస్కరించారని అన్నారు.

'చైనా, పాకిస్థాన్లు జవహర్లాల్ నెహ్రూకు ఏమైనా లంచం ఇచ్చాయా? భద్రతా మండలి సీటును ఆయన ఎందుకు వదులుకున్నారు? అనేది కాంగ్రెస్ చెప్పాలి. నెహ్రూను 'చాచా కాంప్రమైజ్డ్' అని పిలవాలి' అని సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు.

ఈ ఏడు ప్రశ్నలకు సమాధానం కావాలి? అన్ని రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన నెహ్రూ కుటుంబం 7 కీలక ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు. పండిట్ నెహ్రూ టిబెట్ను ఎందుకు చైనీస్ భూభాగంగా అంగీకరించారు. ఆక్సాయిచిన్ ప్రాంతంలో చైనా కార్యకలాపాలపై ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) చేసిన హెచ్చరికలను నెహ్రూ ఒక వదంతిగా కొట్టిపడేశారు. పార్లమెంట్లో కూడా దీనిని ఒక వదంతి అని ఎందుకు చెప్పారు. ఎవరి సమ్మతి లేకుండా నెహ్రూ కశ్మీర్లో ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండమ్)కు ఎందుకు పిలుపునిచ్చారు? బంగాల్లోని బెరుబారీ యూనియన్లో సగభాగాన్ని నెహ్రూ ఎందుకు పాకిస్థాన్కు కానుకగా ఇచ్చేశారు? స్వరణ్ సింగ్– భుట్టో చర్చల సమయంలో పూంచ్, ఉరి, గురెజ్ ప్రాంతాలను పాక్కు అప్పగించడానికి భారత్ ఎందుకు అంగీకరించింది పంజాబ్లోని సర్జా మర్జా, రఖ్ హర్దిత్ సింగ్, పాఠన్కే గ్రామాలను దాయాదికి అప్పగించే నిర్ణయం ఎందుకు తీసుకున్నారు.

# మావోలకు మరో ఝలక్

ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు హతం



బీజాపూర్ : మావోయిస్టులు మరో సారి ఎదురుకాల్పులు జరిపారు.. అయితే ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలకు, నక్సలైట్లకు మధ్య భారీ ఎదురు కాల్పులు జరిగాయి. దీంతో జిల్లాలోని జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రావతి నది పరీవాహక అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. అయితే సుమారు గంటకు పైగా సాగిన ఈ పోరాటంలో భద్రతా బలగాలు పైచేయి సాధించాయి. ఇక కాల్పులు తగ్గుముఖం పట్టిన తర్వాత ఘటనా స్థలంలో సోదాలు చేయగా, ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతి చెందిన వారిని గుర్తించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం తెలిపారు.

ఘటనాస్థలిలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం :ఘటనా స్థలం నుండి భారీగా మారణాయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల వద్ద ఉన్న తుపాకులు, మందు గుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం, భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు సీజ్ చేశారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా మావోయిస్టులు నక్కి ఉన్నారేమో అన్న అనుమానంతో ఇంద్రావతి నది పరిసర ప్రాంతాల్లో గాలింపు (సెర్చింగ్) చర్యలను మరింత ముమ్మరం చేశారు.

మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భ్రదతా దళాల వరుస ఆపరేషన్లు..

గత కొద్ది కాలంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా దళాలు వరుస ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో జరిగిన తాజా ఎన్‌కౌంటర్ మావోయిస్టు కేడర్‌కు పెద్ద దెబ్బగా భావించవచ్చు. మావోయిస్టుల కదలికలను అడ్డుకోవడానికి, గిరిజన ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రభుత్వం బలగాలను అప్రమత్తం చేసింది.

# ఇన్‌స్టాలో మోడీ క్రేజ్..

# 10 కోట్లు దాటిన ఫాలోవర్లు




న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ క్రేజ్ రోజురోజుకి పెరిగిపోతోంది. బయటే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా ఆయన హవా కొనసాగుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటింది. ప్రపంచంలో ఇంతమంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 2014 నుంచి మోదీ ఇన్‌స్టాగ్రామ్ వినియోగించడం ప్రారంభించారు. మరో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఇప్పటికే ఆయనను అనుసరించే వారి సంఖ్య 10 కోట్లు దాటేసింది. కాగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే.. మోదీ ఫాలోవర్ల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. 4.3 కోట్ల మంది ఫాలోవర్లతో ట్రంప్ రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో (1.5 కోట్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా (1.4 కోట్ల మందికి పైగా), తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ (1.1కోట్లు), అర్జెంటీనా అధ్యక్షుడు హవియేర్ మిలే (64 లక్షలు) ఉన్నారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 1.2 కోట్లు మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

# ఆపరేషన్ సింధూర్ 2.0 షురూ

ఆర్మీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీః ఆపరేషన్ 2.0పై ఆర్మీ ఉన్నతాధికారులు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మళ్లీ ఆఫరేషన్ సింధూర్ చేపట్టాల్సి వస్తే ఈసారి మరింత కఠినంగానే ఉంటుందని వ్యాఖ్యానించారు. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసిన సంగతి తెలిసిందే. దాయాది ఏం జరిగిందో తెలుసుకునేలోపు భారత సైన్యం కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తిచేసి.. వెనక్కి వచ్చేసింది. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య డ్రోన్, క్షిపణి దాడులతో నాలుగు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు.. మే 10న జరిగిన కాల్పులు విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టాయి. కానీ, భారత్ దెబ్బకు పాకిస్థాన్ వైమానిక స్థావరాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని ఇప్పటికీ పాక్ మరమ్మత్తులు చేసుకుంటోంది. వెస్టర్న్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కతియార్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'ఆపరేషన్ సిందూర్ కంటే ఈసారి ప్రతిస్పందన బలంగా ఉంటుంది.. మనం ఏ మేరకు స్పందించాలి అనేది ఆ రోజు, అప్పటి సమయం, నెలకున్న పరిస్థితిని బట్టి పూర్తిగా ఆధారపడి ఉంటుంది.. కానీ, ఈసారి మరింత గట్టిగానే దాడిచేయాలనే దానిపై మాకు పూర్తి విశ్వాసం ఉంది' అని అన్నారు.

' ఆపరేషన్ సిందూర్ ప్రారంభంలో పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం.. కానీ, పాక్ ప్రతిదాడికి ప్రయత్నించడంతో వాళ్ల క్షిపణి, వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం.. భారత సైన్యం శక్తి ముందు తలవంచిన పాకిస్థాన్.. కాళ్లబేరానికి వచ్చి ఇతర దేశాల ద్వారా కాల్పులు విరమణ ప్రతిపాదన తీసుకొచ్చింది.. మనల్ని నేరుగా ఎదుర్కొనే ధైర్యం వాళ్లకు లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 1971 బంగ్లా విముక్తి పోరాటం లేదా కార్గిల్ యుద్ధాలతో పాకిస్థాన్ గుణపాఠం నేర్చుకోలేదు.. ఆపరేషన్ సిందూర్‌తోనైనా నేర్చుకున్నారా? అనేది ప్రశ్నార్థమే అని లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ పేర్కొన్నారు.

పాక్ దొడ్డిదారిన యుద్ధాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. 'వాళ్లు మనతో నేరుగా యుద్ధం చేయలేరు.. కాబట్టి ప్రాక్సీలను ఉపయోగించి యుద్ధం చేస్తారు. ఆ బలహీన దేశం ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌ను కాల్పుల విరమణ కోసం ఒప్పించాలని పలు దేశాలను కాళ్లవేళ్లా బతిమాలిడింది' అని ఆయన చెప్పారు.

రాష్ట్రీయం తెలంగాణ

## గాంధీ ప్రాజెక్టుపై
# అనవసర రాద్ధాంతం

● మధు పార్క్ అపార్ట్మెంట్ బఫర్ జోన్ పరిధిలో ఉంది
● మూసీ ప్రక్షాళన కోసం ఒక్క రూపాయి కూడా తీసుకురాని కిషన్ రెడ్డి
● కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మధు పార్క్ అపార్ట్మెంట్ అంశంపై అనవసర రాద్ధాంతం సృష్టిస్తున్నారని కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాంధీ ప్రాజెక్టుకు మధు పార్క్ అపార్ట్మెంట్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.
మధు పార్క్ అపార్ట్మెంట్ బఫర్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ, అక్కడి వాసులపై ప్రభుత్వం ఎలాంటి అధికారం చెలాయించడం లేదన్నారు. పైసా పైసా కూడబెట్టుకొని ఇళ్లు కొనుగోలు చేసిన ప్రజల బాధను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుంటుందని తెలిపారు.
**నష్టపరిహారం హామీ** : అపార్ట్మెంట్ వాసులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ విలువ ప్రకారం అక్కడ చదరపు అడుగుకు రూ.3,000 మాత్రమే ఉన్నప్పటికీ, ప్రభుత్వం రూ.5,000 చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కష్టపడి ఇల్లు కొనుగోలు చేసిన వారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి అపార్ట్మెంట్ వాసులు సానుకూలంగా ఉన్నారని వెల్లడించారు.
**ప్రతిపక్షాలపై విమర్శలు** : గతంలో బీఆర్ఎస్ నాయకులు మల్లన్న సాగర్ బాధితులను తరిమేందుకు ఊర్లోకి నీళ్లు వదిలారని ఆరోపించారు. మధు పార్క్ వద్దకు వెళ్లిన హరీష్ రావు మల్లన్న సాగర్ వద్ద ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.
పన్నెండు ఏళ్లలో మూసీ ప్రక్షాళన కోసం కిషన్ రెడ్డి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలను వరదల ముప్పుకు గురిచేయాలనే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు.
మూసీని కాపాడాలనే పిలుపు బతుకిచ్చిన మూసీ నదిని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మురికి కూపంగా మారిన మూసీని శుద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చెరువులను కబ్జా చేశారని ఆరోపించారు.సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళన గురించి మాట్లాడే బీజేపీ, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుపడుతోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల అబద్ధాల ప్రచారాలను తెలంగాణ ప్రజలు క్షమించరని సామ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు.హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించడం, మూసీని పునర్జీవింపజేయడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలను
# విజయవంతం చేయాలి

### కేంద్ర ప్రభుత్వ విధానాలపై డీబీపీ ఆందోళన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తూ దేశద్రోహ విధానాలు అవలంబిస్తున్నారని దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఆరోపించింది. మార్చి 1 నుంచి జూన్ 30 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న "రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలు" విజయవంతం చేయాలని డీబీపీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు అడ్వకేట్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సమతా రాజ్యాంగాన్ని బలహీనపరచి, మనువాద దోపిడీ విధానాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలు దళిత, బహుజన వర్గాల హక్కులకు విరుద్ధమని విమర్శించారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దళిత బహుజన సమాజం మళ్లీ మధ్యయుగాల బానిసత్వ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న జీవన, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టి ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ అడ్వైజర్ డా. వి.ఎల్. రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు జె.ఎన్. రావు, నీరటి శంకర్, తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఎన్. రాంచందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. రాజలింగం, గంధం శంకర్, పిట్ల ఈశ్వర్, దాసరి, నిచ్చికోల జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ బాధితులకు కేటీఆర్ భరోసా



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి; జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో పర్యటించిన కేటీఆర్ భూదాన్ భూముల బాధితులను ప్రత్యక్షంగా కలిశారు. అక్కడ నివసిస్తున్న పేదల కష్టాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. నిలువనీడ లేక ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న తమపై అధికారులు కఠినంగా వ్యవహరించడంపై బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. పేదల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు వరకు పోరాటం ఈ సమస్య పరిష్కారం కోసం అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లడానికైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనా బీఆర్ఎస్ పార్టీ బాధితులకు అండగా ఉండి న్యాయం చేకూరుస్తుందని వివరించారు. పేద ప్రజల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల భూ సమస్యను అసెంబ్లీలో కూడా ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఈ పర్యటనలో హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై బాధితుల ఆవేదన
తమ పొట్టకూటి కోసం నగరానికి వచ్చి చిన్న గుడిసెలు వేసుకోవడం నేరమా అని బాధితులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏళ్ల తరబడి ఇక్కడే నివసిస్తున్నా తమకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు గోడు వెళ్లబోసుకున్నారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, తమ ఇళ్లను తొలగించకుండా చూడాలని వేడుకున్నారు. ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సర్కార్ బడుల్లో పంతుళ్లు ఏరి..?

● విద్యకు పెద్ద పీఠ అంటే ఉపాధ్యాయులు వొద్దా? ● ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలి
● విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించిన నిరుద్యోగులు ● వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనీ బీసీ నేత, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : విద్యా రంగంలో విప్లవత్మక మార్పులు తెస్తామన్న రేవంత్ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రశ్నించారు. హైదరాబాద్ లక్డికపుల్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దాదాపు 40 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ర్యాగ అరుణ్ కుమార్, నీలం వెంకటేష్, అనంతయ్య అధ్యక్షత వహించారు. విద్యార్థుల భవిష్యత్తు పణంగా ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల 12 వేల పాఠశాలల్లో ఇంగ్లీష్, గణితం, సైన్స్ వంటి కీలక సబ్జెక్టులు బోధించేవారు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో 12 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల 6 వేల మంది ఉపాధ్యాయులు రిటైర్ కావడం, 4,500 మందికి ప్రమోషన్లు ఇవ్వడం, గత డీఎస్సీలో ఎంపికైన 2 వేల మంది జాయిన్ కాకపోవడం వల్ల ఖాళీలు మరింత పెరిగాయని పేర్కొన్నారు.

అన్ని శాఖల్లో భారీ ఖాళీలు
ప్రభుత్వ పాఠశాలలు -- 12,000
ఎయిడెడ్ పాఠశాలలు -- 5,900
ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ గురుకుల పాఠశాలలు -- 8,000
ఆదర్శ పాఠశాలలు -- 1,200
కస్తూర్బా పాఠశాలలు -- 1,500

ఇలా మొత్తం దాదాపు 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం గెస్ట్, పార్ట్‌టైం టీచర్లతో పాఠాలు చెప్పించడం సరైన పరిష్కారం కాదని విమర్శించారు.
నిరుద్యోగుల ఆవేదన రాష్ట్రంలో బి.ఎడ్, డి.ఎడ్ పూర్తి చేసిన సుమారు 16 లక్షల మంది అర్హత కలిగిన నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి శక్తి--యుక్తులను సమాజాభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర డిమాండ్లు 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. పీఆర్సీ 2023 ను 40% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి. ఈ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి బీసీ జాతీయ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పు, చైతన్యం తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో విద్యా చైతన్యం పెంపొందించి బీసీలు భవిష్యత్తులో రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జాక్ ఛైర్మన్ నీలం వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, అంజి గౌడ్, శివకుమార్ యాదవ్, అష్మా, సురేష్, కుమార్, ఇంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.




# భాగ్యనగరంలో ఆర్టీసీ ఛార్జీలు భారీగా తగ్గింపు..


● తగ్గించిన ఛార్జీలు మార్చి 21వ తేదీ నుంచి అమలు ● హైదరాబాద్‌లోని ఏసీ బస్సులకు మాత్రమే వర్తింపు

హైదరాబాద్‌: వేసవికాలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో టికెట్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1వ తేదీ నుంచి తగ్గించిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే సమ్మర్ మొదలుకావడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కబోత కూడా మొదలుకాబోతుంది. దీని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో టికెట్ల రేట్లను తగ్గించారు. దీంతో ప్రజలపై భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో హాయిగా ఏసీ బస్సు ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు.
**కొత్త టికెట్ ఛార్జీలు ఇవే..** : గతంలో మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు టికెట్ ఛార్జీ రూ.30గా ఉండేది. కానీ ఇప్పుడు రూ.25కి తగ్గింది. దీంతో ప్రతీ నాలుగు కిలోమీటర్ల ప్రయాణంపై రూ.5 మేర తగ్గింపు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని టీజీఎస్ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ–మెట్రో ఏసీ బస్సుల్లో గతంలో నాలుగు కిలోమీటర్లకు రూ.35 చొప్పున ఉండగా.. ఇప్పుడు రూ.25కి తగ్గనుంది. ఏకంగా రూ.10 మేర తగ్గనుండటం ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. ఎండాకాలంతో పాటు ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ నిండుగా ఉండటం లేదు. ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటుంది. ధరలు ఎక్కువగా ఉంటాయనే కారణంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఛార్జీలను తగ్గించడం వల్ల ఆక్యుపెన్సీ పెరగడంతో పాటు సమ్మర్‌లో ప్రయాణికులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.
**ఎంత దూరానికి ఎంత ఆదా..**
1 నుంచి 3 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలర్స్ బస్సుల్లో 0 నుంచి రూ.10 వరకు ఆదా కానుండగా.. ఈ–మెట్రో బస్సుల్లో 5 నుంచి రూ.10 తగ్గుతుంది. ఇక 4–15 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.5 నుంచి రూ.10, ఈ–మెట్రో బస్సుల్లో రూ.10 నుంచి రూ.15 ఆదా అవుతుంది.
ఇక 16 నుంచి 21 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.10 నుంచి రూ.15, ఈ–మెట్రో బస్సులలో రూ.10 నుంచి రూ.15, 22–30 కిలోమీటర్ల ప్రయాణానికి మెట్రో డీలక్స్,ఈ మెట్రో ఏసీ బస్సుల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఆదా అవుతుంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 275 మెట్రో డీలక్స్, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఛార్జీల తగ్గింపుతో నగర ప్రజలకు లబ్ది చేకూరనుంది.

# తెలంగాణలో మరోసారి భూప్రకంపనలు..

● మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో కంపించిన భూమి.. ● రిక్టర్ స్కేల్‌పై 3.9గా తీవ్రత నమోదు

హైదరాబాద్‌: తెలంగాణలో ఇటీవల హైదరాబాద్‌లో ఉదయం భూ ప్రకంపనలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. గాజులరామారంలో భూమి కంపించినట్లు స్థానికులు వెల్లడించారు. భూమి కంపించడంతోపాటు భారీ శబ్దం వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి రాష్ట్రంలో భూకంపం రావడం తీవ్ర కలకలం రేపుతోంది. మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం అర్ధరాత్రి భూమి కంపించినట్లు స్థానికులు వెల్లడించారు.
అయితే ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.9గా నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంప కేంద్రం మంచిర్యాల జిల్లాకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దుల్లోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడింటారు. మరోవైపు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో 3 సెకన్ల పాటు భూమి కంపించినట్లు పేర్కొన్నారు. ఈ భూకంప తీవ్రతకు ఇళ్లల్లో ఉన్న వస్తువులు ఒక్కసారిగా కిందపడ్డాయని వివరించారు. ఇక అర్ధరాత్రి పూట భూమి కంపించడంతో.. అప్పటివరకు గాఢ నిద్రలోకి జారుకున్న ప్రజలు ఒక్కసారిగా లేచి బయటికి పరుగులు తీశారు. గతంలో తమకు ఎప్పుడూ ఇలాంటి భూకంపం అనుభవం ఎదురుకాలేదని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ భూకంప తీవ్రతకు సంబంధించిన సీసీటీవీ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.
మరోవైపు.. కొన్ని నెలల క్రితం కూడా మంచిర్యాల, ఆదిలాబాద్, కరీంనగర్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అప్పుడు ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన వద్ద భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. ఈనెల 10వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గాజులరామారం మెట్‌ఖాన్‌గూడా ప్రాంతంలో భూమి కంపించింది. ఉదయం 10:10 గంటలకు ఒక్కసారిగా భూమి కంపించిందని.. భారీ శబ్దం కూడా వచ్చినట్లు చెప్పారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు నుంచి భయంతో జనం పరుగులు తీశారు. ఈ సమాచారం తెలుసుకుని అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆ సమయంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.






# అసెజ్ గ్రీన్ కచేరీకి మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీకారం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హైదరాబాద్ సెక్రటేరియట్ జీ–29 లో సెక్రటేరియట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో, సౌత్ కొరియా నుండి వచ్చిన అసెజ్ బృందం నిర్వహించిన "ప్లాస్టిక్ రహిత భారతదేశం" లక్ష్యంతో గ్రీన్ సంగీత కచేరీ కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమిని ప్రతి కోణంలోనూ రక్షించాలనే మహత్తర లక్ష్యంతో పనిచేస్తున్న గ్లోబల్ వాలంటీర్ ఉద్యమమని మంత్రి వివరించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సౌత్ కొరియా బృందం సంగీత కచేరీ ద్వారా సందేశాన్ని అందించడం అభినందనీయం అని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్లాస్టిక్ నిర్మూలనకు మద్దతుగా సంతకం చేసి, గ్రీన్ కచేరీని వీక్షించారు. హుస్నాబాద్ ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఇప్పటికే ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దామని మంత్రి తెలిపారు. 172 గ్రామాల్లో 282 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్‌లు పంపిణీ చేసి, 13 రకాల స్టీల్ వస్తువులతో కూడిన 500, 400, 300 కిట్లు అందజేశామని వెల్లడించారు. ప్లాస్టిక్ ప్లేట్లలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన వ్యాధులు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. సెక్రటేరియట్ క్యాంటీన్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంగీతం ద్వారా సామాజిక సందేశం సంగీతం ద్వారా సామాజిక సందేశాన్ని ప్రజల మనసుల్లోకి తీసుకెళ్లడం అత్యంత ప్రభావవంతమైన మార్గమని మంత్రి పేర్కొన్నారు. ఈ గ్రీన్ కచేరీ కూడా యువతలో పర్యావరణంపై బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ, సుస్థిర అభివృద్ధి మరియు ప్రకృతి పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ తగ్గింపు, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, వాలంటీర్లు, సెక్రటేరియట్ ఉద్యోగులకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "మనందరం కలిసి ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన సమాజం నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు. అసెజ్ సంస్థకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే దేవాదుల ప్రాజెక్టు బలైంది

● దేవాదుల పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తు మాజీ మంత్రి హరీష్ రావు విమర్శ ● ఏపీ సీఎం చంద్రబాబుకు శిష్యుడిగా రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఆరోపణ ● ఏపీకి నీళ్లు వదిలేందుకే దేవాదుల మోటార్లు బంద్ పెట్టారా.. అని ఎద్దేవా

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే దేవాదుల ప్రాజెక్టు బలైందని మాజీ మంత్రి తన్నీరు హరీష్?రావు ఆరోపించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ పనులను మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, చల్ల ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రాలో సీఎం చంద్రబాబునాయుడికి శిష్యుడిగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఆరోపించారు. ఏపీకి నీళ్లు వదిలేందుకే దేవాదుల మోటార్లు బంద్ పెట్టారా.. అని ఎద్దేవా చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నా ఎందుకు దేవాదుల లిఫ్ట్ వాడడం లేదని ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్టు 90 శాతం పనులు పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రెండున్నరేళ్ల పాలనలో కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. సమ్మక్క బ్యారేజీ వద్ద 16వేల క్యూసెక్కులు వెళ్తున్నా దేవన్నపేట పంప్‌హౌస్‌లో మూడు మోటార్లు పనిచేయడం లేదని మండిపడ్డారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి 2025 మార్చి 18న మంత్రులతో హడావిడిగా పంప్‌హౌస్ మోటార్లు ప్రారంభించి ఇప్పటి వరకు రైతులకు సాగునీరందించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. దేవన్నపేట పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయకపోవడం వల్ల 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి లిఫ్టింగ్ ఆగిపోవడం వల్ల జనగామ, పాలకుర్తి,స్టేషన్‌ఘన్‌పూర్, గండిరామారం లిఫ్టింగ్ ఆగిపోయిందన్నారు. రామప్ప నుంచి ఉనికిచర్ల వరకు 49.05 కిలోమీటర్ల టన్నెల్ ప్రపంచంలో లోతైన అతిపెద్ద టన్నెల్‌ను పూర్తిచేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని హరీష్?రావు అన్నారు. కేసీఆర్ సమ్మక్క బ్యారేజీ కట్టి 365 రోజులు నీళ్లు తీసుకునేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఆనాడు 25 టీఎంసీలు మాత్రమే దేవాదులకు కేటాయింపులు ఉంటే కేసీఆర్ 60 టీఎంసీలకు పెంచి 6.5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా ప్రణాళికలు చేసారన్నారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీలు కలిసి దేవాదుల కింద ఇచ్చిన ఆయకట్టు కేవలం 47వేల ఎకరాలు ఉంటే బీఆర్ఎస్ ఆ ఆయకట్టును 3.17 లక్షల ఎకరాలకు పెంచిందన్నారు.గత ఏడాది భీంఘన్‌పూర్ వద్ద మోటార్లు ఆన్ చేయలేదన్నారు. మే 2024న మంత్రులు జిల్లాకు వచ్చి 2026 మార్చి కల్లా దేవాదుల పూర్తి చేస్తామన్నారని, ఇప్పుడు ఫిబ్రవరి 2026 వచ్చినా పది పైసల పూనులు పూర్తి కాలేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి గోదావరి నీళ్లను చంద్రబాబుకు గురుదక్షిణగా వదులుతున్నారని సెటైర్లు విసిరారు. మేడిగడ్డ నీళ్లు ఎత్తడం లేదని, దేవాదుల వద్ద పంప్‌హౌస్ మోటార్లు పని చేయడం లేదని, సీతమ్మ సాగర్ పూర్తి కాకుండా అక్కడే వదిలేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు.



హరీష్‌రావుకు ఘన స్వాగతం
దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్?ను సందర్శించేందుకు వచ్చిన హరీష్?రావుకు పలువురు మాజీ ఎమ్మెల్యేలు పూలమొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆయనను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, దాస్యం వినయభాస్కర్, చల్ల ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు నాగుర్ల వెంకన్న, ఎర్రోళ్ల శ్రీనివాస్, మర్రి యాదవరెడ్డి, ఏనుగుల రాకేష్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు.

# తెలంగాణలో స్వీపర్ నెల జీతం 2 లక్షలు

● కలెక్టర్ జీతం కంటే ఎక్కువ ● విద్యుత్ శాఖలో ఉద్యోగులకు జీతాలు ఎక్కువ
● పీఆర్సీలతో జీతాలు పెరుగుతున్న వైనం ● గవర్నర్, ఐఏఎస్ అధికారుల కంటే వీరి జీతాలు ఎక్కువగా ఉన్నాయి




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో నాలుగో తరగతికి చెందిన సీనియర్ స్వీపర్ నెల జీతం రూ.2 లక్షలు. అవును మీరు విన్నది అక్షరాల నిజం. స్వీపర్ జీతం జిల్లా కలెక్టర్ జీతం కంటే ఎక్కువ. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సీనియర్ ఐఏఎస్‌ల జీతం రూ.1.5 లక్షల వరకు ఉంటే.. సీనియర్ స్వీపర్ జీతం మాత్రం రూ.2 లక్షలకు దగ్గరగా ఉంది. ఈ విషయాన్ని ఎవరో కాదు సాక్షాత్తు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. తెలంగాణ విద్యుత్ శాఖలో పనిచేస్తోన్న సీనియర్ స్వీపర్ జీతం రూ.2లక్షల వరకూ ఉందని సీఎస్ తెలిపారు. ఇలా జీతం ఉండటానికి కారణం వరుస పీఆర్సీలేనని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ప్రతి నెలా రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు బుధవారం (ఫిబ్రవరి 25) జరిగిన రివ్యూ మీటింగ్‌లో తెలిపారు. 2014లో ఇది కేవలం 1500 కోట్లుగా ఉండేదని ఇప్పుడు రూ.6 వేల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ సంస్థల్లో పనిచేసే చీఫ్ ఇంజనీర్లు నెలకు రూ.7 లక్షల వరకు వేతనం అందుకుంటున్నారని తెలిపారు. ఇది ఐఏఎస్ అధికారులు, రాష్ట్ర గవర్నర్ జీతం కంటే కూడా ఎక్కువేనని అన్నారు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరిగే వేతన సవరణల వల్లే విద్యుత్ శాఖలో జీతాలు ఈ స్థాయిలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 30 ఏళ్ల సర్వీసు ఉన్న సీనియర్ క్లాస్–4 ఉద్యోగులు నెలకు దాదాపు రూ.2 లక్షల వరకు జీతం చెల్లించాల్సి వస్తుందన్నారు.
మున్సిపాలిటీల్లో కొత్తగా చేరిన వారికి రూ.28 వేలు జీతం వస్తుండగా.. 30 ఏళ్ల అనుభవం ఉన్న డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు రూ.లక్షకు పైగా జీతం పొందుతున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన మొదటి పదేళ్లలో రాష్ట్రం మొత్తం రూ.15 లక్షల కోట్లు ఖర్చు చేసిందని... ఇందులో దాదాపు రూ.12 లక్షల కోట్లు కేవలం జీతాలు, పెన్షన్లు, అప్పుల చెల్లింపులకే ఖర్చయ్యాయన్నారు. ఈ విషయం అటుంచితే స్వీపర్ జీతం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అన్ని శాఖల్లోని స్వీపర్లకు ఇలా జీతాలు ఉండవట. కేవలం విద్యుత్ శాఖలోని ఉద్యోగులకు మాత్రమే భారీగా జీతాలు అందుతున్నట్లు తెలిసింది.
అందుకు కారణం విద్యుత్ శాఖలో సంస్కరణలు. ఉమ్మడి ఏపీలో విద్యుత్తు శాఖను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డుగా పిలిచేవారు. ఆ తర్వాత అప్పటి సీఎం చంద్రబాబు విద్యుత్తుశాఖలో సంస్కరణలకు తెరతీశారు. ఏపీ విద్యుత్ బోర్డు స్థానంలో 'కంపెనీ'లు వచ్చాయి. అలా విద్యుత్తు ఉత్పత్తికి...జెన్‌కో, విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కోలు ఏర్పడ్డాయి. ట్రాన్స్‌కోలోనూ మళ్లీ ప్రాంతాల వారీగా ఏపీఈపిడిసిఎల్, ఏపీఎస్ పిడిసిఎల్, , ఏపీసిపిడిసిఎల్, డిస్కమ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ సంస్కరణల కారణంగా విద్యుత్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం కాగా..వారికి భరోసా కల్పించేందుకు అప్పటి ప్రభుత్వం జీతాలు భారీగా పెంచింది. ఇంక్రిమెంట్లు కూడా అదే స్థాయిలో నిర్ణయించింది. అలా ఇతర ప్రభుత్వ శాఖలతో పోలిస్తే విద్యుత్ శాఖలోని ఉద్యోగులకు ఎక్కువ జీతాలు ఉంటున్నాయి. సర్వీసు పరంగా బాగా సీనియర్ అయిన స్వీపర్ జీతం లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు చేరుకుంది. ప్రస్తుతం సీఎస్ చెప్పిన స్వీపర్ జీతం కూడా ఆ కోవలోకే వస్తుంది. దాదాపు 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ మేరకు జీతాలు ఉన్నట్లు తెలిసింది. ఏది ఏమైనా స్వీపర్ జీతం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాఫిక్‌గా మారింది.



కలర్స్

LIFE IS A RAINBOW



# తిరుమల శ్రీ నిలయం

# మరో స్వర్ణ దేవాలయం

## కఠిన నిబంధనలు అమలు చేయనున్న సర్కారు

## కల్తీ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి - అధునాతన ల్యాబ్ ఏర్పాటు

## అన్యమతస్తులు డిక్లరేషన్ ఇస్తేనే శ్రీవారి దర్శనానికి అనుమతులు

**ప్రపంచ ఆధ్యాత్మిక రాజధాని, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన పుణ్యక్షేత్రం తిరుమలలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది ఏపీలోని కూటమి ప్రభుత్వం. ఇప్పటికే తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో తలెత్తిన వివాదం, భక్తుల మనోభవాలు దెబ్బతిన్న క్రమంలో.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. టీటీడీ పాలనా వ్యవస్థలోనూ, నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయబోతోంది. అపవిత్రతకు ఏమాత్రం తావులేకుండా, రాజకీయ జోక్యం లేకుండా.. శ్రీనివాసుడి సన్నిధిని ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కొనసాగించేలా, సరికొత్త చట్టాన్ని తీసుకొచ్చే దిశగా అడుగులు పడుతున్నాయ్. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళితే...**

తిరుమల శ్రీవారి ఆలయం ఏదో రకంగా వార్తల్లో నిలుస్తూ వస్తోంది. తిరుమలలో తరుచుగా ఏదో ఒక ఘటన వెలుగులోకి రావటం, వివాదమవ్వటం తెలిసిందే. పరకామణి చోరీ చేసు, తిరుమల లడ్డూ వ్యవహారం, దళారుల మోసాలు వంటివి వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహాలో ప్రత్యేక చట్టం అమలు చేయాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. ఈ ప్రత్యేక చట్టం ద్వారా తప్పు చేసిన వారి మీద క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, టీటీడీ నిబంధనలని కూడా మరింత కఠినతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది.

**ఏమిటి ఈ స్వర్ణ దేవాలయ చట్టం?** పంజాబ్‌లోని సిక్కుల పవిత్ర క్షేత్రమైన స్వర్ణ దేవాలయం నిర్వహణను 1925 నాటి సిక్కు గురుద్వారా చట్టం ద్వారా పర్యవేక్షిస్తారు. ఈ చట్టం ప్రకారం, గురుద్వారాల నిర్వహణ బాధ్యతను రాజకీయ నాయకుల చేతుల్లో కాకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సిక్కు ప్రతినిధుల చేతుల్లో ఉంచుతారు. ఈ కమిటీకి సంబంధించి ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి. కమిటీ సభ్యులు కేవలం మతపరమైన అంశాలు, సామాజిక సేవ, ఆధ్యాత్మిక అభివృద్ధిపైనే దృష్టి సారిస్తారు.

**తిరుమల కొండ పూర్వ వైభవం :** తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు.. భారీ ప్రక్షాళనని సూచిస్తున్నాయ్. అమృత్సర్లోని స్వర్ణ దేవాలయం తరహాలో స్వయంప్రతిపత్తి కలిగిన, అత్యంత కఠినమైన చట్టాన్ని తీసుకురావాలనే ఆలోచన భక్తుల్లోనూ సానుకూలమైన ఆశలను రేకెత్తిస్తోంది. స్వర్ణ దేవాలయం తరహా చట్టం అమలులోకి వస్తే తిరుమల కొండపై సమూల మార్పులు కనిపిస్తాయనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా.. తిరుమల కొండకు పూర్వ వైభవం వస్తుందంటున్నారు. తిరుమల కేవలం ఓ ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాదు. కోట్లాది మంది హిందువుల సెంటిమెంట్. ఎంతో మంది భక్తుల నమ్మకం. కొంతకాలంగా తిరుమల చుట్టూ నడుస్తున్న వివాదాలు.. తిరుమల ప్రతిష్ఠని మసకబార్చడమే కాదు, లడ్డూ ప్రసాదంపై భక్తుల విశ్వసనీయతని కూడా దెబ్బతీస్తోందనే వాదనలు వినిపించాయ్. దాంతో.. ఏపీ ప్రభుత్వం తిరుమల క్షేత్రాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా, ఎలాంటి రాజకీయ జోక్యం లేని వ్యవస్థగా మార్చాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే.. గోల్డెన్ టెంపుల్ తరహా చట్టాన్ని తీసుకురావాలనే ఆలోచనతో ఉంది.



**రాజకీయ జోక్యానికి శాశ్వత పరిష్కారం** : ప్రస్తుత టీటీడీ చట్టం ప్రకారం, పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమిస్తోంది. దీనివల్ల అధికార పార్టీకి చెందిన నాయకులు, వ్యాపారవేత్తలు బోర్డులో చోటు సంపాదిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ స్వర్ణ దేవాలయ తరహా చట్టం అమలులోకి వస్తే, టీటీడీ బోర్డు సభ్యులు ఎన్నికల ద్వారా లేదా నిర్ణీత అర్హతలు ఉన్న ఆధ్యాత్మిక వేత్తల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రాజకీయ ఒత్తిళ్లకు తావుండదు. పారదర్శకత పెరుగుతుంది.

**వివాదాల నేపథ్యంలో కఠిన నిబంధనలు :** ఇటీవల టీటీడీ చుట్టూ అనేక వివా దాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొత్త చట్టం ప్రవేశపెట్టనుంది. కఠిన నిబంధనలు తీసుకు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. గతేడాది కాలంగా టీటీడీ లడ్డూ కల్తీ నెయ్యి అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తుంది. ఇప్పటికే సిట్ విచారమ చేపట్టి కల్తీ జరిగినట్లు నిర్ధారించింది. స్వర్ణ దేవాలయం చట్టంపై అధ్యయనం చేయనున్నారు. తర్వాత శాసనసభలో ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. అనంతరం బిల్లును ఆమోదిస్తే కొత్తం చట్టం అమల్లోకి రానుంది.

**దర్శన సమయాలపై కఠిన నియంత్రణ :** తిరుమల పవిత్రతను కాపాడే క్రమంలో.. సిబ్బంది విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులను ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయడం, వీఆర్ఎస్ కల్పించే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇక.. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై వేటు వేసేందుకు కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి. శ్రీవారి సన్నిధిలో రాజకీయ అంశాలు మాట్లాడటంపైనా ఇప్పటికే నిషేధం విధించారు. కొండపై రాజకీయ విమర్శలు చేయడం, పార్టీల గురించి మాట్లాడటం చేస్తే చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందించారు. దర్శనం కోసం వచ్చే ప్రముఖుల ప్రోటోకాల్ విషయంలోనూ మార్పులు చేసి, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి వేచి ఉండే అవస్థలు తప్పించేందుకు.. ఏఐ టెక్నాలజీని వాడుకోవడంపై ఇప్పటికే దృష్టి పెట్టారు. దర్శనం సమయాన్ని కచ్చితంగా అంచనా వేయడం, క్యూ లైన్లలో రద్దీని కంట్రోల్ చేసేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ వాడుతున్నారు. దర్శన టికెట్ల జారీలోనూ.. దళారీ వ్యవస్థని పూర్తిగా అరికట్టే ఉద్దేశంతో ఉంది కూటమి ప్రభుత్వం.

**నిపుణుల కమిటీ కసరత్తు :** స్వర్ణ దేవాలయ చట్టం ఏపీలో అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రభుత్వం న్యాయ నిపుణులు , ఆధ్యాత్మికవేత్తలతో కూడిన కమిటీని నియమించే ఆలోచనలో ఉంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాల నిర్వహణ విధానాలను అధ్యయనం చేసిన తర్వాత, ఏపీ కేబినెట్ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది. దేవాలయం పట్ల అచంచలమైన భక్తి, నిబద్ధత ఉన్నవారే బోర్డులో ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కేవలం పరిపాలన మార్పులకే పరిమితం కాకుండా, లడ్డూ తయారీలో వాడే ముడి పదార్థాల సేకరణ నుండి దర్శనం వరకు ప్రతి స్థాయిలోనూ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం ఆచరణలోకి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలకు తిరుమల ఒక ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**భక్తుల ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధులే..** అమృత్సర్లోని స్వర్ణ దేవాలయాన్ని నిర్వహించే శిరోమణి గురుద్వారా ప్రబంధనక్ కమిటీ.. 1925 సిక్కు గురుద్వారాల చట్టం ద్వారా నడుస్తుంది. దీని ప్రకారం.. గోల్డెన్ టెంపుల్ పూర్తి స్వయంప్రతిపత్తితో ఉంటుంది. ప్రభుత్వం గానీ, రాజకీయ నాయకుల ప్రమేయం గానీ ఉండదు. భక్తుల ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధులే ఆలయ నిర్వహణని చూస్తారు. దేవాలయం లోపల ఏ విధమైన లౌకిక, రాజకీయ కార్యకలాపాలకు తావు ఉండదు. మతపరమైన నిబద్ధత మాత్రమే కనిపిస్తుంది. అక్కడ సేవకు ప్రాధాన్యత ఉంటుంది. స్వర్ణ దేవాలయంలో పనిచేసేవారు ఉద్యోగులుగా కాకుండా.. సేవకులుగా భావిస్తారు. ఇదే తరహా చట్టం.. తిరుమల కోసం తీసుకొస్తే.. కొండపై మనం సమూల మార్పులు వచ్చే అవకాశముంది.



**నిధుల వినియోగంపై కఠిన నిబంధనలు :** ప్రస్తుతం.. టీటీడీ బోర్డు సభ్యుల నియామకం రాజకీయ ప్రాతిపదికన జరుగుతోంది. కొత్త చట్టం వస్తే, కేవలం ఆధ్యాత్మిక వేత్తలు, ఆగమ శాస్త్ర పండితులు, నిజమైన భక్తులకు మాత్రమే బోర్డులో చోటు దక్కుతుంది. నిధుల వినియోగంపైనా కఠిన నిబంధనలుంటాయ్. శ్రీవారి హుండీ ఆధాయాన్ని కేవలం హిందూ ధర్మ ప్రచారం, భక్తుల సౌకర్యాలు, దేవాలయ నిర్వహణకు మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఇతర ప్రయోజనాల కోసం ఒక్క రూపాయి కూడా మళ్లించడానికి వీలుండదు. వీటికి మించి.. అత్యున్నత స్థాయి భద్రత, క్రమశిక్షణ కనిపిస్తాయి. స్వర్ణ దేవాలయంలో ఏ చిన్న తప్పు జరిగినా.. శిక్ష చాలా కఠినంగా ఉంటుంది. తిరుమలలోనూ భక్తులకు అసౌకర్యం కలిగించినా, అవినీతికి పాల్పడినా తక్షణమే కఠిన చర్యలు తీసుకునే యంత్రాంగం అమల్లోకి వస్తుంది. క్రిమనల్ చర్యలు తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయ్.


**పారదర్శకతకు కొత్త ప్రమాణం :** స్వర్ణ దేవాలయం మోడల్లో జవాబుదారీతనం అత్యంత కీలకం. తిరుమలలోనూ ఏఐ ఆధారిత నిఘా, డిజిటల్ ట్రాకింగ్ ద్వారాప్రతిసేవని పర్యవేక్షిస్తారు. లడ్డూ నాణ్యత నుంచి హుండీ లెక్కిం పు దాకా అంతా పారదర్శకంగా మారుతుంది. భక్తులతో అసభ్యంగా ప్రవర్తించే సిబ్బందిపై వేటు వేయడమే కాదు, వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోని విధంగా రూల్స్ ఉంటాయ్. ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారు సామాన్యులైనా, వీఐపీలైనా.. చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తిరుమల కొండపై పరిపాలనలో మార్పులు వస్తే.. అది నేరుగా భక్తులకు కలిగే ఆధ్యాత్మిక అనుభూతిపై ప్రభావం చూపుతుంది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవస్థలు తగ్గి, ప్రశాంతమైన దర్శనం లభిస్తుంది. కొండపై సామాన్య భక్తుడిని దోచుకునే దళారీ వ్యవస్థ పూర్తిగా అంతమవుతుంది. తిరుమల గిరుల్లో.. గోవింద నామస్మరణ తప్ప.. ఇతర చర్చ లు, అనవసర హడావుడి కనిపించని విధంగా పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణమే ఏర్పడుతుంది. భక్తులు కూడా కేవలం భక్తి మార్గంలోనే ఈ వ్యవస్థ నడవాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న ఈ మార్పులు.. కొండపై అమలులోకి వస్తే.. తిరుమల మళ్లీ కలియుగ వైకుంఠంగా పూర్వవైభవాన్ని సంతరించుకుంటుంది.

**తిరుమల కొండపై అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ :** తిరుమల కొండపైనే అత్యాధునిక సౌకర్యాలతో ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు చేసే ఆలోచనతో ఉంది ప్రభుత్వం. భక్తులకు సురక్షితమైన, నాణ్యత కలిగిన ప్రసాదాలు, ఆహారాన్ని అందించేందుకు, ముడి పదార్థాలను పరిశీలించేందుకు వీలుగా ఈ ల్యాబ్ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం.. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 25 కోట్లు మంజూరు చేసింది. అత్యాధునిక పరికరాలు, యంత్రాలతో సిద్ధం చేస్తున్న ఈ ల్యాబ్ మార్చిలో అందుబాటులోకి వస్తుంది. స్వామి వారి ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యితో పాటు అన్ని రకాల ముడిసరుకులు, ప్రసాదాల నాణ్యతను ఇందులోనే పరీక్షిస్తారు. ఇప్పటికే ల్యాబ్ ఏర్పాటు పనులు 90 శాతం దాకా పూర్తయ్యాయ్. ఆహార పదార్థాలు, ప్రసాదాల్లో 200 రకాల పురుగు మందుల అవశేషాలను గుర్తించే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఈ ల్యాబ్లో ఏర్పాటు చేయనున్నారు. దీని నిర్వహణపై.. త్వరలోనే వైద్య ఆరోగ్యసాఖ, టీటీడీ మధ్య ఒప్పందం కుదరనుంది.

**వెంకటేశ్వర దాస్ - సూర్య కల్చరల్ రిపోర్టర్,**
**విశాఖపట్నం - 99892 65111**



## డిక్లరేషన్ తప్పని సరి



రుమల శ్రీవారి ఆలయంలోకి అన్యమతస్తులు ప్రవేశించాలి అంటే డిక్లరేషన్ ఇవ్వడం తప్పనిసరి చేస్తూ, నిబంధనల్లో మార్పులు చేయాలి అన్న నిర్ణయానికి వచ్చారు. టీటీడీ నిబంధనలు ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలి అంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలి అని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు డిక్లరేషన్ నిబంధన ఉన్నప్పటికీ అమలు విషయంలో సడలింపులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇకపై ఎవరైనా అన్యమతస్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే తప్పనిసరిగా తమ విశ్వాసాన్ని ప్రకటించే పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుందని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంకు ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధానంగా . ఇక తిరుమలలో డిక్లరేషన్ విషయం కూడా అప్పుడప్పుడూ రాజకీయ రచ్చకు కారణమవుతూ ఉంటుంది. ముఖ్యంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుమల పర్యటన సమయంలో డిక్లరేషన్ అంశం ఏపీలో పొలిటికల్ వార్‌కు దారితీస్తు ఉంటుంది. ఈ క్రమంలోనే డిక్లరేషన్ నిబంధనను కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కూటమి సర్కారు ఆలోచిస్తోంది.

## గోల్డెన్ టెంపుల్ చట్టంపై ప్రభుత్వ దృష్టి



ప్రస్తుతం టీటీడీ వ్యవహారాలన్నీ 1987 నాటి ఆంధ్రప్రదేశ్ హిందూ ధార్మిక సంస్థల చట్టం పరిధిలో కొనసాగుతున్నాయి. అయితే, అమృత్సర్లోని గోల్డెన్ టెంపుల్ నిర్వహణ కోసం ఉన్న స్వయంప్రతిపత్తి కలిగిన చట్టాన్ని ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. టీటీడీని ప్రభుత్వ విభాగంగా కాకుండా, పూర్తి స్వయం ప్రతిపత్తి ఉన్న సంస్థగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయ్. దేవాలయ నిధులు, ఆస్తులు, పాలనా నిర్ణయాల్లో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి, హిందూ ధర్మంపై అవగాహన ఉన్న ప్రముఖులకే పగ్గాలు అప్పగించే ఆలోచన చేస్తున్నారు. ఇక.. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిన వ్యవహారం తీవ్ర విమర్శలకు దారితీసింది. దాంతో.. కల్తీకి అడ్డుకట్ట వేసేలా నెయ్యితో పాటు ఇతర ముడి పదార్థాల సేకరణలో ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేయబోతోంది. టీటీడీలో కల్తీ నెయ్యి సరఫరా వంటి అపచారాలు ఇక పై జరగకుండా, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా నిబంధనల్ని మరింత తీవ్రతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అవసరమైతే ప్రత్యేక చట్టం తేవాలి అన్న యోచనలో ఉంది. తిరుమలలోను కూడా స్వర్ణ దేవాలయం తరహాలో చట్టాన్ని తీసుకు వచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.




# జింబాబ్వేపై భారత్ ఘన విజయం

**- సెమీస్ ఆశలు సజీవం - గెలుపు బాట పట్టిన భారత్ - 184 పరుగులకే పరిమితమైన జింబాబ్వే**



సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా అదరగొట్టింది. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. 257 పరుగుల భారీ ఛేదనలో జింబాబ్వే ఓవర్లన్నీ ఆడి 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితం అయ్యింది. బ్రియాన్ బెన్నెట్ (97 పరుగులు) భారీ ఇన్నింగ్స్ వృథా అయ్యింది. టీమ్‌ఇండియా బౌలర్లలో అర్షదీప్ 3, వరణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.కాగా, ఛేదనలో జింబాబ్వే పూర్తిగా చేతులేమి ఎత్తేయలేదు. కళ్ల ముందు భారీ లక్ష్యం ఉన్నప్పటికీ ఆత్మ విశ్వాసంతోనే పోరాడింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అద్భుతంగా పోరాడాడు. కెప్టెన్ సికందర్ రజా (31 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. వీళ్ల పోరాటంతో జింబాబ్వే ఓటమి అంతరాన్ని తగ్గించుకుంది. ఇక మెరుపు ఇన్నింగ్స్‌తో హాఫ్ సెంచరీ సాధించిన టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్ద్ పాండ్యకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది.

**రెండో బ్యాటర్‌గా ఘనత :** జింబాబ్వే బ్యాటర్ బెన్నెంట్ ఈ మ్యాచ్‌లో సెంచరీకి 3 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అయినప్పటికీ అతడు అరుదైన ఘనత సాధించాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పై రెండో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ లిస్ట్‌లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ టాప్‌లో ఉన్నాడు. 2010 ఎడిషన్‌లో అతడు భారత్‌పై 98 పరుగులు సాధించాడు. ఇదే పొట్టి కప్పులో భారత్‌పై ఓ బ్యాటర్ సాధించిన అత్యధిక వ్యక్తిగత స్కోర్.

**భారత్ ధనాధన్ :** అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్ విధ్వంసం సృష్టించింది. నిర్ణీత 20 ఓవర్లలో టీమ్‌ఇండియా 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (55 పరుగులు), హార్దిక్ పాండ్య (50 పరుగులు, 23 బంతుల్లో), తిలక్ వర్మ (44 పరుగులు), ఇషాన్ కిషన్ (38 పరుగులు), సూర్యకుమార్ యాదవ్ (33 పరుగులు) మెరుపులు మెరిపించారు. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ ఎంగరవ, బ్లెస్సింగ్స్ ముజర్బాని, మపోస, సికందర్ రజా తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

**సెమీఫైనల్ రేస్‌పై క్లారిటీ :** తాజా మ్యాచ్ ఫలితంతో గ్రూప్ 1 సెమీస్ రేస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. జింబాబ్వేపై భారత్ నెగ్గడంతో సౌతాఫ్రికా సెమీస్‌కు అర్హత సాధించింది. అలాగే ఈ విజయంతో భారత్ కూడా తమ సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. సూపర్ 8లో ఇప్పటిదాకా రెండు మ్యాచ్‌ల్లో ఒక విజయం సాధించిన టీమ్‌ఇండియా 2 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ గ్రూప్‌లో మిగిలిన ఒక స్థానం కోసం భారత్- వెస్టిండీస్ మధ్య పోటీ ఉంది. మార్చి 01న ఈ రెండు జట్లే తలపడాల్సి ఉంది. ఇందులో విజయం సాధించిన జట్టు నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. ఎలాంటి సమీకరణాలు చూసుకోవాల్సిన పని లేదు. ఇక సూపర్ 8లో వరుసగా రెండు ఓటములతో జింబాబ్వే సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది.

టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఒక మ్యాచ్‌లో నమోదైన అత్యధిక స్కోర్లు (ఇరు జట్ల స్కోర్లు కలిపి)

459 పరుగులు - సౌతాఫ్రికా వెసర్స్ ఇంగ్లాండ్ - వాంఖడే 2016
440 పరుగులు - భారత్ వెసర్స్ జింబాబ్వే - చెన్నై 2026
418 పరుగులు - భారత్ వెసర్స్ ఇంగ్లాండ్- డర్బన్ 2007
413 పరుగులు - వెస్టిండీస్ వెసర్స్ సౌతాఫ్రికా- జొహెన్నస్‌బర్గ్ 2007
401 పరుగులు - వెస్టిండీస్ వెసర్స్ జింబాబ్వే- వాంఖడే 2026

**భారత్ చెత్త రికార్డ్ :** ఈ మ్యాచ్‌లో రెండు నో బాల్స్‌తో కలిపి భారత్ ప్రస్తుత టోర్నీలో ఇప్పటిదాకా మొత్తం 7 నోబాల్స్ వేసింది. ఈ క్రమంలో టీ20 ప్రపంచకప్‌లో సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా కెనడాతో సమానంగా నిలిచింది. కాగా, ఈ ఏడులో ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఒక్కడే 5 నోబాల్స్ వేయడం గమనార్హం.

# మ్యాచ్‌కు ముందు ట్యాబ్లెట్లు

## ఇంజెక్షన్లు తీసుకునేవాడిని".. షోయబ్ అక్తర్ సంచలన స్టేట్‌మెంట్



వరల్డ్ క్రికెట్‌లో అత్యంత వేగంగా బౌలింగ్ చేసిన ప్లేయర్ షోయబ్ అక్తర్. ఫాస్ట్ బౌలర్ల యుగంలోనూ షోయబ్ అక్తర్ క్రియేట్ చేసిన రికార్డు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. అయతే 1997లో అంతర్జాతయ ఆరంగ్రేటం చేసిన షోయబ్ అక్తర్, ఎప్పుడూ పాకిస్థాన్ టీమ్‌కి కెప్టెన్సీ చేయలేదు.. పాకిస్థాన్ తరుపున 46 టెస్టులు, 163 వన్డేలు, 15 టీ20 మ్యాచులు ఆడిన షోయబ్ అక్తర్, 2003 వన్డే వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 161.3 కి.మీ.ల వేగంతో బౌలింగ్ చేశాడు. ఇప్పటికీ ఈ రికార్డును ఎవ్వరూ బ్రేక్ చేయలేకపోయారు.. అయితే అప్పట్లో క్రికెట్ పోటీలు ఎంత భీకరంగా ఉండేవో పెద్దగా చెప్పనవసరం లేదు.

ప్రపంచంలోనే వేగవంతమైన బౌలర్‌గా పేరు తెచ్చుకున్న షోయబ్ అక్తర్ తాజాగా ఒక షాకింగ్ విషయం బయటపెట్టాడు. 1998-99లో భారత్ పర్యటన సమయంలో మోకాళ్ల నొప్పితో బాధపడుతూ మ్యాచ్ ఆడేందుకు తాను, పాక్ మాజీ స్పిన్నర్ సక్లైన్ ముస్తాక్ రహస్యంగా మాత్రలు, ఇంజెక్షన్లు తీసుకున్నామని చెప్పాడు. ఆ సమయంలో ఇద్దరి మోకాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ.. మ్యాచ్ మిస్ అవ్వకూడదనే ఉద్దేశంతో ఇలా చేశామని వెల్లడించాడు. సీనియర్లు తెలుసుకుంటే జట్టులో నుంచి బయటకు పంపించేవాళ్లని తెలిపాడు. ఈ విషయాన్ని ఓ టీవీ డిబెట్‌లో అక్తర్ బట్టబయలు చేశాడు. అయితే.. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయాన్ని అక్తర్ వివరించాడు. నాడు సచిన్ వికెట్‌పై సక్లైన్, అక్తర్ మధ్య బెట్టింగ్ నడిచేదట. సచిన్‌ను ఎవరు ఔట్ చేస్తారన్నదే అంశంలో వారిలో వారే పోటీ పెట్టుకునే వారట. అప్పటి రైవల్రీ ఎంత తీవ్రంగా ఉండేదో ఈ మాటలు ద్వారా అర్థం అవుతుంది. ఒకవైపు వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ వంటి బ్యాటర్లు అక్తర్ బౌలింగ్‌ను ఎదుర్కొని ఆధిపత్యం చెలాయించిన సందర్భాలున్నా.. కొన్ని మ్యాచ్‌ల్లో అక్తర్ పైచేయి సాధించాడు. కాగా.. భారత్-పాక్ మధ్య చివరి ద్వైపాక్షిక సిరీస్ 2012-13లో జరిగింది. రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇప్పుడు ఈ రెండు జట్లు ఐసీసీ, ఆసియా టోర్నీల్లో మాత్రమే తలపడుతున్నాయి. తాజాగా టీ20 వరల్డ్‌కప్ 2026లోనూ భారత్ పాకిస్థాన్‌పై విజయం సాధించింది.

# సెమీస్ రేస్‌లో భారత్?

## నేడు క్లారిటీ వచ్చే అవకాశం



టీ20 వరల్డ్ కప్ 2026 కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం జరుగుతున్న సూపర్ 8 మ్యాచులు అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నాయి. ఇంగ్లాండ్ జట్టు ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోగా, మిగిలిన మూడు స్థానాల కోసం ఏడు జట్ల మధ్య పోరు సాగుతోంది. గ్రూప్ 1, గ్రూప్ 2 లలో సమీకరణాలు రోజుకో రకంగా మారుతున్నాయి. ప్రతీ మ్యాచ్ ఫలితం ఇప్పుడు కీలకం కానుంది. రెండు గ్రూపులలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్ల నుంచి చివరిలో ఉన్న జట్ల దాకా ప్రతి ఒక్కరికీ సెమీస్ అవకాశం ఉన్నా, అది ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉండటం విశేషం. అసలు ఏ జట్టు సెమీస్ చేరాలంటే ఏం జరగాలి? ఆ లెక్కలేంటో ఇప్పుడు చూద్దాం.

**గ్రూప్ 1 ఇలా**

భారత్ సెమీస్‌కు చేరాలంటే తదుపరి రెండు మ్యాచ్ (జింబాబ్వే, వెస్టిండీస్)ల్లోనూ భారీ తేడాతో నెగ్గాలి. అదే సమయంలో సౌతాఫ్రికా కూడా తమ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గితే టీమ్‌ఇండియా నేరుగా సెమీస్‌కు వెళ్తుంది

కానీ విండీస్‌తో మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఓడిపోతే పోటీ రసవత్తరంగా మారుతుంది. అప్పుడు భారత్, వెస్టిండీస్ నాలుగు పాయింట్లతో సమానంగా ఉంటాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ముందడుగు వేస్తుంది ఇక టీమ్‌ఇండియా రెండు విజయాలు సాధించి, సౌతాఫ్రికాపై విండీస్, జింబాబ్వేపై సౌతాఫ్రికా నెగ్గితే అప్పుడు మూడు జట్లు నాలుగు పాయింట్లతో ఉంటాయి. ఇందులోనూ రన్‌రేటే కీలకం అవుతుంది. మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు సెమీస్‌కు వెళ్తుంది మరోవైపు, విండీస్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన జింబాబ్వే ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉంది. ఆ జట్టు సెమీస్ రేసులో ఉండాలంటే భారత్, సౌతాఫ్రికా వంటి బలమైన జట్లను భారీ తేడాతో ఓడించాలి. అప్పుడు ఇతర జట్ల ఫలితాలు అనుకూలిస్తే 4 పాయింట్లతో మెరుగైన రన్‌రేట్ ఉంటే జింబాబ్వేకు కూడా అవకాశం దక్కవచ్చు.

**గ్రూప్ 2 : మిగిలింది ఒక్క స్థానమే!**

గ్రూప్ 2 నుంచి ఇంగ్లాండ్ వరుసగా రెండు విజయాలు సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. వరుసగా ఐదోసారి సెమీస్ చేరి ఇంగ్లాండ్ కొత్త రికార్డు నెలకొల్పింది. ఇక రెండో స్థానం కోసం న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక పోటీ పడుతున్నాయి. న్యూజిలాండ్ తన మిగిలిన మ్యాచుల్లో శ్రీలంక, ఇంగ్లాండ్‌పై గెలిస్తే నేరుగా సెమీస్ వెళ్తుంది. ఒకవేళ కివీస్ ఒక మ్యాచ్‌లో ఓడిపోతే పాకిస్థాన్‌కు అవకాశం ఉంటుంది.

**పాకిస్థాన్, శ్రీలంక- ఛాన్స్ ఎవరికి?**


పాకిస్థాన్ సెమీస్ వెళ్లాలంటే తన చివరి మ్యాచులో శ్రీలంకపై కచ్చితంగా గెలవాలి. అదే సమయంలో న్యూజిలాండ్, శ్రీలంక లేదా ఇంగ్లాండ్ చేతిలో ఓడిపోవాలని కోరుకోవాలి. ఒకవేళ న్యూజిలాండ్ ఓడిపోతే పాకిస్థాన్‌కు ఛాన్స్ దొరికినట్లే. ఇక ఆతిథ్య జట్టు శ్రీలంక పరిస్థితి దారుణంగా ఉంది. ఆ జట్టు సెమీస్ చేరాలంటే న్యూజిలాండ్, పాకిస్థాన్‌పై గెలవడమే కాకుండా రన్‌రేట్ మెరుగుపరుచుకోవాలి. ఒక్క ఓటమి ఎదురైనా లంక జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఇంగ్లాండ్ మినహా మిగిలిన జట్లన్నీ సెమీస్ కోసం చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, గ్రూప్ 1లో సెమీస్ రేస్‌లో గురువారం కీలకం కానుంది. రేపు తొలుత వెస్టిండీస్- సౌతాఫ్రికా మ్యాచ్ ఉంది. ఆ తర్వాత భారత్- జింబాబ్వే పోరు ఉండనుంది. ఈ గ్రుప్‌లో సెమీస్ బెర్తులపై ఓ అవగాహన రావాలంటే రేపటి మ్యాచ్‌లు కీలకం కానున్నాయి.

**భారత్ తదుపరి మ్యాచ్‌లు**

భారత్ జింబాబ్వే - ఫిబ్రవరి 26- చెన్నై చిదంబరం స్టేడియం
భారత్ వెస్టిండీస్ - మార్చి 01- ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతా

# చెన్నైలో 'సూపర్'.. 'డ్యూ'పర్..

## తేమతో ఇక ఉండదు ఇబ్బంది!



పొట్టి ప్రపంచకప్ 2026 సూపర్-8లో భాగంగా మరికొన్ని గంటల్లో చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా టీమ్‌ఇండియా జింబాబ్వే జట్లు పోటీ పడనున్నాయి. సెమీస్‌కు అర్హత సాధించాలంటే భారత్‌కు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. ఈ పోరు సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో క్రికెట్ అభిమానులకు ఓ గుడ్‌న్యూస్. డ్యూ ప్రభావం మ్యాచ్ మీద పడకుండా ఉండటం కోసం దిగుమతి చేసుకున్న 'డ్యూ కూర్' అనే పేరుతో పిలిచే ఓ ప్రత్యేక రసాయనాన్ని మైదానంలో స్ప్రే చేయించారు. ఈ కెమికల్‌ను యూఎస్‌ఏ నుంచి తెప్పించినట్లుగా తెలుస్తోంది. డ్యూ కూర్‌ను మంగళ, బుధవారాలు మైదానంలో ముఖ్యంగా అవుట్‌ఫీల్డ్‌లో మైదాన సిబ్బంది పిచికారీ చేశారు. మ్యాచ్ జరిగే సమయంలో తేమశాతం 80 నుంచి 90 వరకు ఉండనుంది. ఈ నేపథ్యంలోనే తేమను నియంత్రించడం కోసం ఈ చర్యలు చేపట్టారు. దీంతో మ్యాచ్‌లో ముఖ్యంగా సెకండ్ ఇన్నింగ్స్‌లో డ్యూతో ఫీల్డింగ్ టీమ్‌కు ఇబ్బంది ఉండదు. సాధారణంగా చెపాక్ పిచ్.. స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. బంతి చక్కగా టర్న్ అవుతుంది. బ్యాటింగ్‌కు సహకరించినా బ్యాటర్లకు కాస్త ఓపిక అవసరం. అయితే డ్యూ వస్తే మాత్రం బంతి స్కిడ్ అవుతుంది. ఈ నేపథ్యంలో టాస్ కీలకంగా మారనుంది. అందుకే జట్లు ఫ్లడ్ లైట్ల వెలుగులో ఛేజింగ్‌ను ఇష్టపడతాయి. అయితే ప్రస్తుతం ప్రత్యేక రసాయనాన్ని స్ప్రే చేసిన నేపథ్యంలో డ్యూ ప్రభావం ఎలా ఉంటుందనే విషయమై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అలాగే టాస్ గెలిచిన జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంటుందా.. లేక బౌలింగ్ తీసుకుంటుందా.. అనే చర్చ జరుగుతోంది.

# దుమ్మురేపిన జమ్ము

హుబ్లీ వేదికగా కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ దుమ్ము రేపింది. 527/6 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన జమ్మూ జట్టు 584 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. ప్రత్యర్థి కర్ణాటకు 585 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో రోజు హాఫ్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచిన సాహిల్ లోత్రా నేడు 72 పరుగులకు పెవిలియన్ చేరాడు. 20 రన్స్‌తో బ్యాటింగ్‌కు దిగిన అబిద్ ముస్తాక్ మరో 8 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆఖరి వికెట్‌గా యుద్వీర్ సింగ్(30) రనౌట్ అయ్యాడు అయితే జమ్మూ కశ్మీర్ ఇన్నింగ్స్‌లో ఓ శతకం, ఐదు హాఫ్ సెంచరీలు నమోదు కావడం విశేషం. శుభమ్ పుందిర్(121), హసన్(88), అబ్దుల్ సమద్(61), కన్హిహా వాదవాన్(70), సాహి లోత్రా(72) అద్భుతంగా రాణించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. యుద్వీర్ పాటిల్, విజయ్ కుమార్ వైశాఖ్, శ్రేయస్ గోపాల్, శిఖర్ శెట్టి తలో వికెట్ తీసుకున్నారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక తడబడుతోంది. 44 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(13), దేవ్‌దత్త్ పడిక్కల్(11), కరుణ్ నాయర్(0), సమరన్ రవిచంద్రన్(0) తీవ్రంగా విఫలమయ్యారు. మయాంక్ అగర్వాల్(85) హాఫ సెంచరీ సాధించాడు. మరో ఎండ్‌లో శ్రేయాస్ గోపాల్(25) కొనసాగుతున్నాడు. జమ్మూ బౌలర్లలో అకిబ్ నబీ దార్ 3 వికెట్లతో చెలరేగాడు. సునీల్ కుమార్ ఓ వికెట్ తీసుకున్నాడు.

# రింకు సింగ్ ఈజ్ బ్యాక్.. !



టీ20 ప్రపంచకప్ 2026లో సూపర్-8 దశలో ఉన్న టీమ్ ఇండియాకు భారీ ఊరట లభించింది. వ్యక్తిగత కారణాలతో స్వల్ప విరామం తీసుకున్న స్టార్ ఫినిషర్ రింకూ సింగ్ తిరిగి జట్టుతో చేరనున్నారు. గురువారం (ఫిబ్రవరి 26) జింబాబ్వేతో జరగనున్న కీలక పోరుకు ముందు అతను జట్టులోకి రావడం భారత శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. అయితే, రింకూ సింగ్ తండ్రి ఖంచంద్ సింగ్ తీవ్ర అనారోగ్యం పాలవ్వడంతో, కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా రింకూ.. మంగళవారం జట్టును వీడి ఇంటికి వెళ్లారు. దీనితో జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌లో అతను ఆడటంపై సందిగ్ధత నెలకొంది. అయితే, తాజా సమాచారం ప్రకారం అతని తండ్రి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉండటంతో, రింకూ తిరిగి జాతీయ విధుల్లో చేరాలని నిర్ణయించుకున్నాడు.

భారత బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ ( బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రింకూ సింగ్ తిరిగి జట్టులో చేరడాన్ని ధృవీకరించారు. "రింకూ సింగ్ బుధవారం సాయంత్రం కల్లా తిరిగి జట్టులో చేరాడు . అతని తండ్రి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ఇది పూర్తిగా వ్యక్తిగత విషయం. అతను తిరిగి రావడంతో జట్టులో తుది ఎంపికకు మరిన్ని అవకాశాలు మెరుగుపడతాయి," అని కోటక్ పేర్కొన్నారు.

**వరల్డ్ కప్‌లో రింకూ ప్రదర్శన**

ప్రస్తుత ప్రపంచకప్‌లో రింకూ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. గత ఐదు ఇన్నింగ్స్‌ల్లో అతను కేవలం 24 పరుగులు మాత్రమే చేశాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన గత మ్యాచ్‌లో డకౌట్ అయినప్పటికీ, డెత్ ఓవర్లలో అతని హిట్టింగ్ సామర్థ్యంపై యాజమాన్యం పూర్తి నమ్మకంతో ఉంది. ఈ టోర్నీలో : 6 పరుగులు, నమీబియా: 1 పరుగు, పాకిస్తాన్: 11 పరుగులు, నెదర్లాండ్స్: 6 పరుగులు చేసిన రింకూ సింగ్.. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు..

**జింబాబ్వేపై తిరుగులేని రికార్డు**

గతంలో జింబాబ్వేపై రింకూ సింగ్ ఆడిన రికార్డులు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా హరారే వేదికగా జరిగిన మ్యాచ్‌లో అతను చేసిన 48 నాటౌట్ ఇన్నింగ్స్ జట్టును ఆదుకుంది. రేపటి మ్యాచ్ చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరగనుండటంతో, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల రింకూ ఉనికి జట్టుకు కీలకం కానుంది. భారత్ ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తేనే సెమీఫైనల్ రేసులో తమ అవకాశాలను మెరుగుపరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో రింకూ 'మిడాస్ టచ్' తిరిగి కనిపిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



# అర్జున్ తెండూల్కర్ కోసం.. అంబానీ కుటుంబం ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్

క్రికెట్ దిగ్గజం సచిన్ ఇంట పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. మార్చి తొలి వారంలో ఆయన కుమారుడు అర్జున్ తెండూల్కర్ వివాహం జరగనుంది. ఆయన స్నేహితురాలు సానియా చందోక్‌నే అర్జున్ పెళ్లాడనున్నాడు. ఈనేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం వీరి ప్రీ వెడ్డింగ్ వేడుకలను నిర్వహించింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరిగిన ఈ వేడుకల్లో నీతా అంబానీ, ఆకాశ్, శ్లోకా, అనంత్, రాధికతో సహా అంబానీ కుటుంబసభ్యులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీటికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈసందర్భంగా నీతా అంబానీ మాట్లాడుతూ.. సచిన్, అంజలి తెండూల్కర్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి వివరించారు. వారిని తమ కుటుంబంలో ఒకరిగా పేర్కొన్నారు. అనంత్, రాధికల ప్రయాణం కూడా ఇక్కడినుంచే ప్రారంభమైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అర్జున్‌ను తమ స్కూల్‌లో చిన్నపిల్లాడిగా ఉన్నప్పటి నుంచి చూస్తున్నామని అన్నారు. సానియా చుట్టూ పాజిటివిటీ ఉందన్నారు. వీరు జీవితాంతం ఒకరికొకరు కలిసి ఉండాలని ఆశీర్వదించారు.

సచిన్ తెండూల్కర్ కు అంబానీలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా ముకేశ్ అంబానీతో సచిన్‌కు దశాబ్దాలుగా వ్యక్తిగత అనుబంధం ఉంది. ముంబయి ఇండియన్స్‌కు సచిన్ మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. అర్జున్ కూడా పలు సీజన్లలో ముంబయి ఇండియన్స్ తరఫున ఆడడమే కాదు, ముంబయిలోని ధీరుభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లోనే చదువుకున్నాడు.

సూర్య www.suryaa.com

# సినిమా

### పెద్ది సెకండ్ సింగిల్

# రై రై రా.. రా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా ప్రాజెక్ట్ పెద్ది సినిమా వేసవిలో గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధ మవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్ కు వేదికగా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన పెద్దిలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్‌తో రికార్డులను బద్దలు కొట్టాయి. ఎక్సయిట్మెంట్‌ని మరింతగా పెంచుతూ మార్చి 2న రెండవ సింగిల్ రై రై రా రా విడుదలతో బజ్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళబోతోంది. సాంగ్ పోస్టర్‌లో రామ్ చరణ్ మ్యాసీ అవతార్ లో కనిపిస్తున్నారు. రగ్గడ్ దుస్తులు, చిరిగిన జుట్టు, గడ్డం, భుజంపై పెద్ద సుత్తిని వేలాడదీసుకుని, మెరిసే చిరునవ్వుతో కనిపి స్తున్నారు, బ్యాక్ డ్రాప్ లో గందరగోళం చెలరేగుతున్నప్పటికీ, ప్రజలు అతని చుట్టూ పరిగెత్తుతున్నారు.

### థియేటర్లో ఎంజాయ్ చేసే మంచి ఎంటర్‌టైనర్

# విష్ణు విన్యాసం



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ విష్ణు విన్యాసంతో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?**

అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

**విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?**

డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా నవ్వుకోవచ్చు. కథ విన్న వెంటనే మొదలుపెట్టాం.

**ఇందులో హీరోయిన్‌ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?**

ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. హీరోయిన్ డామినేషన్ సినిమాలో నా క్యారెక్టర్ కి ప్రాబ్లం అవుతూ ఉంటుంది. ఆడియన్స్ మాత్రం చాలా బాగా కనెక్ట్ అవుతారు. అందునుంచి చాలా మంచి ఫన్ జనరేట్ అవుతుంది. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కాస్త అనుమానస్పదంగా ఉంటుంది. నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్ తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్యామిలీ కామెడీ ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

### 9 దేశాల టాప్ మ్యూజిక్ చార్టులలో అదరగొడుతున్న

# ది ప్యారడైజ్ సాంగ్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది. ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం. ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంటుంది.

# శ్రీ చిదంబరంగారు

### స్ట్రీమింగ్‌కి రెడీ



వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన బ్లాక్ బ్లాక్ బస్టర్ చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమయ్యారు. చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన ఈ చిత్రం థియేటర్స్ లో అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం ఫిబ్రవరి 26 నుంచి ఈవిన్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ గ్రాండ్ గా నిర్వహించారు. డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ వినయ్ ని ఇప్పుడే కలుస్తున్నాను. కానీ తన ఇంటర్వ్యూ ఒకటి చూశాను. నా జర్నీ నేను గుర్తుకొచ్చింది. 25 ఏళ్ల ఒక అబ్బాయికి ఇంత పాషన్ తో సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఖచ్చితంగా తను భవిష్యత్తులో చాలా గొప్ప కథలు చెబుతాడు. ఈటీవీ విన్ కారణంగా చాలా కొత్త కంటెంట్, కొత్త ఫిలిం మేకర్స్ ఇండస్ట్రీకి వస్తున్నారు. డైరెక్టర్ వినయ్ వాయిస్ లో నిజాయితీ ఉంది. ఈ సినిమాలో నిజాయితీ ఉంది. ఈ సినిమా మీ అందరికీ కనెక్ట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమ చిరకాలం ఉంటుంది. ఇంత మంచి సినిమాలను ప్రేమించే మన ఆడియన్స్ కోసం ఈటీవీ ఇలాంటి మంచి కథలు చెబుతున్నారు. 45 రూపాయలకి సబ్స్క్రిప్షన్ తీసుకోండి. చాలా హార్ట్ ఫుల్ గా చెప్పిన కథ ఇది. ఈ సినిమా చూశాక కచ్చితంగా చాలామంది ఫిలిం మేకర్స్ ఇన్స్పైర్ అవుతారు. ఈటీవీలో ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది.

### వెంకీ, కళ్యాణ్‌రామ్ కాంబోకి

# అనిల్ దర్శకత్వం

బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్‌మెంట్ తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి.. ఈ సంక్రాంతికి వచ్చిన మన శంకరవరప్రసాద్ గారుతో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్ ని నమోదు చేశారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్ట్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు. 2, 3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటివలే లో అతిథి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం. దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్ ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్ తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది.



### ఫ్యామిలీ అంతా చూడదగ్గ 'సన్ ఆఫ్'



సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'సన్ ఆఫ్'. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత, నటుడు అశోక్ కుమార్, రామ సత్య నారాయణ రాజు, లైన్ వెంకట్, కన్నా రవి, రామకృష్ణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. నిర్మాత, హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూ .. 'సతీష్ గారు 'సన్ ఆఫ్' కథను నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఆయన చెప్పిన కథను విన్న తరువాత నా జీవితంలో జరిగినట్టుగానే ఉంది కదా అని అనిపించింది. యదార్థ ఘటనలతో ఈ మూవీని తెరకెక్కించారని కూడా చెప్పుకోవచ్చు. నాన్న మనకు క్రమ శిక్షణ, చదువు, సమయ పాలన వంటివి ఇస్తారు.

# బ్రేక్ ఈవెన్ సాధించిన హే బల్‌వంత్



ప్రామిసింగ్ కథానాయకుడు సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ హే బల్‌వంత్. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈనెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకపోతుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తొలిసారిగా, వినూత్నంగా థాంక్యూ మీట్ ఫర్ బ్రేక్ ఈవెన్ డన్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ మా బ్యానర్‌లో వచ్చిన తొలి సక్సెస్ ఇది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతృప్తి చెందారు. ఓ మంచి సినిమా తీశానని అభినందించారు. కొన్ని థియేటర్స్‌కి వెళ్లి నేను ఆడియన్స్ మధ్యలో సినిమా చూశాను. సినిమాను అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాకు ఇది ఎంతో సంతృప్తి నిచ్చింది. ఓ మంచి సినిమా తీశాననే భావన కలిగింది. తప్పకుండా సినిమా చూడని వాళ్లు అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను అన్నారు.

# కొడవ పద్ధతిలో రష్మిక - విజయ్ పెళ్లి





చాలా కాలంగా ఊరిస్తున్న విరోష్ పెళ్లి ముహూర్తం రానే వచ్చింది. ఇప్పటికే విజయ్,రష్మిక ల పెళ్లి ఉదయ్‌పూర్ వేదికగా తెలుగు సాంప్రదాయం ప్రకారం జరిగిపోయింది. కొడవ సంప్రదాయాల మేళవింపుతో ఈ వేడుక నేడు సాయంత్రం మరింత అంగరంగ వైభవంగా జరగబోతోంది. ముఖ్యంగా రష్మిక సొంత ఊరైన కొడవ (కూర్గ్) సంప్రదాయం ప్రకారం జరిగే వివాహ తంతు ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తోంది. అస్సలు బ్రాహ్మణ పురోహితులు లేకుండా, పెద్దల సమక్షంలో ప్రకృతి సాక్షిగా జరిగే ఈ అరుదైన పెళ్లి వేడుక విశేషాలు ఇప్పుడు చూద్దాం.. ఎన్ని వందల కోట్లంటే? ప్రకృతి సాక్షిగా.. పెద్దల ఆశీస్సులతో: కొడవ సంప్రదాయం చాలా ప్రత్యేకం. ఇందులో మిగతా పెళ్లిళ్లలాగా అగ్ని సాక్షిగా ఏడు అడుగులు వేయడం, బ్రాహ్మణ పూజారి మంత్రోచ్ఛరణలు ఉండవు. అంతా ప్రకృతిని, పూర్వీకులను స్మరిస్తూ సాగుతుంది. కావేరమ్మ (కావేరి నది)ని దైవంగా భావించి, కుటుంబ పెద్దల ఆశీస్సులతో ఈ బంధం ముడిపడుతుంది. ఇక రష్మిక తన పూర్వీకుల పద్ధతిని గౌరవిస్తూ, ఈ ఆచారాలను పాటించబోతుండటం విశేషం. ఉదయం తెలుగు పద్ధతిలో జరిగిన పెళ్లిలో విజయ్ సంప్రదాయం ప్రతిబింబిస్తే, సాయంత్రం జరిగే కొడవ వేడుకలో రష్మిక మూలాలు కళ్లముందు కదలాడనున్నాయి. కొడవ పెళ్లిలో ప్రధాన ఆకర్షణ వధువు కట్టుకునే చీర. సాధారణంగా మనం కొంగును ఎడమ భుజంపై వేసుకుంటే, కొడవ పద్ధతిలో చీర కుచ్చెళ్లు వెనుక వైపు ఉండి, కొంగు కుడి భుజంపై నుండి వస్తుంది. దీనినే కొడవ ఉడుగే అంటారు. దీనికి తోడు రష్మిక పాతక్ అనే సంప్రదాయ బంగారు నాణెం ఉన్న నెక్లెస్‌ను ధరించనుంది. ఇది ఆ సంప్రదాయంలో వివాహితకు ఇచ్చే అత్యంత పవిత్రమైన గుర్తు. ఇక విజయ్ కూడా కొడవ పురుషులు ధరించే కుప్య (నలుపు రంగు కోటు) వంటి ప్రత్యేక దుస్తుల్లో మెరిసే అవకాశం ఉంది. ఈ విభిన్నమైన ఆహార్యం ఈ జంటను మరింత స్పెషల్‌గా చూపించనుంది. ఈ పెళ్లిలో కేవలం పూజలే కాదు, నృత్యం మరియు సంగీతానికి పెద్దపీట వేస్తారు. కొడవ సంప్రదాయంలో వాల్గ అనే జానపద నృత్యం ఎంతో ఫేమస్. పెళ్లిలో బంధువులంతా కలిసి చేసే ఈ డాన్స్ ఉత్సాహాన్ని నింపుతుంది. ఇక పెళ్లి ముగిశాక మార్చి 4న హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం ఏర్పాటు చేసే విందులో కూడా ఈ రెండు రాష్ట్రాల వంటకాల రుచులు వడ్డించనున్నట్లు సమాచారం.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044